
ఆంధ్రపత్రిక

సచిత్ర వార పత్రిక



4 అణాలు

10-8-55

ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతి 4 అ.

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 48
సంచిక 49
10.8-55

మన్మథ శ్రావణ బహుళ సప్తమి బుధవారం



బండికింద వంట.

ఫోటో : ఎస్. వి. రమణారావు—హుజూర్ నగర్.

విషయానుక్రమణిక

ఏకాంకిక: 6

మండే నీడలు

గుడిమెళ్ల బాలా త్రిపురసుందరి

పాత్రలు:

సరళాదేవి,

తథాగతుడు.

ధనాఢ్యుడు, పరివ్రాజకుడు, బౌద్ధభిక్షువు, నర్తకి, తదితరులు.

1వ రంగం

[ధనాఢ్యుని కేళీగృహము. నేలపై రత్నకంబళి పరచిఉంటుంది. కంబళిపై సగము భాగముమీద బంగారు దారంతో నింపిన పట్టుపరుపు, పరుపుమీద ఇరుప్రక్కల తలగడలు ఉంటాయి. తలగడలమీద చేతులుంచుకొని ధనాఢ్యుడు కౌతుకంతో నర్తకి హావభావాలను తిలకిస్తూ ఉంటాడు. ప్రక్కనున్న పింగాణీ ఏనుగు గండస్థలంలో అగరు వత్తులను గుచ్చారు. అగరువత్తులనుంచి లేచిన పొగలచే గది అంతటా సువాసనలతో నిండి నిబిడీకృతమవుతుంది.

ధనాఢ్యుని ఎదుట నర్తకి నృత్యంచేస్తూ ఉంటుంది. ఆమె కుడి ఎడమలందు ఇద్దరు అందగత్తెలు తబల, సారంగి వాయిస్తూ జావళీ పాడుతుంటారు. గది అంతా ఇంద్రసభలా ఆనందంతో నిండిఉంటుంది. సరళాదేవి ప్రవేశిస్తుంది. విషణ్ణముఖి. పసిడి ఛాయగల యౌవనవతి. జుట్టు విరబోసుకొని ఉంటుంది. ఫాలభాగాన్ని ముత్యాల్లాగ స్వేదబిందువులు ఉంటాయి. ఆమె చనిపోయిన శిశువును రొమ్ముపై హత్తుకొంటుంది. శిశువుపై కొంగు కప్పబడిఉంటుంది.

సరళాదేవిని చూడగనే నర్తకి నృత్యం ఆపేస్తుంది.]

సరళాదేవి: (ధనాఢ్యునితో) శ్రీమంతులు మీరు! మా పసికూన కేదైనా మందివ్వండి.

తబల వాయించే అబల: ఇది వైద్యశాల కాదు పోవమ్మా!

సారంగి వాయించే సారంగాక్షి: ఇక్కడ మందు మాకు ఇవ్వరమ్మా!

సరళా: (బతిమాలుకొనుచు) అల్లా అనకండమ్మా! మీ చేతనైన సహాయం చేయండి.

నర్తకి: (ఫక్కుమని నవ్వుతూ) పిచ్చిది!

సరళా: (నర్తకిని సమీపించి) దేవకన్యలా ఉన్నావమ్మా! ఊర్వశివో! మేనకవో! ఈ పసికూన లేచేమార్గం చెప్పమ్మా! నీ కాళ్ళమీద పడతా.

తబల వా. అ: ఉన్మత్తురాలు.

సారంగి వా. సా: పెక్కు దుఃఖంవస్తే మనిషికి యుక్తాయుక్త జ్ఞానం నశిస్తుంది.

ధనాఢ్యుడు: మీ అబ్బాయి కేమి జబ్బమ్మా!

సరళా: దాని పేరు నాకు తెలీదు.

ధనా: ఐతే దేనికి మందుకావాలి?

సరళా: నాలుగు రోజులనుంచి శ్వాస ఆడ్డంలేదు.

ధనా: దహనసంస్కారం చెయ్యాలి.

సరళా: అమ్మయ్యో! ఈ పసికందుని నిప్పులో పడవేయటమే?

తబలవా. అ: అతడు చనిపోయాడమ్మా!

సారంగి వా. సా: ఇంకలాభం లేదు.

తబలవా. అ: చావునుండి తప్పించుకొనే సాధనముంటే రాజులందరు ఏనాటికైనా యీ లోకం వదలి వెళ్లడానికి ఒప్పుకొనేవారే?

సరళా: నాతో వేళా కోళాలాడవద్దు. వేదాంతం ఏకరువు పెట్టొవద్దు. మందేమైనా ఉంటే ఇవ్వండి. సరియైన మందుపడితే మాబాబు లేచి కూర్చుంటాడు.

నర్తకి: (ధనాఢ్యునితో) త్వరగా పంపించే ఉపాయం చూడండి.

ధనా: చూడమ్మా! ఈఊరు వెలుపల ఒక మర్రిచెట్టుంది. దానిక్రింద ఒక సన్యాసి ఉంటాడు. ఆయన నీకోరిక తీర్చగలడేమో!

సరళా: ఆయనమనతో మాట్లాడుతాడా?

ధనా: తప్పక.

సరళా: మీకు పదివేల నమస్కారాలు. (సరళాదేవి నిష్క్రమణం)

నర్తకి: బావగారు మంచి తెలివైనవారు.

ధనా: (నర్తకిని చేరి) రా. ఎలగాలిపై తేలే గీతంలాగ, విరులలో తావితెరలు చిమ్మినట్లు ఇక ఆనందసాగరంలో తేలియాడుదాం. రా.

2వ రంగం

[ఊరుకావల పెద్దబయలు. విశాల వట వృక్ష మొకటి ఉంటుంది. ఆ తరుచ్ఛాయలో గోచీ పెట్టుకొనిఉన్న సాధువు కన్పిస్తాడు. జటధారి. ఒంటినిండా బూడిద పూసుకొని పులితోలుపై ఆసీనుడైఉంటాడు. ప్రక్కనే కమండలం, యోగదండం ఉంటాయి. సరళాదేవి ప్రవేశిస్తుంది.]

సరళా: (నిమీలితనేత్రుడైన యోగికి నమస్కరిస్తూ) స్వామీ - నమస్కారములు! (యోగి సరళాదేవికేసి ప్రశ్నార్థకంగా చూస్తాడు.)

సరళా: మహాత్మా! ఏం చెప్పను నా దుఃఖం, నా కొడుకు నాలుగురోజులనుంచి పిలిస్తే పలకడంలేదు. పళ్లు బిగిసిపోయాయి. ఇతడు పిలిస్తే పలికేట్టు చేయండి. కన్నులపండువుగా నా ఎదుట నడయాడేట్టు అనుగ్రహించండి.

యోగి: (నిట్టూర్పి) అమ్మా! పుట్టిన వాళ్ళకు చావు నిక్కువం. కృష్ణాదులు కూడ అవతారం చాలించారు. ఇందుకోసం వగవ పనిలేదు.

సరళా: అల్లా అనకండి స్వామీ. దీనురాలిని కనికరించండి. మీరు సర్వసమర్థులు.

యోగి: వృద్ధి సిద్ధులు కావలిస్తే ఇస్తా. మట్టిని బంగారంచేస్తా. ఈ గంత ఐపోతా. ఆకాశమంతా విస్తరిస్తా. శత్రుమండలాల్ని కనుచూపుతోనే భస్మంచేయగలను. కాని ప్రాణం పోయడం నాతరంకాదు.

సరళా: (ఏడుస్తూ) పుట్టెడాశతో వచ్చాను. కటాక్షించండి.

యోగి: వివశుణ్ణి. తల్లీ!

(వెక్కి వెక్కి ఏడుస్తూ అడుగుల్లో అడుగులు వేసుకొంటూ ముందుకి సాగుతుంది. చింపిరిగుడ్డలతో తైలసంస్కారమెరుగని జుట్టుతో ఒక నడిమి వయస్సువాడు మధ్యేమార్గంలో ఆమెకు తారసిల్లుతాడు.)

చింపిరి. జు: ఏం ఏడుస్తావ్?

సరళా: ఈబిడ్డవళ్లు మంచుగా చల్లబడింది.

చింపిరి. జు: (చనిపోయినబిడ్డను చూచి) చనిపోయాడు! మంచిపనైంది. అదృష్టవంతుడు.

★ మండే నీడలు ★

సరళా: (ఉలిక్కిపడి) ఏం?

చింపిరి. జు: ఈ ప్రపంచం ఒక నరక కూపం. ఇక్కడి ఉండేవాళ్లందరూ రాతి గుండెల మైనపుబొమ్మలు. ఒక బొమ్మ రెండో బొమ్మను మింగేయడానికి చూస్తూ ఉంటుంది. చావే లేకపోతే జీవితము అంతం లేని అంపశయ్య ఔతుంది. మృత్యుదేవతకు అంజలి ఘటిస్తా. ఆమెను వెదుకుతున్నా. కాని యాచకుని చూచి లోభి పారిపోయినట్లు నన్ను చూసి ఆమె పారిపోతోంది. (సరళాదేవివైపు తిరిగి చూడకుండా చింపిరివాడు బిరబిరా నడిచి వెళ్ళిపోతాడు. కద్రువర్ణ వసనధారి యగు కాద్రభిక్షువు ప్రవేశిస్తాడు.)

భిక్షువు: (తలవాల్చి యోచించుచున్న సరళాదేవితో) ఏం కావాలమ్మా? దారితప్పి వచ్చావా? ఇంత నిర్జనప్రదేశానికి దారి తప్పి వచ్చావా?

సరళా: (పిల్లవానిని చూపిస్తూ) మీదగ్గర ముకుళించుకొన్న నయనజలజాలను తెరిచే అంజనమేదైనా ఉందా? రాయియైన గుండెలో కరడుగట్టిన అమృతఝురులను తిరిగి ప్రవహింపజేయగల మందుందా?

భిక్షువు: నావద్దలేదు. కాని ఇక్కడకు రెండు యోజనాల దూరంలో తథాగతుడున్నాడు. ఆయనొక్కడే నీ మనోరథమీడేర్పగల సమర్థుడు.

సరళా: బుద్ధం శరణం గచ్ఛామి. (భిక్షువుకేసి చూచి నమస్కరించి) కృతజ్ఞురాలను, భిక్షూ!

భిక్షువు: (వెళ్లిపోతున్న సరళాదేవిని దిగాలుగా చూస్తూ) మనిషిని బొమ్మ అంటారు. బొమ్మ లెక్కడ? ఇవన్నీ ఛాయలే. తన ఛాయకు నిజరూపాన్ని కనుగొన్నవాడు సార్థకజన్ముడంటారు పండితులు.

3వ రంగం

[బుద్ధుడు ఉన్నతాసనంపై ఉపవిష్టుడై ఉంటాడు. చుట్టూ శిష్యబృందం ఉంటుంది. ఒకప్రక్క సన్యాసినులు పురవాసినులు ఉంటారు. రెండోప్రక్క పరివ్రాజకులు, రాజోద్యోగులు గౌతముని ఉపదేశం వింటూంటారు. సరళాదేవి సన్యాసినులను తోసుకొని బుద్ధునిముందుకు వచ్చి నిలబడి నమస్కరిస్తుంది.]

సరళా: భగవన్! ఈ బిడ్డ చనిపోయాడంటున్నారు.

బుద్ధుడు: (మందహాసంతో) లేదమ్మా! భగవంతునివద్దకు చేరాడు.

సరళా: నవమాసములు మోసి కన్నాను.

బుద్ధుడు: పూజ్యురాలవు.

సరళా: ఉగ్గుపాలుపోసి మక్కువతో పెంచాను.

బుద్ధుడు: ప్రేమతో నీరక్తమును పాలుగా మార్చి పంచి ఇచ్చావు. త్యాగమూర్తివి.

సరళా: వీడు నా బహిఃప్రాణము. వీణ్ణి మీరు బ్రతికించాలి.

బుద్ధుడు: అతడు బ్రతికినతరువాత వెంటనే పరమాత్మ నిన్ను పిలుకొనిపోతే?

సరళా: నాకు విచారంలేదు. నేనుచూసి ఆనందించడానికి నోచుకోన్నా నోచుకోలేకపోయినా, నా ముద్దులతండ్రి బ్రతికితే చాలు.

బుద్ధుడు: నేను బ్రతికించగలనని నమ్మకముందా?

సరళా: తప్పక. మీకు కోటికోటి ప్రణామాలు. ఈ చిరుతహృదయంలో ప్రాణం పోయండి.

బుద్ధుడు: నీకోరికప్రకారం నీబిడ్డ బ్రతుకుతాడు. కాని నీవో పని చేయాలి.

సరళా: చెప్పండి. నాకు సాధ్యమైనది తప్పకచేస్తాను.

బుద్ధుడు: ఒక పిడికెడు బియ్యం పట్టుకురా.

సరళా: ఇప్పుడే పట్టుకువస్తా ప్రభూ!

బుద్ధుడు: ఆగు మరి పూర్తిగా విను. ఈ బియ్యం ఎక్కడనుండి పడితే అక్కడనుండి పట్టుకురాకూడదు. ఎవరింట్లో మృత్యుదేవత కాలుమోపలేదో, వారింట్లోనుండి పట్టుకురావాలి.

సరళా: ఇంతేనా?

[సరళాదేవి చకచకా నడిచి వెళ్తుంది.

ధనాఢ్యుని శేఠీకాగృహం. నృత్యం ఇంకా సాగుతూ ఉంటుంది.]

సరళా: (ఆతృతతో) అయ్యా! పిడికెడు బియ్యం ఇప్పించండి.

నర్తకి: (వెటకారంగా) మళ్ళీ వచ్చింది.

సారంగి మో. సా: పిడికెడు బియ్యానికి ఇక్కడికి రావాలా?

సరళా: బియ్యం యీ ఇంట్లోంచే కావాలి.

తబల వా. అ: ఇప్పుడు వీలులేదు.

ధనా: (సరళతో) అల్లాగే ఇస్తాం. (సారంగి మోగించే సారంగాక్షితో) రాగిణీ! ఒక శేరు బియ్యమిచ్చి పంపేయి.

[రాగిణి లోనికిపోయి శేరుబియ్యం పంచిలోపోసి పట్టుకువచ్చి సరళకు అందిస్తుంది.]

సరళ: (ధనాఢ్యునితో) మీ ఇంట్లో ఎవ్వరూ పోలేదుకదా!

ధనా: లేదు ఈ నెలలో—

సరళ: క్రితం నెలలో?

ధనా: అమ్మా! ఆ సంగతులన్నీ నా జ్ఞప్తికిలయించకు.

సరళా: ఎవరుపోయారో చెప్పండి.

ధనా: నా రెండో భార్య కలరావచ్చి పోయింది. నలుగురు పిల్లలు చచ్చిపోయారు. ఏమని చెప్పను? అవన్నీ తలచుకొంటే నా గుండె చెలువోతుంది. పిచ్చెత్తిపోతుంది. దుఃఖాన్ని మఱచిపోడానికి నృత్యగీతాదులశరణుజొచ్చాను. అమావాస్య చీకటి అలముకొంటే కృత్రిమ కాంతి పుంజాలను సృజించుకొంటాం -

సరళా: క్షమించండి. నాకీబియ్యం వద్దు. (సరళాదేవి గబగబా వెళ్లిపోతుంది.)

4వ రంగం

[ఊరిబయట బయలు. దూరంలోనున్న వటవృక్షం క్రింద యోగి కూర్చొని ఉంటాడు. వటవృక్షాని కావల చితులు మండుతూ ఉంటాయి.]

సరళా: ఎవరిహృదయం కలచి చూచినా నలుసంత ఆనందమైనా లేదు. ఈఊళ్లో శవం దాటని గడపేలేదు. ప్రాణం విసికిపోయింది. ఆసన్నాప్తికూడ దగ్గరబంధువులు చనిపోవుట వలన కలిగిన నిర్వేదంవల్ల ప్రపంచాన్ని త్యజిస్తున్నాడు...ఓహోహో! ఏమి ప్రపంచం. ఏ ఇంటికి పోయినా చనిపోయినవారిగాథల కరువు పెట్టేవారే ... శరీరం ఇంత నశ్వరమైనదా? పాతకంబళీవంటిదేనా? దీన్ని ఎప్పుడో అప్పుడు తగలబెట్టవలసిందేనా?... కాటుక కొండ పగిలి చెదరినట్లు చీకటి విశ్వాన్ని ఆవరించుకుంటోంది - నీడలో! లక్షలాది నీడలు! నా కళ్లముందు పోతున్నాయి. అవి మిణుగురులా? చితులు మంటలా? నీడలు మండుతాయా? ఏమో!

[దూరాన్నుంచి ఆలమందను ఇండ్లకు తోలుకొనిపోతున్న గొల్లవాని పాట-'తాపత్రయాభీల దావాగ్ని లడుగునే'...అని వినిపిస్తుంది.]

సరళా: తాపత్రయాలు! ఆ. అవి దావాగ్నులే! వానిలో సలసలకాగుతూ క్రుగ్గుతూ ఒక నీడ వేరొక నీడను కావలించుకొని, 'ఇది నాది. ఇది నా బహిఃప్రాణ'మంటుంది - విచిత్రం!

[చనిపోయిన బిడ్డను గోతిలో వేసి మట్టిని వేస్తూండగా తెరపడుతుంది.] ★

ఊరు ఊరుకొంది

"ఆరుద్ర"

మంచిగాలి వీస్తున్నాది. మనుష్యులు నిద్ర లేస్తున్నారు. మనుష్యు లెప్పటికైనా నిద్రలేస్తారా అని కాచుకొని కూర్చున్న యువకుడు కళ్లు పెద్దవి చేశాడు. చూశాడు. వీస్తున్న గాలికి అతడి దుస్తులు రెపరెపలాడాయి. అతడు ఎదురుచూసే ఆ ముహూర్తాలు ఆగమించాయి. ఆగమించినవి ఆగకూడదని అతడి ఆకాంక్ష.

మనుష్యులు నడుస్తున్నారు. రోడ్లు నిద్ర లేస్తున్నాయి. నిన్న మాపటివేళ ఆవలించి కళ్లుమూసుకొన్న ఆఫీసులు అప్పుడే లేచి ఒళ్లు విరుచుకొంటున్నాయి. పోటెత్తిన రద్దీ కాలిబాటలమీద రాటు తేరుకున్నది. నింపాదిగా ఉన్న తారురోడ్డు జోరునికూడ పలుక్కుంటున్నాది. సంచారం సంకలనం ప్రాక్టీసు చేస్తున్నాది. యువకుడు, మన కథానాయకుడు, రోడ్డు పట్టేడు.

అతగాడి బతుకు అంతకుముందే రోడ్డపాలైంది. అందుకు అతడు సానుభూతికోరకు వెతకడు. విపులమైన నెన్నుదురు- కనులలో క్రొంబెదురు వణుకు గొంతుక అతడి సంతకం. ఇవన్నీ అతడి ఆనవాళ్లు. అయితే వీటికి కొద్దికాలంకిందట కాలదోషం పట్టాయి.

మునిసిపల్ చెత్తల డబ్బాదగ్గర యువకుడు నిలబడ్డాడు. అందరూ చూస్తూ ఉండగా అతడు తాను తొడుక్కున్న చొక్కాని విప్పేశాడు. దాని జేబుల్లో ఉన్న ఆశాలేశాలని అందరి సమక్షంలో సురక్షితంగా భద్రపరచాడు. అవి ఒకటీ ఆశా, రెండూ ఆశయం. ఈ రెంటినీ రొంటిని దోపుకొని నిశ్శబ్దంగా నిష్క్రమించాడు. గుమికూడిన జనులు చప్పట్లు కొట్టడం మరిచిపొయ్యారు. ఎవరేనా చెప్తేనేగాని జనం ఏదీ చెయ్యరు.

యువకుడు వంతెనమీదుగా వెళుతున్నాడు. వంతెనమీద జనప్రవాహం. వంతెనకింద జలప్రవాహం. యువకుడు రాకపోకలు ఆపేశాడు. వంతెనకి సాష్టాంగపడి ప్రాణదానం చేసినందుకు ప్రణామం ఆచరించాడు. లేచాడు. అందరివైపూ తిరిగి "నన్నుచూసి నవ్వండి" అన్నాడు. జనం నవ్వారు. యువకుడు సాగిపొయ్యాడు.

దేవాలయం వచ్చింది. అవును దేవాలయమే వచ్చింది. యువకుడు దానిదగ్గరకు వెళ్లలేదు. మానవుడు మేలుకొన్నప్పుడే దేముడు గాభరాపడతాడు. యువకుడు దేవాలయంతో దెబ్బలాట పెట్టుకొన్నాడు. ప్రసాదంకంచం లంచంగా అతడిముందుకొచ్చింది. అతడు దానిని స్వీకరించలేదు (అన్నట్టు అతడు అరవై రెండు గంటలనించీ అన్నం ముట్టలేదు.)

మంచిగాలి వీచడం మానేసింది. మనుష్యులు కంపుకొడుతున్నారు. రాకపోకలు రాజసం ప్రదర్శించుతున్నాయి. యువకుడి మీద ఎండెక్కింది. దాన్ని మోసుకొంటూ అతడు ఒక ఆఫీసుముందుకు వెళ్ళి ఆగాడు. అయినా ఎండ అతడి వీపు దిగనంది.

అది జననమరణాల రిజిస్ట్రారుగారి కచేరి. ఉద్యోగిగారు ఊపుకొంటూ వచ్చారు. యువకుడు వారిని సగౌరవంగా ఆపి చిన్న విషయం ఉందని మనవి చేసుకొన్నాడు. గంటకొట్టి బంట్రోతుచేత లోపలకు పిలిపించుతాను అప్పుడు చెప్పుకో అన్నాడు ఆయన. అల్లాగే అని యువకుడు అక్కడే పడిగాపులు పడ్డాడు. వీపుమీది ఎండ నెత్తికెక్కింది.

చొక్కాలేని యువకుడిని కచేరీలోకి ఎలా పిలిపించడం అని ఉద్యోగిగారు కొంచెం ఆలోచించారు. నిరాశో, నిర్వేదమో, ఆత్రుతో, ఆందోళనో ఏదో ఒకటి ఉడుపులుగా కట్టుకొంటేనేగాని ఉద్యోగి ముందుకు వెళ్ళడం ఉచితంకాదు. అయినా యువకుడి కళ్లలో ఉద్వేగం ఉంది కాబట్టి ఉద్యోగి లోనికి పిలిపించాడు.

"ఏమిటి?" అని ప్రశ్నించాడు.

"ఒక జననం రిపోర్టు చెయ్యాలి" అన్నాడు యువకుడు ఉత్కంఠతో.

"ఎవరికి పుడత?"

"నాకే!"

"ఎప్పుడు?"

"అరవై గంటల కిందట"

"అంటే?"

"మొన్న"

"ఇన్నాళ్లనుంచీ ఎందుకు రిపోర్టుచెయ్యలేదు"

"పుట్టింది, చస్తే రెండూ ఒకసారే రిపోర్టు ఇద్దామనుకొన్నా"

"సరే వివరాలు చెప్పు. నీ పేరు"

చెప్పాడు.

"నీ భార్య పేరు?"

"నాకు పెళ్ళికాలేదు"

ఉద్యోగి ఉరిమిచూశాడు. ఒంటి కాలిమీద కుంటుతున్న ధర్మం ఓపిక లేక పడిపోవడానికిగల కారణం యువకుడి ముఖం మీద ఆ ఉద్యోగిగారికి కనబడింది.

"సరే—దాని పేరు?"

"దేని పేరు?"

"నీ భార్య-కాదు-ఆ స్త్రీ పేరు"

"స్త్రీ ఎవరూ లేదు"

తండ్రెవరో తెలియకుండా బిడ్డలు పుట్టవచ్చుగాని తల్లే లేకుండా సంతానప్రాప్తేమిటని ఉద్యోగి విస్తుపోయాడు. "ఆడది లేకుండా పిల్ల లెలా పుడతారయ్యా" అన్నాడు.

"నాకు పిల్లలు పుట్టలేదు"

"మరెందుకు ఇక్కడికి వచ్చావు"

"జననం రిపోర్టు చెయ్యడానికి"

"ఏ జననం"

"నాకు మానవత్వంమీద నమ్మకం కలిగింది. జీవితంమీద ఆశ జనించింది. ఆ విషయం రాసుకోండి" అన్నాడు యువకుడు.

తండ్రయినవాడిమీద తలకు మించిన భారం ఉండడం భావ్యం కాబట్టి ఉద్యోగిగారు యథాప్రకారంగా యువకుడి నెత్తిమీదికి ఎండని ఎక్కించారు.

ఊరు ఊరుకొంది. ★

బామ్మగారి ప్రపంచయాత్ర

"జ్యేష్ఠ"
౨౦

దారాసింగ్ కుస్తీలో ఎంత దిట్ట ప్రచండుడైనా, ఒక్కుమ్మడి మీద పడిన ఇటువంటి పటాలంతో కుస్తీ పట్టగలడా? అందులో జయాపజయాలమాట అటుంచి, అసలు సాహసించగలడా? 'ఆయన' దారాసింగ్‌కంటె నేనేం తక్కువ తిన్నానా అన్నట్టు ప్రవర్తిస్తున్నాడు. 'ఆయన' కుస్తీ ప్రదర్శింపబడేచోటు - రాజమండ్రి గోదావరి స్టేషన్ ప్లాట్‌ఫారం. సమయం. అప్పుడే ఎనిమిది గంటల బండి వచ్చిన అపరాహ్ణసమయం. టిక్కెట్టు - రైలు దాటపెట్టుకోడానికి సిద్ధపడిఉండడం. కుస్తీకి ప్రవేశరుసుం - అంగంలో ఎముకలు విరిగినా సహించే దైహికస్తోమతూ, ఐదు నిమిషాలు నిర్విరామంగా, ఊపిరి పీల్చుకునే అవకాశం లేకుండా మోచేతి ప్రహారాలు స్వీకరించగల [వాపస్ చేసే వీలులేదు] ఓపికా. ఆయన "ఉన్మాద్గోల్లసిత కుంజర కిశోరం"లా ఒక్కొక్క పర్యాయం రెండు మణుగులకు తక్కువకాని బరువులను అవలీలగా లోనికి విసిరేస్తూ ఆత్మరక్షణా, 'గుప్త' శక్తిణా నిర్విరామంగా, నిర్భయంగా కొనసాగిస్తూంటే, అలనాడు "కురుక్షేత్రమున క్రుద్ధ వృకోదరు గదాఘాతమున గజగజలాడిన" లోకంలా ప్లాట్‌ఫారం కంపిస్తోంది; నాకు కంపరం పుడుతోంది, "ఇదే విసురుగ" అన్నట్టు ఆయన కరకిసలయస్పర్శగాని తగిలితే నా అవయవాల్లో ఒకటి తక్షణం పింఛను పుచ్చుకునే ప్రమాదం రావచ్చునని.

అంతలో పిడుగులాంటి హాహాకారం, కెనడియన్ ఇంజన్ కంఠంలా నెమ్మదిగా, వినవచ్చింది. ఆ హాహాకారపు సొంతదారు డెవరు? ఇంకెవరు? ఆయనే! బాధతో నేలపై కూలపడి చేత్తో పాదంమీద రాసుకొంటున్నాడు. బలహీనుల శుభసమయం.. అభ్యుదయం! ఆయన బాధతో ఘోషిస్తున్నారు. విజయగర్వం ఉట్టిపడే దరహాసభాసిత సుందరవదనంపై విస్తృతంగా కనిపిస్తుండగా, బామ్మగారు ఆయొక్క రైలుపెట్టె మార్గంలో నెపోలియన్లా ఠీవిగా నిలబడ్డారు. మొదటి మహాయోధుడు పక్షపాతం లేకుండా సమంగా పంచిఇచ్చిన అవయవ వైకల్యాలను సానుభూతితో పరామర్శించుకొంటున్న (ఎవరి గాయాలను వాళ్లే) ప్రయాణీకులు ఒక్కొక్కరే లేచి బండివదకు రాసాగారు.

ఇప్పటి ప్రమాదంముందు ఇందాకటి ప్రమాదం సముద్రంలో నీటిబొట్టు వంటిది. ఎందుకంటే, ఇందాకా (స్వాతంత్ర్యానికి ముందులాగా) అందరి లక్ష్యం ఒకటే. అదే తమ అందరి హక్కు[illegible]న్న దోచుకుంటున్న ఆ యోధుణ్ణి ఐక్యభావంతో ఎదుర్కోవడం. ఇప్పుడట్లా కాదు. ప్రతి ఒక్కడూ తక్కిన అందరితోనూ పోరాడాలి. ఘోరం! నేను ఆ ప్రమాదం ముందే పసికట్టి పెట్లోకి పరుగెత్తాను, నాగరకత ఇచ్చిన బరువుతో ప్రయాణికుల ప్రవేశించి బామ్మగారికి కోరస్‌లో కంగ్రాచ్యులేషన్లూ, థేంక్సూ ఒక్కమారే సమర్పించారు. ఆ సుదీర్ఘకాయుడు అంతా కష్టపడి తన శరీరం మినహాయించి తక్కిన బరువులన్నీ రైలు పెట్లో పడవేశాడు! ఆయన పాదం కోలుకునేలోగానే రైలు కదిలింది. యుద్ధంలో ఐతే తూనిగలా విహరించేడు కాని, పరుగెత్తి రైలెక్క లేకపోయాడు! "హోల్డాన్" అని మాత్రం అరిచాడు చేతులు ముందుకు సాచి! బామ్మగారు గోదావరిలో మారని డబ్బొకటి వేసి (గోదావరి చూడొచ్చిందా ఏమిటి?) దణ్ణాలు పెడుతున్నారు. అసలు జరిగిం దేమిటో అంటే బామ్మగారి పాదరక్ష మహాయోధుని పాదం మందం ఎంతుందో నని పరామర్శించింది.

ప్రయాణీకులకు బామ్మగారిమీద భక్తిభావం కలిగింది. మహామహులైనటువంటి వారు సాధించలేకపోయిన విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని బామ్మగారు సాధించారు! (అందరికీ ఆమె బామ్మగారు కావటంమూలాన, వారందరూ సోదరులు కాలేదా మరి!) "ఎక్కడనుంచి రాక?" ఒకాయన బామ్మగారి మాటని అడిగేడు పొడుం పీలుస్తూ. "నిన్న జనతాలో రాజమండ్రం వచ్చాం ఉత్తరదేశయాత్రనించి" అని బామ్మగారు వెంటనే జవాబిచ్చారు. "అమ్మో!", "ఆహా!", "అటులనా!", "తమ రొక్కరేనా?" ఇత్యాది శబ్దాలకు బామ్మగారు అభిమన్యుని ఆత్మవిశ్వాసంతో తగురీతి సమాధానా లిచ్చేరు. "అందులో కష్టమేముంది?", "జన్మలో చూస్తాననుకోలేదు", "అవును" "మేం ఎనభైమందిమి స్పెషల్ పెట్లో వెళ్ళాం." ఇవి ఆవిడ జవాబుల్లో కొన్ని మాత్రమే. శరవేగంతో జడివానలా ఒక్కుమ్మడి వచ్చిన ప్రశ్న పరంపరలను సవ్యసాచిలా ఎదుర్కొని బామ్మగారు శతావధానం చేశారు!

"అక్కడి యిశేషాలేటండి!" ఒక వృద్ధ రైతు నోట్లోంచి చుట్టతీసి ప్రశ్నించి, సవినయంగా పెట్టె బైటకు ఊశాడు. "బదరీకి దగ్గరలో నే శంకరుని నివాసం ఉంది. కాని అక్కడకు వెళ్ళడానికి వీలుపడలేదు." బామ్మగారు యథాలాపంగా పళ్లు కుట్టుకుంటూ జ[illegible]బిచ్చారు. "అయ్యో అంత దూరం వెళ్లి కైలాసం చూడకుండా వచ్చేశారా!" ఒక యువతి సానుభూతితో అడిగింది. బామ్మగారటు తిరిగి "నువ్వేటే సుబ్బలక్ష్మీ! మీ తమ్ముడు పటాలంలో చేరతాడనుకున్నారు. అక్కడ డేరాడూన్‌లో మిలట్రీ కాలేజీ ఉంది, అక్కడ చేర్చుకుంటారేమో!" అన్నారు.

"నదులన్నీ అక్కడే పుట్టాయి. చిన్న చిన్న పిల్లకాలవల్లాగుంటాయి. ఆ నీళ్లన్నీ మంచుకరగగా వచ్చినవే. అక్కడెంత చలి అనుకున్నారు!" బామ్మగారు పత్రికా విలేఖర్లతో "కొన్ని యథార్థవిషయాల గూర్చి ఉద్ఘాటించే ప్రధానిపోజులో చిన్న లెక్చరిచ్చారు. అవి విన్నాక యాత్రలు చెయ్యవలసింది వృద్ధులు కాదు, విద్యార్థులే అనిపించింది.

"బామ్మగారూ! బదరీలో దేవుడికి బలి వెయ్యరూ!" ఒకతను అడిగేడు. ఆ పామరుడికి దేవుడి శక్తి సామర్థ్యాలు వెయ్యి పురాలు వేసినా అర్థం కావనుకున్నారేమో బామ్మగారు, కొంటెగానే సమాధానమిచ్చారు. "దేవు డిరవై తలుపుల లోపలుంటాడు. ఆ తలుపులు మూసేస్తే బలెల్లా వేస్తుంది?" ఆ జవాబులో గల్లుమన్న నలుగురితోబాటు బామ్మగారూ నవ్వేరు.

"అక్కడి కోనేరులలో ఆడుకునున్న చేపలు పైకి కనిపిస్తాయి. నీళ్లలో కాళ్లు పెడితే తపేళ్లు మందలుగా వచ్చేసాయి. వాటికి పేలాలూ అవీ వేశాం" బామ్మగారు ఆ మధురస్మృతులు తల్చుకొంటూ అన్నారు. "మీ యాత్రల పేరు చెప్పి వాటికింత తిండికోరికింది. అవి దేవుడిని నమ్ముకొన్నాయి" ఒకతను నేనూ ఉన్నాను అంటూ, నిలబడిచెప్పాడు. బామ్మగారు అతనిమాటలు శ్రద్ధగా వినినట్లైనా నటించకుండా అన్నారు. 'వాటికి మనమే తిండెట్టాలా ఏమిటి? అక్కడివాళ్లే ఇంతపడేస్తారు. మనుషులకే లేంది చేపలకి భక్తేమిటి? అది ఉండ్రాళ్లమీద భక్తి' ఆవిడకి ఎలా తెలిసిందో ఆ చేపలకి నిత్యం తిండి ఎలా దొరు

రుతుందో. మా కాలేజీకి క్రిందటేడు ప్రిన్సిపాలెవరో ఈ ఏటి విద్యార్థులకి తెలియదు!

"ఎంత కర్చవుతుందంటారు?" ఒక బహు సంతానపీడితుడు ప్రశ్నించాడు, రైల్లో కొచ్చిన ప్రతి నేరం చే' వస్తువునీ కొనమని పీడించే పటాలంమధ్యనుంచి తలపైకెత్తి! అతనిప్పుడే ఆ డబ్బు చేతపట్టుకొని బ్రతుకు జీవుడా అని బసిరికి ఉడాయించడం, అతని కుచేలసంతానం రైలింజ[illegible]లా బృందగానం చెయ్యటం, నా ఊహాపథంలో మెరిసింది. "అర సంచీడు రూపాయలుండాలి" బామ్మగారన్నారు 'అంతమాత్రం తెలియదూ' అన్నట్టు ధ్వనించే ధోరణిలో. ఆ సంఖ్య విన్నాక అతని మొకం ఒదిలింది. ఐదు వందలే ఉంటే నా కూతురు మెడలో ఆ మూడు ముళ్ళూ వేయించకపోదునా! అనే భావం అతని ముఖంలో సాక్షాత్కరించింది.

"బామ్మగారూ! దేవుడికోసం అంత కర్చు పెట్టాలా! దేవుడు కోటి లింగాలలో లేడూ! అన్నారంలో లేడూ!"

బామ్మగారు ఈ ప్రశ్నలోని భావం గ్రహించి రాజనీతి ఉపయోగించారు "అది గ్రహించినవాళ్లు మహాత్ములే. తెలియని వాళ్ళకే ఈ పాట్లు" అన్నారు. ఆ సంసారి నోరు మూసుకున్నాడు.

"మీ రా డబ్బుతో ఓ సప్తాహమో చేయిస్తే నలుగురు సుఖించి తిండుండక నా ఓ వారం గోజులు?" మరో ప్రశ్న.

ఆ ప్రశ్నకు సమాధానం దొరక్క నేను బాధపడ్డాను! బామ్మగారు నవ్వుతూ సమాధానమిచ్చారు "అక్కడ మంచుకొండల్లో బతికేవాళ్లకి ఆధారం మేవేకదూ. ఇక్కడున్న వాళ్లు అడుక్కు నేనా బతుకుతారు. అక్కడివాళ్లని చూసేవాళ్లెవరూ మేం తప్ప?"

"తాజ్ మహాల్ చూశారా?" ఒక విద్యార్థి—కాదు కాదు—ఒక కాలేజీ మనుగడకు ఉపలబ్ధిగా పాటుపడుతున్నానని గర్వించే యువకుడు అడిగేడు. "చూశాను. పాలరాతితో కట్టేరు. ఎంత అందంగా ఉందో! అందులో పొదిగిన రత్నాలూ, మణులు, బంగారపూ తురకలు తవ్వుకుపోయారుట" అన్నారు బామ్మగారు. ఆ విద్యార్థి మొగంలో విజయగర్వం తాండవిస్తోంది. "అది కట్టించింది తురకలు! అక్బరు తన భార్య నూర్జహాన్ జ్ఞాపకార్థం కట్టించేడు" అని "ఏమండీ అక్బరు ముస్లిం కాదూ!" అని వన్నిడిగేడు. అవునన్నాను. "అవునా! ముస్లిం కట్టించింది ముస్లిం దోచుకున్నాడుట! అట్లా జరుగుతుందా? మీరే చెప్పండి" అని ఒక విద్యార్థి సవాల్ చేశాడు.

బామ్మగారు తుపాకి పేల్చినట్టు ఎగురబడ్డారు. "గాంధీగార్ని తుపాకితో కాల్చిందెవరూ? హిందువు కాదూ! మొన్న విశ్వాలయంలో జరిగిన దొంగతనానికి పూజారి సాయపడలేదూ? మాట్లాడవేమయ్యా పెద్దమనిషీ! దొంగచచ్చినాళ్ళకి తురకడబ్బూ, హిందూ డబ్బూ అని ఉంటుందా ఏమిటి?" బామ్మగారికి తన ప్రతిభని శంకించినందుకు కోపం వచ్చింది! బామ్మగారు వాదంలో గెలిచినందుకు మా మూగప్రశంసలు పొందారు. ఆ విద్యార్థి తనకు వెన్నముకను ప్రసాదించినందుకు దేవుణ్ణి మనసారా తిట్టుకున్నాడు. తనతల ఎవరికీ కనపడకుండా కిందికి వంచేందుకు వీల్లేకుండా ఈ వెన్నముక ఒకటి, పానకంలో పుడకలా గా?

"బామ్మగారూ ప్రయాగలో ఏ ఆలయం చూశారు!" ఒక అనధికార విలేఖరి అడిగేడు. "నెహ్రూగారి ఇల్లు చూశా: ఆయన దేవుడు కాదూ? దేశంకోసం ఎంత కష్టపడ్డాడు? ఇప్పుడాయన భార్యపేర ధర్మాసుపత్రి కట్టించేరు." బామ్మగారు నిజమైన భక్తితో అన్నారు. సెర్వీస్ కమిషన్ పరీక్షలో 'నెహ్రూ పెద్ద ఋణదాత' అన్న పట్టాదారుకి ఈవిడకి ఎంత తారతమ్యం- చదువుకున్న వాడికంటే......అని ఊరికే అన్నారా!

"నర్గీస్ ని చూశారండీ?" ఒకతను సిగ్గుపడుతూ అడిగేడు. "లేదు. పౌరాణిక చిత్రాల్లో వేషాలు వేసిఉంటే కొంచెం మాట్లాడేదాన్ని" అన్నారు బామ్మగారు. అతను బాధంతా గుండెల్లో దాచేసుకొని,



"తుమ్మెదా ఒకసారి...."

తురగా కృష్ణమోహన్‌రావు

"తుమ్మెదా ఒకసారి మోమెత్తి చూడమని చెప్పవే రాచిలుక తోడ" అంటూ పాడడం ప్రారంభించాడొక గాయకశిఖామణి. తుమ్మడాన్ని గురించి ఎందుకు పాడవలసివచ్చిందో నా కర్థంకాదు. బహుశః ఆయనకు తను బాగా తుమ్మగలనని గర్వం అయి వుండవచ్చు. మనుష్యులకు అనేక రకాల గర్వాలు ఉంటాయిట. పొడుగ్గా ఉన్నానని ఒకరికి గర్వం అయితే పొట్టిగా ఉన్నానని మరొకరికి గర్వం. తను డబ్బు విషయంలో చాలా పొదుపుగా ఉంటానని ఒకరికి గర్వం అయితే తను డబ్బు విచ్చలవిడిగా ఖర్చు పెట్టగలనని వేరొకరికి గర్వం. తనకి ఆత్మగౌరవం, గర్వం ఇత్యాది ఎక్కువగా ఉన్నాయని ఒకరికి గర్వం అయితే అసలు తనకి గర్వమన్నదే లేదని గర్వం మరొకరికి.

పయిన చెప్పానుగా-ఆయనకు బహుశః తను బాగా తుమ్మగలనని గర్వం ఏమోనని? అసలు నన్నడిగితే బాగా తుమ్మగలనని గర్వం కలిగిఉండడంలో అర్థంలేదు. కాని-మనుష్యులనేక రకాలుగా ఉంటారు. వాళ్ళకనేక రకాల గర్వాలు ఉంటాయి. మనమేమీ అనడానికి వీల్లేదు.

నాకు మటుక్కు నాకు తుమ్మడమంటే అదో రకమైన భయం. తుమ్మేటప్పుడు మొహం అష్టవంకరలుగా తయారవుతుంది. స్వతహాగా నామొహం కొంచెం తీరుగా ఉంటుందేమో - ఈసంగతి మా ఆవిడకూడా కాదనడానికి వీల్లేదు! - తుమ్మితే మరీ అసహ్యంగా తయారవుతుంది. ఆవిడ గారు అప్పుడప్పుడు నన్ను ఏడిపిద్దామని ప్రయత్నం చేస్తూంటుంది. ఈమధ్యనే ఒకసారి చల్లగా నాపక్కన చేరి అంది: "ఏమండీ! మీరు నిన్న తుమ్ముతోంటే చూశాను. ఎంతో బాగున్నారు. సరిగ్గా దిలీప్ కుమార్ లా ఉన్నారు." నేనా మోసపోయే వాణ్ణి? నాకు తెలియదూ - దిలీప్‌కుమార్ తుమ్ముతూండగా ఆవిడ ఎప్పుడూ చూడలేదని?

ఒకవిషయంలోనుంచి ఇంకోవిషయంలోకి పోయినట్టున్నాను. ఆపాట పాడిన పెద్దమనిషిని గురించి కాదూ చెప్పుతున్నాను? ఆయనకు బాగా తుమ్మగలనని గర్వం ఉందనుకోండి. నిజంగా ఆయనకు గర్వమే ఉంటే అవకాశమున్నప్పుడల్లా తుమ్మడానికి ప్రయత్నించాలి! తుమ్ములు వస్తే అప్రయత్నంగానే తుమ్మాలి; తుమ్ములు రాకపోతే అథవా ముక్కు పొడుం పీల్చి అయినా తుమ్మాలి! ఉహూఁ! ఆయన అల్లా చేయడట. తుమ్మితే "ఒకసారి" మాత్రమే తుమ్ముతాడట. "తుమ్మెదా ఒకసారి" మాత్రమే అంటూ మనల్ని జడిపిస్తున్నాడు - ఆయన తుమ్ము ఏదో పెద్దవిలువగలదయినట్టు; ఒకొక్కసారి ఒకొక్కదానికంటె మనకు ఎక్కువ ప్రసాదిస్తే మనం ఏదో 'వేస్టు' చేసి పారేస్తామేమో అన్నట్టు.

ఇంతేకాదు. "మోమెత్తి చూడమని" అంటున్నాడు. "ఎవరి మోము?" అన్నది ప్రశ్న. తుమ్మేటప్పుడు కర్త - అంటే తుమ్మే పెద్దమనిషి అన్నమాట - రయిల్వే సిగ్నల్ లాగ తలకాయ దింపి తుమ్ముడుకదా? తనికి ఇష్టముఅన్నా లేకపోయినా తుమ్మేటప్పుడు తలకాయెత్తి తుమ్మవలసిందే. ఇంకా 'మోమెత్తి' అనడంలో అర్థమేమిటి? బహుశః కర్త ఇంకోవిధంగా ఉద్దేశించి ఉండవచ్చు. "నేను తుమ్ముతాను; నువ్వు నీ మోమెత్తి చూడు" అని అతని ఉద్దేశ్యం అయిఉండవచ్చు ఎందుకంటే - "నేను తుమ్ముతాను; మోమెత్తి - అంటే నా మోము నువ్వెత్తి - చూడు" అనేకనక కర్త ఉద్దేశ్యం అయితే దానికి చాలా అభ్యంతరాలుంటాయి. ఉదాహరణకు: ఒకటి రెండు చెప్పుతాను. తుమ్మడానికి ఎత్తిన మోమును ఇంకా ఎత్తి చూడడం అసంభవం. ఇంకో విషయం, ఏమిటంటే ఒకపక్కన తుమ్ము తుఫానులా ముంచుకొస్తూంటే 'సరిగమ పదనిస' అని పాడుతూ తన మోమెత్తి చూడమని ఎదుటివాళ్ళని అడిగేవరకూ అవకాశం ఎక్కడుంది?

పోనీ కర్త ఉద్దేశ్యం: "తుమ్మెదా ఒకసారి మోమెత్తి - చూడమని చెప్పవే రాచిలుకతోడ" అనేమో అనుకుంటే దానికి కూడా ఒకటి రెండు అభ్యంతరాలున్నాయి. ఎవరికి తుమ్ము వచ్చినా మోమెత్తే తుమ్ముతారు. నా సంగతి నేను చెప్పానుగా! అందరూ అంతే. మాఇంటిపక్కని వెంకయ్యగారి తమ్ముడు తుమ్మడంటే మొహం 270° కోణంలో ఎత్తి మరీ తుమ్ముతాడు. మొహం ఎంత ఎత్తుతారు అన్నది ప్రశ్న. కాని; ఎల్లరూ మొహంఎత్తి మరీ తుమ్ముతారన్నది పరమసత్యం. మరి ఈ కర్త ప్రత్యేకంగా తనే "మోమెత్తి" తుమ్మేటట్లు చెప్పకోడం దేనికి?

ఈపాటకి అసలు కారణమేమిటో నాకు తెలుసు. ఏమిటో ఒకనిమిషం ఆగి చెప్పుతానుండండి.

అయితే ఇంతవరకూ కర్తనుగురించి - అంటే తుమ్మబోతూన్న ఆ పెద్దమనిషిని గురించి - ప్రస్తావించాం. ఇక కర్మను గురించికూడా ఆలోచిద్దాం. "తుమ్మెదా... చెప్పవే!" ఎవరితోటి? రాచిలుకతోటి! మిమ్మల్ని అడుగుతున్నానని ఏమనుకోకండి కాని మీ రెప్పుడయినా చిలకతో తుమ్మడాన్ని గురించిమాట్లాడేవాళ్ళను చూశారా? నేను చూడలేదు. కర్తకూడా చిలక నుద్దేశించి ఈ పలుకులు పలికేడని నేను అనుకోను. ఇందులో అంతరార్థమేదో ఉంది.

బామ్మగారి ప్రపంచయాత్ర

దాన్ని మరిచిపోయేందుకు సిగరెట్ వెలిగించాడు.

"అయితే బామ్మగారు ప్రపంచయాత్ర చేశారన్నమాట! బదరీకి అవతల ఇంకేం లేదుట!" ఒకడన్నాడు. ఆ ఘనత ఎందుకు కాదనాలి అని "అవును. బదరీతో ప్రపంచం ఆఖరు" అన్నారు బామ్మగారు. ప్రపంచం ఐదు ఖండాలు అని తెలిసిఉన్న దుర్జనులు కొందరు పొట్టలు పగిలేలా నవ్వేరు.

బెజవాడలో బామ్మగారికి టిక్కెట్టు తీసి పెట్టాను. బామ్మగారు "మహారాజువౌతావ"ని దీవించారు. "మహారాజుగా పుట్టడం సులభంకాని అవడం చాలా కష్టం" అన్నాను (నేను మహారాజునైతే మిమ్మల్ని మంత్రిగా వేసుకోనా! అనుకొని). దానికి బామ్మగారు "అట్లాగనకు నాయనా! చీనా అనేది ఎక్కడో ఉందనుకుంటామా! హిమాలయాలు దాటి చీనా వెళ్ళచ్చు. నీకూ అదృష్టం అలాగే దగ్గరలో ఉందేమో" అన్నారు.

నేను తెల్లబోయాను. ★

మా క్లాసులో ఒక అమ్మాయి ఉండేది. ఆమెకు తలితండ్రులు ఏమి పేరు పెట్టారో తెలియదు "భారత భాగ్యలక్ష్మి సత్యభామేశ్వరీ వెంకటరత్నం" అని పేరెట్టుండొచ్చు; లేదా అంతకంటె పెద్ద పేరే పెట్టుండొచ్చు కాని మేమందరం ఆమెను ముద్దుముద్దుగా "చిలకమ్మ" అని పిలిచేవాళ్ళం. "పిలిచేవాళ్లం" - అంటే - అనే - అర్థమయిందిగా? అసలు పేరు ఎవడు పుణ్యం కట్టుకున్నాడో తెలియదు. ముప్ఫయిమూడు కోట్ల దేవతలు 'క్యూ'లో నిల్చునుండగా ఆమెకు ఈ పేరెందుకు పెట్టవలసివచ్చిందో తెలియదు. బహుశః ఆమె ముక్కు చిలకముక్కులా ఉంటుందనేమో? లేకపోతే ఆమెకు జామపళ్లు ఇష్టమనేమో? ఏది ఏమయినప్పటికీ, ఆమె 'చిలకమ్మ'యి కూర్చుంది.

ఇదంతా ఎందుకు చెప్తున్నానో తెలుసా? "చిలకమ్మ" అనే పేరు మీరు విన్నారు కాని 'చిలకయ్య' అనే పేరు మీరు ఎప్పుడయినా విన్నారా? లేదు. అంటే 'A' అనే వ్యక్తి "చిలకా" అని 'B' అనే వ్యక్తిని పిలుస్తున్నాడనుకోండి (లేదా పిలుస్తోందనుకోండి). దాన్నిబట్టి మనకు ఏం తెలుస్తోందంటే 'A' - మగవాడయినా ఆడదయినా కావచ్చును కాని 'B' మాత్రం తప్పక ఆడదే! (మీకు రహస్యంగా చెప్తున్నాను - మళ్లీ కొంపతీసి మా ఆవిడ దగ్గర అనేరు! - అప్పుడప్పుడు మా ఆవిడ దూర్వాసుడి పాత్ర ధరిస్తోంటుంది. మరీ చేతులు దాటిపోతూంటే "చిలకా!" అని సున్నితంగా వ్యవహరిస్తాను. అంతే! ఎక్కడి కోపం అక్కడ పటాపంచలయిపోతుంది.)

అయితే మనకు స్పష్టమైన విషయం ఏమిటంటే - 'చిలక' అంటే అది ఒక స్త్రీ యొక్క సర్వనామం అని. మరి — 'చిలక' ఆడదయితే 'రాచిలుక' మాత్రం కాదా యేం?

కర్త పాడుతున్నాడు: "నేను తుమ్ముతున్నాను. మొహమెత్తి చూడు!" అని. చూడవలసింది ఎవరు? ఒక 'రాచిలుక' - అంటే ఒక స్త్రీ. ఇంతకంటె అఘాయిత్యమేమైనా ఉందా? చెప్పానుగా? తుమ్మేటప్పుడు మొహం అష్టవంకర్లుగా తయారవుతుంది. కొంచెం అందంగాను నాజూకుగాను ఉన్న నా విషయమే అల్లా అయితే కొంచెం అటూ ఇటూగా ఉన్నవాళ్ల సంగతి ఏమిటి చెప్పండి. అందుచేత ఆత్మగౌరవం ఉన్న ఏ మగవాడయినా ఆడువారి ఎదుట తుమ్మడు. అదేవిధంగా ఆడవాళ్ల సంగతి కూడా.

ఈ పెద్దమనిషి ఈవిధంగా "తుమ్ముతా!" "చూడు!" అంటూ పాటలు పాడుతున్నాడా? మీకో విషయం చెప్పమంటారా? నే నింతకాలంనుంచి నా భార్యతో కాపురం చేస్తున్నాను. ఇంతవరకు మేమిద్దరం ఒకరెదురుగుండా ఒకళ్లం ఎప్పుడూ తుమ్మలేదు. అంటే అర్థమయింది కాదూ? ఒకసారిమాత్రం ఆవగింజంతలో ప్రమాదం తప్పిపోయింది. మా ఆవిడ చాకలాడికి బట్టలు వేస్తూంది. నాకు హఠాత్తుగా తుమ్ము వచ్చింది. అక్కడ అల్లా ఎందుకు తుమ్ము వచ్చిందో నే నింతవరకూ చెప్పలేను. విధికృతం అనుకుంటాను. "ఏయ్! పిల్లాడేడుస్తున్నట్లున్నాడు. పోయి చూసిరా!" అన్నాను. "లేదండీ! ఉయ్యాల్లో పడుకుని నిద్రపోతున్నాడు. ఏడుస్తున్నది పక్కింటివాళ్లబ్బాయి" అంది నిశ్చలంగా. నాకు తుమ్ము తుఫానులా వస్తోంది. "వంటింట్లోంచి మాడువాసన వస్తోంది. కూర పొయ్యిమీద పెట్టి మరిచిపోయి చక్కా వచ్చినట్లున్నావు చూడు" అన్నాను. "లేదండీ! వంటంతా అయిపోయింది. కూర దింపి వచ్చాను." అంది అత్యంత ప్రశాంతంగా! ఆడవాళ్లు మాత్రమే అంత ప్రశాంతంగా జవాబు లియ్యగలరు ఒక పక్కన కొంపలు ముంచుకొస్తూంటే! వెయ్యి పంజాబ్ మెయిల్సు పరుగెత్తుకొచ్చినట్లుగా వస్తోంది నాకు తుమ్ము. అప్పుడేం చేసేది లేక ఎడంచేతివైపు గుమ్మంలోంచి వెళ్ళి ఉయ్యాల్లో కుర్రాణ్ణి గట్టిగా గిల్లేసి కుడిచేతివైపు గుమ్మంలోంచి లోపలికి చక్కా వచ్చాను కుర్రాడు కేరుమన్నాడు. పద్దు పుస్తకం పారేసి "అయ్యో!" అంటూ పరిగెత్తింది నా ఇల్లాలు. "ఢాం!" అని తుమ్మేశాను నేను. భగవంతుణ్ణి తలచుకొన్నాడు చాకలాడు.

ఇదంతా ఎందుకని చెప్పానంటే ఆత్మగౌరవంగల ఏ మగాడూ ఆడదాని ఎదుట తుమ్మడానికి ఇష్టపడడు. నా సంగతి విన్నారుగా! కుర్రాడంటే నాకు అపరిమితమైన ప్రేమ. వాణ్ని చేతులారా గిల్లుతూంటే నేను పడిన బాధ - మొహం, చేతులు కూడా ఎర్రగా అయిపోయాయి! - లోహితాస్యుణ్ని అమ్మేటప్పుడు డి. వి. సుబ్బారావుగారు కూడా చూపించి ఉండరు. కడుపు తరుక్కుపోయింది. అయితేనేం? ఆత్మగౌరవం ప్రధానం! దానిముందు ఈ తుచ్ఛ మమకారాలు తొలగిపోవలసిందే!

అంటే కర్తగారిలో ఆత్మగౌరవం లోపించిందని నేను అనను. పాటను నేను బాగా చదివాను. మూలభావాన్ని నేను అర్థం చేసుకున్నానని అనుకొంటున్నాను. ఆ పాటలో ఒక ద్విగుసమాసం ఉంది. (ద్విగుసమాసమేనా అది?) అదే పాటకంతకీ ప్రధానమయినది. దానిని అర్థం చేసుకుంటే కర్తగారి మనస్తత్వం కూడా చక్కగా అర్థమవుతుంది. ఆ సమాసం ఏదో చెప్పమంటారా? వినండి: అదే "ఒకసారి."

మీకు తుమ్ముల్లో నమ్మకముందో లేదో తెలియదు. తుమ్ముల్లో ప్రతీవాడికి నమ్మకముంటుందిలెండి! ఉన్నా, లేకపోయినా - తుమ్ము వచ్చినప్పుడు తుమ్మి తీరవలసిందే! నే నడిగేది - ఏదయినా పని మొదలెట్టి

ప్పుడు ఎవరైనా తుమ్మితే పని పాడవుతుందని - ఫలనావాడు తుమ్మితే పని నాశనమవుతుందని - ఇటువంటి నమ్మకాలు మీకేమైనా ఉన్నాయా? అని.

మా అన్నయ్యకు తుమ్ముల్లో బాగా నమ్మకం. ఏదైనా ఆలోచిస్తున్నప్పుడుగాని ఏదైనా పనిచేస్తున్నప్పుడుగాని ఎవరైనా తుమ్మేరా - అంతే! శాపనార్థాలు పెట్టేవాడు. ఎదుటివాడు చిన్నవాడయితే పైకి; పెద్దవాడయితే లోలోపల. కాని, నా ఖర్మంకాలి, నేను మా అన్నయ్యకంటె ఎప్పుడూ చిన్నవాడినే అయిపోయాను. ఒకప్పుడు అనుకుంటూంటాను: మిగిలిన వాటికోసం కాకపోయినా, అధమం తుమ్ములకోసమైనా నేను మా అన్నయ్యకంటె పెద్దవాణ్ణయితే బాగుండునని!

నేను మీకు చెప్పానుగా — నేను మా అన్నయ్యకంటె చిన్నవాణ్ణని? ఫలితమేమిటంటే - మా అన్నయ్యను కేంద్రంగా తీసుకొని అర్థమైలువ్యాసార్థంతో ఒకవృత్తాన్ని మట్టి వృత్తంమధ్యలో నే నెక్కడ ఎప్పుడు ఎలాంటి పరిస్థితులలో తుమ్మినా, మా అన్నయ్య పెట్టేవాడు శాపనార్థాలు. ఒకవేళ ఖర్మంకాలి మా అన్నయ్య తలపెట్టినపని పెద్దదయినా, లేదా నేను తుమ్మిన తుమ్ము పెద్దదయినా - ఆవేళకు తూర్పు బెంగాలు శరణార్థుల్లాగ ప్రక్కింట్లో తలదాచుకోవలసిందే!

ఒకరోజున మా తాతగారిపక్కన కూర్చున్నాను. ఆయన పొడుం బాగా పీల్చేవాడు. కళ్లు చిన్నప్పుడే పోయాయి. నిశ్శబ్దంగా వచ్చి తీసుకుంటే పొడుంకాయ మన స్వాధీనం అయేది. ఒకపట్టు పొడుంతీసి ముక్కులోకి దట్టించాను. నాకేం తెలుసు? ఆవేళ పొడుంలో మిరపకాయల పాలు ఎక్కువ అయింది కాబోలు! ఢాం అని తుమ్మేశాను. సరిగ్గా మా అన్నయ్య కుడికాలు తీసి బండిలో పెడుతున్నాడు. వెంటనే ఆ కాలుకూడా కింద పెట్టేసి, పెద్దపులిలా వచ్చాడు లోపలికి. "ఏరా! తుమ్మడానికి ఇదే సమయం దొరికిందీ? నేను ఆఫీసుకు పోతున్నానుగదా! తుమ్మొస్తే లోపలికి పోయి తుమ్మలేవూ?" అన్నట్టు శబ్దాలు చేశాడు. ఇంకోనిమిషం ఉంటే నాలుగు వేశేవాడే! ఈ లోపుగా నా చేతిలో ముక్కుపొడుం డబ్బీ కనబడింది. ఒక్కసారి ధర్మరాజులా మొహం పెట్టి "పొడుం పీల్చావేమిట్రా?" అన్నాడు.

నాపరిస్థితి అయోమయంలో పడింది. ముందు చూచిన అన్నయ్య; వెనుక చూచిన తాతయ్య. పీలవలేదంటే అన్నయ్య మీద పడతాడు; పీల్చానంటే తాతయ్య వెనక పడతాడు. "ఏమిరా భగవంతుడా?" అని ఆలోచిస్తోంటే మళ్లీ ఇంకో తుమ్ము వచ్చింది. మా అన్నయ్య చిరునవ్వులు నవ్వుకొంటూ వెళ్ళిపోయాడు.

మా అన్నయ్య చిరునవ్వులు విరజిమ్ముతూ పోడానికి కారణం ఉంది. తుమ్ము ఒకసారి తుమ్మితే ఎంత అపాయమైనాసరే రెండోసారి తుమ్మేటప్పటికి అదంతా కొట్టుకుపోతుంది. అయితే ముక్కుపొడుం ల్చినతుమ్ములు (అంటే అర్థం ముక్కుపొడుం పీలవగా వచ్చిన తుమ్ములు అన్నమాట!) లెక్కలోకి రావు.

ఈ తుమ్ముల్లో నమ్మకం ఉండడంవల్ల కొన్ని నష్టాలున్నా కొన్ని లాభాలుకూడా ఉన్నాయి. మా తెలుగు మాస్టారికి తుమ్ముల్లో బాగా నమ్మకం. ఆయన క్లాసులోకి వస్తే ఎక్కడ 'గ్రామరు' చెప్పుతాడో అని మాకందరికీ భయమేసేది. అందుకని రోజూ కొకడు చొప్పున వంతు వేసుకొని హెడ్ మాస్టరుగారి గది ప్రక్కన నుంచునేవాళ్లం. ఆయన సరిగా క్లాసు కొద్దామని బయలుదేరేసరికి ముక్కుపొడుం దట్టంగా పీల్చి తుమ్మేవాళ్లం. ఆయన 'నల్ల' దగ్గర కళ్ల కాళ్లు కడుక్కొచ్చేవాడు. పాఠం మొదలెట్టి, దేముణ్ణి తలచుకొని, "రంతుల్ మానుము కుక్కుటాధమ!" అనేసరికి ఎవడో వెనుకనుంచి "ఢాం!" అనేవాడు. దాంతో అరగంటవరకు పాఠం ఉపక్రమించేవాడు కాదు మా మాస్టరుసాబ్.

ఇంతకీ మీకు చెప్పదలుచుకున్నదేమిటంటే - ఒకసారి తుమ్మడానికి రెండుసార్లు తుమ్మడానికి చాలా తేడా ఉందని. ఇది సామాన్యుల విషయంలో. కొందరు పెద్దలుంటారు: వాళ్లు ఒకసారి తుమ్మినా ఒకటే; పదిసార్లు తుమ్మినా ఒకటే. మా వెంకయ్యగారి తమ్ముడుసంగతి చెప్పానను కొంటాను. మా ఊళ్ళో దుకాణాలవాళ్ళందరూ, ఏదైనా పెద్దబేరం వచ్చినప్పుడు, "వెంకయ్య తమ్ముడు లేడు కదా?" అటూ ఇటూ చూసి మరీ వ్యవహారం జరుపుకొంటారు. అతడు తుమ్మడంలో ప్రపంచానికి ఎంత ప్రమాదం తెచ్చిపెడతాడో - తుమ్మేవిధంవల్లకూడా అంతే ప్రమాదం తెచ్చిపెడతాడు. అంటే మీకర్థంకాలేదనుకొంటాను. మనం రెండురకాల తుమ్మేవాళ్ళను చూశాం; (లేదా విన్నాం) ఒకరకంవాళ్లు 'వార్నింగు' ఏమీ ఇవ్వకుండానే 'ఢాం' అని తుమ్ముతారు. వినగానే మనకు గుండె ఒకసారి ఆగిపోతుంది; కాని మళ్ళీ కొట్టుకోడం ప్రారంభిస్తుంది. రెండోరకంవాళ్లు రెండంతస్తులమేడ ఎక్కుతోన్నట్టు తుమ్ముతారు: "హాచ్ హాచ్ఛ హాచ్ఛ...హాచ్ఛ!" అంటూ. కాని మా వెంకయ్యగారి తమ్ముడు ఇల్లాగా కాకుండా అల్లాగా కాకుండా "హాచ్ హాచ్ఛహాచ్ఛ ...ఢాం!" అని తుమ్ముతాడు. అలవాటయినవాళ్లుతప్ప కొత్తవాళ్లు వస్తే చాలా ప్రమాదకరమయిన విషయం.

వెంకయ్యగారి తమ్ముడు ఒకసారి తుమ్మినా సరే పదిసార్లు తుమ్మినాసరే ఒకటే ఫలితం అని చూసినవాళ్లు (అంటే - అదే - విన్నవాళ్లు) అందరూ చెప్పుతూంటారు. కాని సామాన్యులవిషయంలో 'ఒకసారి' తుమ్మడం చాలా హానికరమయినదని ఒప్పుకోకతప్పదు.

ఇందాక చెప్పిన గాయకశిఖామణి పాడాడు: "తుమ్మెదా ఒకసారి" అంటూ. ఒక విషయం ఆలోచించండి. తుమ్మడానికి ముందు ఎన్నిసార్లు తుమ్మగలమో తెలుస్తుందా మనకు? తెలియదు; తెలియడానికి అవకాశం లేదు. తుమ్ము (లేక తుమ్ములు) రాబోతున్నది (లేక రాబోతున్నాయి) అని మాత్రం ముందు తెలియవచ్చు. కాని ఒకసారా రెండుసార్లా అన్న విషయం ముందు తెలియదు. అయినప్పుడు ఈ పెద్దమనిషికి ఒకసారి తుమ్మబోతున్నట్లుగా ఎల్లా తెలుసు?

దీనికంతకీ అర్థం ఒకటే ఉంది. ఆ "రాచిలుక" ఎవరో నాకు తెలియదుకాని ఆ "రాచిలుక" అంటే ఈ కర్తకు ఇష్టం లేదని మాత్రం తెలుసు. ఆమె అంటే ఇతనికి పడదు; ఆమె పని పాడుచేయాలని నిశ్చయం చేసుకున్నాడు. అతనికి తుమ్ముల్లో నమ్మకం ఉందా లేదా అన్నది సందేహాస్పదమైన విషయం; ఆమెకు నమ్మకం ఉందా లేదా అన్నది కూడా సందేహమే. నమ్మకం ఉంటే తుమ్ముయొక్క ఫలితం ప్రత్యక్షంగా కనిపిస్తుంది; లేకపోతే పరోక్షంగా కనబడుతుంది. నాకు మటుక్కు - పిచ్చినమ్మకాలు వేటిల్లోను - తుమ్ములతో సహా - నమ్మకంలేదు. అయినప్పటికీ, వెంకయ్యగారి తమ్ముడు తుమ్మితే కాస్త కాళ్లు కడుక్కొని మరీ చేస్తాను ఏ పనయినా! అందుచేత తుమ్ముల్లో నమ్మకం లేకపోయినా మనం ఏదయినా పని ప్రారంభిస్తోన్నప్పుడు ఎవరైనా తుమ్మాలని మనం అనుకోంగదా! అదే విధంగా పాపం ఆ 'రాచిలుక' ఏదయినా శుభకార్యం ప్రారంభిస్తోన్నట్లుంది. అది పాడుచేద్దామనే ఉద్దేశ్యంతో ఈయన "తుమ్మెదా!" "తుమ్మెదా!" అంటూ పాడుతున్నాడు. నిజంగా తుమ్మినా తుమ్మకపోయినా ఈ బెదరింపులకు ఆ 'రాచిలుక' మన స్తత్వంలో మార్పులు ఏర్పడి పని పాడుచేస్తుందనడంలో సందేహంలేదు. అందులో ఒకసారి తుమ్ముతాననడం!

ఇది సమంజసం అని ఎవరూ అనలేరు. భారతరాజ్యాంగం ప్రకారం అందరికీ ప్రాథమిక హక్కులున్నాయి. ఇంకొకరి హక్కులకు భంగం కలగనంతకాలం తోచినది మాట్లాడవచ్చు; వ్రాయవచ్చు; ఉపన్యా

(55-వ పేజీ చూచండి)

విజ్ఞానవీధులు ★ 'డాక్టర్'

జీవపరిణామము

సృష్టిలోని జీవులనూ, వాటి అలవాట్లనూ, వాటి అంగవికాసమునూ పరిశీలించినవారికి ఇవన్నీ ఒక్కరోజున, లేదా ఆరు రోజులలో, పుట్టుకువచ్చియుండవనీ, జీవ బాహుళ్యము క్రమవికాసము పొందియుండడమువల్లనే ఈ రూపాలన్నీ ఏర్పడి ఉంటాయనీ అనిపిస్తుంది. కేవలం జంతువుల బహిస్స్వరూపాన్నే కాక, వాటి అస్థిపంజరాలూ, గుండె, ఊపిరితిత్తులూ, ఇతర అవయవాలూ గుర్తిస్తే తెలిసే అవయవ వికాసాన్ని బట్టి జీవజంతువుల్ని సృష్టి వికాసపు మెట్లవరుసమీద అమర్చవచ్చుననిపిస్తుంది. సృష్టి అంతా వికాసపు పరిణామమే కాని హఠాత్కర్మ కాదనే అనుమానమూ నమ్మకమూ పూర్వులలో కూడా చాలామంది మేధావులకుండేదనిపిస్తుంది.

పదిహేనవ శతాబ్దములో లియోనార్డో డావిన్సీ (1452—1519) అనే సర్వతోముఖ పండితుడు (ఇటలీలోని ఫిరెంజీ నగరమువాడు) ఫాస్సిల్సు అనే శిలలు ఎప్పుడో జీవించియుండిన జంతువుల రూపాలని చెప్పాడు. ఈ వింతవిషయం ఏదో కొంత వినోదాన్ని కలిపిందేమో కాని ఆ చిహ్నాలనిబట్టి పూర్వయుగాల్లో వుండిన ప్రాణుల రూపపరిశీలన చేసేజిజ్ఞాసని రేపలేదు. తరువాత మూడు శతాబ్దాల తరవాత లేమార్కు అనే ఫ్రెంచి జంతుశాస్త్రజ్ఞుడు, తిమింగిలానికి వెనక 'కాళ్లు' ఉండేవనీ, కొన్ని తరాలపాటు ఈ కాళ్లను తిమింగిలాలు ఉపయోగించక పోవడమువల్ల ఇవి కృశించిపోయి క్రమంగా లోపించిపోయాయనీ అన్నాడు. అంటే ప్రాణుల అంగభేదము ఉపయోగాన్నిబట్టి మారుతుందన్నాడన్నమాట. శతాబ్దాలు గడిచిపోతే ఒక ప్రాణి రూపే మారిపోవచ్చునట! దానికి కారణము పైనుంచి ఎక్కణ్ణించో వచ్చినది కాదు! ఆ ప్రాణి అలవాటే! పెంగ్విన్ అనే చలిదేశపు పక్షి నీటిలో ఈదగలదూ, గాలిలోనూ ఎగరగలిగివుండాలి. దాని ఆహారము చేపలు. కనక ఆపక్షి గాలిలో ఎగరడము మానేసి నీటిలోనే ఈదుతూ ఆహారాన్వేషణ చేస్తూండడమువల్ల కాలక్రమాన్ని దాని రెక్కలు బలమై, ఈకలు ఉపయోగము లేక పోవడమువల్ల రాలిపోయి, రెక్కలు నీట్లో ఈదడానికేగాని గాలిలో ఎగరడానికి పనికి రాకుండాపోయాయి నేటికి. ఇలాంటి మార్పులెన్నో గుర్తించిన లేమార్కు మరో అడుగు ముందుకువేసి, "అవసరాన్నిబట్టి వచ్చినమార్పులు కాలక్రమాన్ని నిలదొక్కుకుని ఆ ప్రాణినే మార్చివేయవచ్చును. అంటే ఈమార్పులవల్ల ఒక ప్రాణి మరొక రూపాన్ని పొంది, తాతముత్తాతలకంటె వేరయిపోవచ్చు"నన్నాడు. సృష్టి గభీమని జరిగిందన్న నమ్మకానికి ఈయుద్ఘాటనము గొడ్డలిపెట్టు అయింది. ఒక ప్రాణినుంచే ఇంకోరకము ప్రాణి ఏర్పడవచ్చును! "సృష్టి అంతా ఇలాగే ఏర్పడి ఉంటుందా?" అన్న అనుమానము కలుగుతుంది. అయితే లేమార్కు చెప్పినమార్పు ఏదో ఒక అంగములో వచ్చిన మార్పు. ఈ మార్పు ఆ జంతువు గుణాల్ని మార్చివేయగలదనడానికి వీలుపడదు. పరిణామమే వివిధ జంతుజాలపు పుట్టుకకి కారణమనాలంటే గుణాలను మార్చగల పరిణామాన్ని పట్టి చూపించాలి. మెండెల్ కనిపెట్టాడీ పరిణామాన్ని.

మెండెల్ క్రైస్తవ సన్యాసి. తన తోటలో చిక్కుడు మొక్కలతో అనేక ప్రయోగాలు చేసి పారంపర్యంగా వంశంలో వచ్చే మార్పుల్ని గణితశాస్త్ర సూత్రాల్లాగ నిర్మించాడు. వాటి ఫలితమును చెప్పాలంటే ఇలాగ చెప్పవచ్చు. ఇద్దరు తెల్ల మనుష్యులు నీగ్రో కాంతలను వివాహమాడినారనుకుందాము. వీరి సంతానము తెల్లగానే వుంటారు. ఇది మొదటి తరము. కాని నలుపువర్ణము వీరి రక్తములో అంతర్భాగమై యుంటుంది. ఇప్పుడు మొదటి తరమువారు (ఆ రెండు కుటుంబాలవారు) వివాహము చేసుకుంటారనుకుందాము. భార్యాభర్త లిరువురూ తెల్లగానే వుంటారు. కాని వారికి నలుగురు సంతానము పుట్టితే ఒకరు నల్లగా నీగ్రోలాగే వుండి నీగ్రో లక్షణాలే కలిగివుంటారు. ఈ సంతానపు వంశము - నీగ్రోలతోనే సంబంధము పెట్టుకుంటే - నీగ్రోవంశమే అవుతుంది. మిగిలిన మువ్వురిలో ఒకరే పూర్తి తెలుపు. తక్కిన ఇద్దరూ తెల్లగావున్నా వారిలో నీగ్రో అంశలుంటాయి. ఏతావాతా తేలేది. జాతుల సంకరమువల్ల సంతానములో రెండుజాతుల లక్షణాలూ కనిపిస్తాయీ, మళ్ళీ ఏ జాతి కాజాతి కూడా సాగిపోతుంది. కనుక మెండెలిజము ప్రాణులలో గుణభేదానికి కారణాన్ని చూపిస్తోంది అన్నమాట. 1950 లో ఇటలీలో ఒకపిల్లి కుక్కపిల్లల్ని కన్నది. వాటి ఆకారము కుక్కపిల్లలాగే వున్నా కాలిగోళ్లూ, పొడుగుమీసాలూ పిల్లిని పోలేయి. ఈ రీతిగా జంతుసాంకర్యమువల్ల రకరకాల మిశ్రమ జంతువులేర్పడవచ్చును.

అయితే ప్రపంచములో ఇన్ని మిశ్రమాలూ వివరంగా కనపడవేమి? వీటి సహజశక్తి అవి నివసించే చోట్లలోని పరిస్థితులకి తట్టుకుని ఆజాతికి నిలవరించుకోగలిగితే ఈ సంకరజాతులు నిలుస్తాయి. లేకపోతే ఇవి నాశనమైపోతాయి. కాలక్రమాన్న అతి నెమ్మదిగా పరిణామము జరిగి కొత్త ప్రాణులు బయల్దేరతాయి. బ్రతుకుకోసము ప్రాణిపడే తంటాల్లో గట్టి జాతులే నిలుస్తాయి. కనక జీవపరిణామప్రవాహంలో తట్టుకు నిలబడగలిగే ప్రాణులు రేవుల్లాగ నిల్చిపోతాయి. తట్టుకోలేనివి అంతర్ధానమౌతాయి. మనకి కనపడే ప్రాణిజాతులు గట్టుగా నిల్చి వాటి అవసరాల్నిబట్టి, పరిస్థితుల్నిబట్టి, జీవప్రవాహాన్నుంచి వేరైన ప్రాణులజాతులు. వీటికి సాంకర్యము ఏర్పడడానికి వీలులేనంతగా ఇవి మారిపోయి రూపు పొందేయి.

ఈ శతాబ్దములో శాస్త్రజ్ఞులు విత్తనాలను X కిరణాలతో దీపింపజేసి, తరవాత వాటిని నాటి, అందునుంచి బయల్దేరిన మొక్కల్ని భేదాలకోసము పరిశీలించారు. భేదాలు - చిన్న చిన్నవైతేనేమి కనపడ్డాయి. ఇంతమాత్రమే కాదు. ఈ భేదాలు ఈ మొక్కల విత్తనాలవల్ల బయల్దేరిన మొక్కలలోనూ కనబడ్డాయి. రసాయనాలు ఎరువులుగా మార్చిమార్చి వేసి పూలరంగు మార్చవచ్చునని శాస్త్రజ్ఞులు గ్రహించారుగాని ఈమార్పు ఆ మొక్కలవంశానికి హత్తడము లేదు అనీ గుర్తించారు. విత్తనాలను X - కిరణాలను దీపింపజేసినప్పుడు వచ్చినమార్పులుమట్టుకు వంశపారంపర్యంగా వ్యాపించాయి. కనక జీవపరిణామానికి ఇంకో కారణము కిరణదీప్తి అంటారు నేటి వృక్షశాస్త్రజ్ఞులు. కిరణదీప్తివల్ల జీవకణాలలోని ఒకమూల జీవపదార్థము చచ్చిపోతుందనీ, దీనివల్ల మొక్కలలో మార్పు వచ్చి ఆ మొక్క వంశానికంతటికీ అలవడిపోతుందనీ గుర్తిస్తున్నారు. విత్తనాలమీద X - కిరణాలను దీపింపచేసి, ఆ విత్తనాలనుంచి పుట్టిన మొక్కల్ని పరిశీలించడము నేడు విరివిగా జరుగుతున్న కృషి. అయితే సూర్యరశ్మిలో X కిరణాలున్నాయి గనకనా, ఈ పరిశోధనవల్ల, ఆధునిక శాస్త్రపరికరాలవల్ల మొక్కల్ని మార్చవచ్చునన్న సంగతి తెలుస్తుందిగాని మొక్కల్లో శతాబ్దాలతరబడిన వచ్చియుండిన మార్పులు ఎలాగు తెలియగలవూ? అన్న సందేహము కలగవచ్చును. సూర్యరశ్మి శక్తికంటె X - కిరణాల సూర్యకిరణాలు చాలా కాలానికి తీసుకురాగలిగిన మార్పును X కిరణాలు కొద్దికాలములో తీసుకురాగలవు. కనుక X కిరణాలతో చేసిన ప్రయోగాలవల్ల, సూర్యరశ్మి తీసుకురాగల మార్పులు కొద్దికాలములో తెలుస్తాయి. ఈనాటి కృషి ముఖ్యముగా X - కిరణాల ఉపయోగమువల్లనే. ★



గంప గంగమ్మ

చిత్రకారుడు: పి. ఆర్. రాజు, మద్రాసు.

సీరియల్

ఉదయ కిరణాలు

పోతుకూచి సాంబశివరావు

19

పరంధామయ్య ఆఫీసులో కూర్చుని ఫైళ్ళు తిరగవేస్తున్నాడు. పన్నెండు గంటలకు ఒక కేసు వినవలసిఉంది. కేసులోని చిక్కులు జాగ్రత్తగా మనస్సులో విడగొట్టుకుంటున్నాడు.

గుమాస్తా బసవయ్య చేతిలో కాగితంతో ప్రవేశించాడు.

'ప్లీడరు శివరాంగారికి ఒంట్లో సుస్తీగా ఉందిట వాళ్ళ ఇంట్లో నౌకరుచేత యీ ఉత్తరం పంపించారు. ఆయన కేసు వాయిదా వెయ్యమని కోరుతున్నారు.

'నిన్న పిడుగులా ఉన్నాడు కదుటోయి! కోర్టుకు వచ్చాడు! యీ వేళ ఒంట్లో బాగు లేదూ? పరంధామయ్య ఆశ్చర్యపడ్డాడు.

'శ్రాత్రిగా ఒంట్లో జబ్బు కాదులెండి. మనోవ్యాకులతలో పడిఉంటాడు?'

'ఏం?'

'వారి అమ్మాయి యింట్లో ఉండే గుమాస్తాతో లేచిపోయిందిట.'

'అరెరే!' పరంధామయ్య చెవులు రిక్కించాడు.

'ఇంట్లో ఎదిగిన పద్దెనిమిదేండ్ల పిల్లకు పెళ్ళి చెయ్యకపోతే ఏమౌతుందండి!!'

'ఏం ఎందుకు చెయ్యలేదు!'

'చదువుకుంటోంది గదా! పెళ్ళి చెయ్యొచ్చు' అంటూ కాలయాపన చేశారు."

పరంధామయ్యకు శివరాంపై జాలి కలిగింది. కేసు వాయిదా వేశాడు.

'మీ రెండో అమ్మాయిగారికి కూడా త్వరగా పెండ్లి చేసెయ్యండి!' గుమాస్తా బసవయ్య సలహా యిచ్చాడు.

సాంబుతో తరుచు కనిపించే పూబంతిని అనుమానించే బసవయ్య యీ మాట అన్నాడు. కాని తనకు ఒక అనుభవజ్ఞుడైన పెద్దమనిషి సలహా యిచ్చేడని మాత్రమే పరంధామయ్య అనుకున్నాడు.

అయినా శివరాం కూతురు లేచిపోయిన విషయం పరంధామయ్య హృదయాన్ని హత్తుకుంది. పూబంతి పెండ్లి త్వరలో చేసేస్తే మంచిదని తీర్మానించుకున్నాడు.

స్రవంతిని సలహా అడిగాడు.

'సాంబుకిచ్చి పెండ్లి చేద్దాం. పూబంతి అతనంటే అనురాగం చూపిస్తోంది.'

భార్య సలహా విని భగ్గుమన్నాడు పరంధామయ్య.

'నా కంఠంలో ప్రాణముండగా ఆ కుటుంబంతో యీ జన్మలో సంబంధం కలుపుకోను'

పరంధామయ్య కేకలకు స్రవంతి హడలిపోయింది.

పెండ్లి సంబంధాలు వెదకమని సోమయాజులుదగ్గరకు వెళ్ళడానికి జంకాడు. అతనికి ఈ విషయంలో స్వార్థముందని పరంధామయ్యకు తెలుసు. రామలింగశర్మ ఇంటగు చదువుతున్నా, తల్లితండ్రుల గారాబంవల్ల పెంకిగా తయారయ్యేడు. అతడి ప్రవర్తన పరంధామయ్యకు తృప్తిగా లేదు.

గుమాస్తా బసవయ్యను పిలిచాడు పరంధామయ్య.

'మా అమ్మాయికి ఏమన్నా సంబంధాలు చూసి పెట్టండి!'

బసవయ్య ఆశ్చర్యపోయాడు.

'కంటి కెదురుగా ఇద్దరు మేనల్లుళ్ళను పెట్టుకుని పరాయి సంబంధాలకు వెళ్ళడమెందుకండీ!'

'ఆఁ. దానికి కొన్ని కారణాలు ఉన్నాయిలే!' మాటలు దప్పరించాడు పరంధామయ్య.

బసవయ్య మనస్సులో మాట అనేద్దామనుకున్నాడు.

'మీ అమ్మాయిగారు మీ యింట్లోని మేనల్లుడితో చాలా చనువుగా ఉంటారు. నేను చాలాసార్లు చూశాను. బహుశా వారిద్దరికీ అనురాగం ఉండిఉంటుంది' తలగోక్కున్నాడు బసవయ్య, మాటలు నములుతూ.

పరంధామయ్య ముఖం కోపంతో జేవురుముద్దలా అయింది. 'ఆ సంబంధం సరే అనుకోండి! ఇంకా ఏమైనా ఉంటే చెప్పండి' అంతటితో సంభాషణ బలవంతాన ఆపేశాడు పరంధామయ్య.

యింటికి రాగానే, కోటు విప్పుకుంటూ కోపంతో పిలిచాడు పరంధామయ్య రెండో కూతుర్ని.

'పెండ్లియీడు వచ్చిన పిల్ల పరాయి మగవాడితో తిరగకూడదని తెలియదూ?'

పూబంతి తలవొంచుకుంది.

'ఈసారి సాంబుతో కనిపించు! ఏం చేస్తానో!' పళ్ళు బిగించి అరిచాడు పరంధామయ్య.

తండ్రివైపు నిరసనగా ఒక చూపు చూసి మౌనంగా కదిలిపోయింది పూబంతి.

పరంధామయ్య పై సంబంధాలు చూస్తున్నాడని బసవయ్యద్వారా విని సోమయాజులు యీ విషయం భార్య చెవిలో ఊదాడు. సీతమ్మ చిందులు త్రొక్కింది.

'వాగ్దానమిచ్చిన మనిషి యిప్పుడు ఎల్లా కాదనగలడండీ! యీ ఆశతో కేకదా వాళ్ళ చామంతికి సంబంధాలు వెతికిపెట్టి నానా హైరానాపడ్డాం!' సీతమ్మ పట్టుదలతో బయలుదేరింది మర్నాడు పరంధామయ్య యింటికి.

'పూబంతికి పై సంబంధాలు చూస్తున్నారట!'

'ఏమో నాకేం తెల్సు' స్రవంతి తన అజ్ఞానం చెప్పుకుంది.

'ఏం చోద్యమమ్మా! మొగుడు చేసేపని పెళ్ళానికి తెలియదూ! ఇటువంటి పెళ్ళివిషయాలలో ముఖ్యంగా!!' దవడలు నొక్కుకుంది.

'నామాట, నా సలహా పాటిస్తేగా!' స్రవంతి ముఖం చిట్లించుకుంది.

'పూబంతిని మా శర్మకు యిస్తానని మాట యిచ్చేడు కదమ్మా?'

'ఆసంగతి ఆయన్నే అడుగు!' స్రవంతి ముఖం త్రిప్పుకుంది.

'భార్యాభర్తలిద్దరూ గడుసువాళ్ళే! అదేదో నేనే గట్టిగా పరంధామయ్యనే అడుగుతా!'

అంటూ గృహోన్ముఖురాలైంది సీతమ్మ.

ముందు సాంబు మీద ఏమాత్రం పరంధామయ్యకు అభిమానం కల్గకుండా, భాగ్యపోరువల్లనైనా, సాంబుని అల్లుడిగా చేసుకోకుండా ఉండేటట్లు వాతావరణం సృష్టించాలని నిశ్చయించుకుంది సీతమ్మ.

'విన్నావుటరా! సాంబు బోగంకొంపలకు కూడా తిరుగుతున్నాడుట! ఎంత బద్ధవైరమున్నా, ఒకసారి మాణిక్యానికి యీ సంగతి చెప్పి, సాంబు పాడైపోకుండా కాకలేయించకూడదూ!' సీతమ్మ పరంధామయ్య మనస్సులో ఒకవిత్తు నాటింది.

'మనకెందుకే వాళ్లగొడవ!' కసిరాడు పరంధామయ్య.

తన పన్నుగడ పారిందని ఊరుకుంది సీతమ్మ.

ఒకరోజు సుబ్బమ్మ పనికట్టుకుని పరంధామయ్య యింటికి పచారువచ్చింది.

'ఏమిటమ్మా! మీ మేనల్లుడు సాంబు ఆ పాత అద్దెయింటిపిల్లతో తిరుగుతున్నాడుట! అలాటివాడికి మీపిల్లనిస్తారుటకదూ!'

స్రవంతికి కోపం వచ్చింది.

'ఆ గొడవలన్నీ మాణిక్యానికి చెప్పండి. మా కెందుకు!'

స్రవంతి నిజంగా లోలోపల బాధపడింది సుబ్బమ్మ మాటలు నిజమూ అని. తల కొట్టేసినట్లు బాధపడింది. పూబంతిని పిలిచింది.

'అమ్మాయి! నువ్వు సాంబుతో తిరగకు!'

'ఎందుకమ్మా.'

'నా జొట్టి ముండల ముఠాకోరని అందరూ అనుకుంటున్నారు?'

'అబద్ధం! అమ్మా!' అరిచింది పూబంతి.

'ఏమిటే, ఆ అరుపు!'

'ఎవరన్నారు ముండల ముఠాకోరని! నాకు తెల్సు నావ సంగతి! మీ రెవ్వరూ చెప్పనక్కర్లేదు!' గిరుక్కున వెళ్లిపోయింది తన గదిలోకి.

స్రవంతి కూతురు ప్రవర్తనకు విస్తుపోయింది.

ప్రకాశం మద్రాసు వెళ్లిపోయాక, సాంబు యింటి పెద్దగా ఒక హోదా సంపాదించుకున్నాడు—పూబంతితో పరిచయం కలిగాక, మునుపు చేసే అల్లరి చిలిపిపనులు పూర్తిగా మానేశాడు. పూబంతి నే తప్పక పెండ్లిచేసుకోవాలని తీర్మానం చేసుకున్నాడు. పైగా ఒకరి కొకరు వాగ్దానం చేసుకున్నారు.

రాత్రి పడుకోబోయేముందు ఒరిసిన పాదాలకు వ్యాసులైను వ్రాసుకుంటూ ఏదో ఆలోచిస్తూ కూర్చుంది మాణిక్యం.

చేతిలో పుస్తకం మూసేస్తూ సాంబు ఆమె దగ్గరకు చేరాడు.

'అమ్మా'

మాణిక్యం కొడుకువైపు తెల్లబోయి చూసింది. అంత నమ్రత సాంబులో ఎప్పుడూ కనిపించలేదు.

'పూబంతికి పెళ్లిచేస్తారుట కదూ!'

'అనుకుంటున్నారు' ఈ ప్రస్తావనలోని అర్థం మాణిక్యం గ్రహించింది.

'సంబంధం నిశ్చయమైందా!

'ఏమో! నాకేం తెల్సు! నాతో ఎవరైనా ఏమన్నా చెబితేగా! వాళ్ళగుమ్మమే తొక్కకూడదుగా 'నేను' మాణిక్యం తన పరిస్థితి వ్యక్తం చేసింది.

'నువ్వు పరంధామయ్య మామయ్యతో చెప్పమ్మా'

'ఏమని?'

'నేను పూబంతిని పెళ్లిచేసుకుంటానని.'

సాంబు యిల్లా అంటాడని మాణిక్యానికి తెలుసు. కాని ఏమీ ఎరగనట్లు నటించింది. పరంధామయ్య పట్టుదలలో పూబంతిని సాంబుకు యిచ్చే సూచనలు ఏమాత్రమూ లేవు. ఇది తెలిసికూడా వృధా ప్రయాస ఎందుకనుకుంది మాణిక్యం.

'పూబంతికూడా నన్నే చేసుకుంటానంటోంది. నువ్వోసారి మామయ్యతో మాట్లాడమ్మా!'

'లాభంలేదు!' మాణిక్యం నిట్టూర్పు విడిచింది.

ఆడపెళ్లివారు మొగపెళ్లివారివద్దకు రాకుండంపోయి, మొగపెళ్లివారు ఆడపెళ్లివారిని పిల్ల నియ్యమని ప్రాధేయపడేగతి పట్టింది అనుకుంది ఆమె. మేనరికంలో యిటువంటి హెచ్చుతగ్గులు పట్టించుకోకూడదని చివరకు సర్దుకుంది. చామంతి అంటే ఎంత అభిమానమో, పూబంతిఅన్నా అంతే మాణిక్యానికి. ఆ యిద్దరిలో ఎవరో ఒకరైనా తన యింటికోడలు కావాలనేకోరిక మాణిక్యానికి కూడా ఉంది. కాని పరంధామయ్య కోపానికి జడిసి ఏమాటా అనకుండా దూరంగా ఉంటోంది. పిల్లలు యిష్టపడ్డప్పుడు పరంధామయ్య ఎల్లాగైనా చివరకు ఒప్పుకొంటాడేమోనని ఆశించింది.

చూడగానే ముఖం త్రిప్పుకుని అసహ్యించుకుంటున్న పరంధామయ్యను పలకరించి, పెండ్లివిషయం కదిపింది మాణిక్యం.

'పిల్లలకిద్దరికీ యిష్టమే! నువ్వు ఒప్పుకుంటే బాగుంటుంది!'

'ఇదంతా నువ్వు చేస్తున్న పన్నాగమే! ఈడొచ్చినపిల్లతో సాంబును ఎందుకు తిరగనిస్తున్నావు! మీ రిద్దరూ కలిసి దానికేదో మందు పెడుతున్నారు!'

పరంధామయ్య నిందకు ఓరిమివహించింది మాణిక్యం.

'నీ ముండలముఠాకోరుకొడుక్కి యీ జన్మలో పిల్ల నివ్వదల్చుకోలేదు!'

పరంధామయ్య రుసరుసలాడుతూ శివం ఎత్తినట్లు అరిచి లేచిపోయాడు ఇంట్లోకి.

దిగాలుపడి తిరిగివచ్చింది మాణిక్యం.

సాంబు యీ సంభాషణ విన్నాడు.

'పూబంతిని యింకొకరికిచ్చి ఎలా పెళ్లి చేస్తాడో చూస్తాగా!' అంటూ తల్లిముందే అరిచాడు సాంబు.

బసవయ్యగారు పూబంతికి సంబంధాలు చూస్తున్నాడని తెలిసి సోమయాజులు ఆయన్ని మచ్చిక చేసుకోడానికి ప్రయత్నించాడు. దోసిలినిండే బహుమతి యిచ్చి

తల్లి అనూహ్యక పూబంతి దిగులుతో చిక్కిపోతోంది. నాల్గురోజులు గదిలోంచి బయటికి రాలేదు. సాంబు కూడా అన్నం, నిద్ర మాని, కాలేజీకి కూడా వెళ్లలేదు. మాణిక్యం కొడుకు బాధ అర్థం చేసుకుని చేసేది ఏమీ లేక కన్నీరు పెట్టుకుంది.

సాంబు కనిపిస్తాడేమో జరిగిన విషయం చెప్పుకుని క్షమాపణ వేడుకుందామని పూబంతి ప్రయత్నించింది. ఇంటి వరండాలో ఇటూ అటూ పదిసార్లు ఏదో పని ఉన్నట్లు పచారు చేసింది.

ఒకరోజు కాలేజీకి వెళ్ళేముందు సాంబు భోజనం చేసి దొడ్లో చెయ్యి కడుక్కుంటున్నాడు. చామంతి దొడ్లో అంట్లు పడవేస్తున్నట్లు వచ్చి సాంబును పలకరించింది.

'బావా!'

హృదయంలోని బాధతో సాంబు మాట్లాడలేదు. తర్వాత పూబంతిని తప్పించుకుపోయేడు చాలాసార్లు. పెళ్లి అయిపోయాక విచారించి ఏమీ లాభం లేదని, పూబంతి జీవితంలో ఇంకా చిచ్చు పెట్టడం భావ్యం కాదని సాంబు తీర్మానించుకున్నాడు.

సాంబు ప్రవర్తనకు, పూబంతి హృదయం పగిలినట్లయింది. లోని ఆవేదన అణచుకోలేక మతిలేని మనిషిలా దురపిల్లింది.

లేతమనస్సులు కష్టాలు, బాధలు నిలుపుకుని భరించలేవు. ఆ బాధ తీవ్రతలో యుక్తాయుక్త విచక్షణజ్ఞానం నశిస్తుంది. భరింపలేని ఆవేదన బడబానలంగా విజృంభించి ఒక్కొక్కప్పుడు వారిని భస్మం చేస్తుంది. పూబంతికూడా యీపరిస్థితుల ఒత్తిడికి బలియ్యింది.

ఏడుస్తూ కుములుతూ పడుకున్న పూబంతి ఒకరోజు సాయంత్రం అపరిమితమైన ఆయాసంతో మూల్గింది. నీరసం ఆవరించిన మనిషిలా కళ్లు తేలవేసింది.

డాక్టరు అన్నపూర్ణయ్యగారు వచ్చి పరీక్షించారు.

ఏదో మందుయిస్తే, విపరీతమైన దోకులు వచ్చాయి. డాక్టరుగారు చెప్పారు—ఆమె విషవస్తువు ఏదో మ్రింగిందని.

పరంధామయ్య, స్రవంతి కంగారుపడ్డారు. కాని తమునే అసహ్యించుకుంటున్న కూతురును ఓదార్చకలిగేశక్తి వారిలో లేకపోయింది.

అన్నపూర్ణయ్యగారిచికిత్స వ్యర్థమయింది. పూబంతి ఆఖరుసారిగా కళ్లుమూసింది.

పరంధామయ్యకుటుంబమంతా శోకంలో విలపించారు. సోమయాజులు, సీతమ్మ పూబంతి చనిపోయిందని కాక తమ కొడుకు ప్రథమ భార్యను పోగొట్టుకుని ద్వితీయ వివాహం చేసుకోవలసినవాడయ్యాడని దుఃఖించారు. 'సాంబుమీకే అభిమానముంటే మా కర్మను పెండ్లిచేసుకోమని ఎవరన్నారు! మా కొంప ముంచింది!' అని లోలోపల ఈసడించుకున్నారు.

పరంధామయ్య కూతురు చనిపోయిన బాధతో, శోక[illegible]న క్రౌంచులా సాంబుపై విరుచుకుపడ్డాడు. 'నీమూలాన వచ్చిపోయింది' అని అరుస్తూ కావసాకారాలు పెట్టాడు. సోమయాజులు, సీతమ్మ అతన్ని అనుసరించారు. విధినిర్ణయమనుకుంటూ స్రవంతి మౌనంగా ఏడ్చింది.

టెలిగ్రాం! అందిచ్చి వెళ్లిపోయాడు ఒకతను సైకిలుమీద వచ్చి!

విప్పి చూశాడు పరంధామయ్య. చేతి

★ ఉదయ కిరణాలు ★

లోని మెళ్ళిగాం జారిపోయింది. కుర్చీలో కూలబడ్డాడు శక్తులన్నీ ఉడిగి బంధింపబడిన పక్షవాతపు మనిషిలా.

ప్రవంతి మెళ్ళిగాం చూసింది. తల మొత్తుకుంది. అరిచింది. ఏడ్చింది. గుండెలు బాదుకుంది. 'చామంతి భర్త మళూచివల్ల చనిపోయాడు!!'

కష్టాలు అన్నీ ఒక్కసారే వస్తాయి. ఆ కుటుంబానికి శని పట్టుకుంది అనుకున్నారు. పరంధామయ్య అహం నశించి, పిడుగుల్లా మీదపడుతున్న ఆపదలకు తట్టుకోలేక చంటి పిల్లవాడిలా ఏడ్చాడు. ప్రకాశం చామంతిని పెండ్లిచేసుకోకపోవడంవల్ల తనకు యిన్ని యిక్కట్టులు వచ్చాయని ఒకసారి రోషంకూడా వచ్చింది. మరుక్షణమే పూబంతిని సాంబుకు యిచ్చి పెండ్లిచెయ్యనందువల్ల తన తప్పులే ఈ విధంగా తనను శిక్షిస్తున్నాయని వాపోయాడు. గత చరిత్ర పరిశీలించుకుని పశ్చాత్తాపపడ్డాడు.

ప్రకాశం పెండ్లిచేసుకోలేదని కుములుతున్న చామంతి, పెండ్లిచేసుకున్న భర్త మొహం సరిగానైనా చూడకుండానే, కాపురం చేయకుండానే, మరణించిన అతనిపై హృదయంలో ఏవిధమైన చలనం లేక రాయిలా స్తబ్ధురాలైపోయింది. భర్త అంటే అభిమానంకాని అనుభూతికాని లేనందువల్ల కళ్లనుంచి కన్నీరు కారలేదు. శోషతో ఎడారిలో తప్పిల్లే అభాగినిలా అగమ్యమైన బాధలో, మీదపడిన వైధవ్యం తెరలో, కుమిలి ఏడ్చింది.

పరంధామయ్యకు వచ్చిన కష్టాలకు బంధుజనంలో అతనిపట్ల సానుభూతి కలిగింది. అందరూ సాంబును తిట్టారు. "ఇంట్లో ఉండి, ఇంటికే చిచ్చుముట్టించావు....అమాయకురాలైన పిల్ల మనస్సు విరిచి ఆమె దుర్మరణానికి కారకుడైనావు" అంటూ నానా మాటలు అన్నారు.

అందరూ అన్న మాటలకు సాంబు బాధపడలేదు. అసలు వారి నిందలను చెవులొగ్గి వినలేదు కూడా. తనవల్లనే, తనకొరకే పూబంతి ఆత్మహత్య చేసుకుందనేవిషయం అతడికి పూర్తిగా అర్థమైంది. పెండ్లి అయినాక కఠినంగా ముఖావం వహించిన అతడి హృదయాన్ని ఆమె అర్థం చేసుకునే ఆత్మహత్యతో జవాబు ఇచ్చిందని సాంబు శోకించాడు. పూబంతిని పొందలేని తన జీవితంలో ఆనందం నశించింది అనుకున్నాడు ఆమె పెళ్ళి అయినాక. కాని ఆమె మరణంతో తన బ్రతుకే అనవసరమనిపించింది. ఆశయాలు, ఆశలు, ఆనందం యివి జీవితంలో ఉన్నా లేకపోయినా ఒక్కటే అనే విరక్తిభావన అతనిలో వేళ్లు నాటుకుంది. నిర్లక్ష్యంగా, నిశ్చింతగా, నిష్కామంగా, ఏకాంతంగా బ్రతుకు గడుపుదామని నిశ్చయించుకున్నాడు సాంబు.

తన గుమ్మానికి ఎదురుగా ఉన్న అన్నగారింట్లో పిడుగుల్లా వచ్చిపడిన కష్టాలకు మాణిక్యం చాలా విచారించింది. తన విచారం వెలిబుచ్చి ఆదరణ చూపిద్దామని ఆత్రుతపడుతున్నా పరంధామయ్య మొండికోపంతో తన్ను అసహ్యించుకుని నిరసనగా చూస్తూండడంవల్ల దూరంగానే వుంటూ దురపిల్లింది.

సాంబు ఒక తెల్లవారుఝామున ప్రక్కమీద కనిపించలేదు.

ఒకటి...రెండు...మూడు...నాల్గు... ఐదు రోజులు గడిచాయి. సాంబు జాడ లేదు. మాణిక్యం కంగారుతో నల్గురికీ చెప్పుకుంది. ఎవరూ ఆమె బాధ వినేవారు లేరు. అవధానికి, ప్రకాశానికి ఉత్తరాలు వ్రాసింది, జరిగిన సంగతులన్నీ వివరిస్తూ. ప్రకాశం వచ్చి రెండురోజులు ఉండి తల్లిని ఊరడించాడు. 'వాడే తిరిగి వస్తాడని' ధైర్యం చెప్పాడు. మౌనంతో మాట్లాడని పరంధామయ్యతో తన మానసిక వేదన వ్యక్తం చెయ్యలేక తిరిగి వెళ్ళిపోయాడు ప్రకాశం. సాంబుఎక్కడికో పోయివుంటాడని, 'జాడ తెలియచెయ్యవలసిందంటూ' పత్రికా ప్రకటనలు చేయించాడు అవధాని.

పచ్చగా సంతోషంగా ఉన్నవారికే సంఘం గౌరవమైన స్థానమిచ్చి ఆదరిస్తుంది. విచారంతో బాధలతో కృశించి మూల్గేవారిని ఒంటరిగానే ఒదిలి దూరంగా ఉంటుంది. నిత్యజీవితంలో తాపత్రయాలకు ఉపయోగించని శోకమూర్తులైన వ్యక్తుల మనుగడను అసలు గుర్తించదు. ఆ యింట్లో ఆ రెండు కుటుంబాలు సంఘంచే పరిత్యజింపబడి ఏకాంతంగా శోకంతో కుమిలి బాధపడసాగాయి. [ఇంకా వుంది.]

గలనని సోమయాజులు వాగ్దానం చెయ్య గానే బసవయ్య లొంగిపోయాడు.

'సంబంధాలున్నాయి కానండీ! అయి దారు వేలు కట్నాలుకు తగ్గలేదు! బి. ఏ. చదువుతే సరి కట్నాలు వేలు వేలుమీదుగా వేలం వేస్తున్నారు!' బసవయ్య పరంధా మయ్యముందు సాగదీశాడు.

"పై సంబంధం చేస్తే అనేక సాధక బాధ కాలు!! డబ్బూ ఖర్చు! పిల్లకు సుఖమూ ఉండదు! వాళ్లతో ఎన్నో పట్టింపులు!!' మూలిగాడు బసవయ్య.

పరంధామయ్యకు పెద్దకూతురు పెళ్ళికి పడిన శ్రమ జ్ఞప్తికి వచ్చింది. ఆరు వేల కట్నం యిచ్చి, మరో అయిదు వేలు పెళ్లికి ఖర్చు పెట్టాడు. పైగా యిప్పటివరకు చామంతి కాపురానికి వెళ్లలేదు. ఎందుకో కాని రఘురామయ్యగారు బాగా కలిసికట్టు మనిషిలా లేడు. సీతాపతి కూడా ఒకటి రెండు పండుగలకు వచ్చాడు కాని తర్వాత పిల్చినా వీలులేదంటూ రాలేదు. చామంతి భవిష్యత్తు ఎలా ఉంటుందా అనే విచారం పరంధామయ్యకు అప్పుడప్పుడు కలుగుతూనే ఉంది.

'ఈ గొడవలన్నీ భరించే బదులు, టూకీగా పెళ్ళి అవుతుంది! బంధువులూ సంతోషిస్తారు! ఉన్న యిద్దరు మేనల్లుళ్లలో ఒకరికి పిల్లనిచ్చేయండి!' బసవయ్య తను యివ్వగల్గిన సలహా యిదొక్కటే అన్నట్లు తేల్చాడు.

పరంధామయ్యకుకూడా ఆయనమాటల్లో సత్యం కనిపించింది.

'అంతేనంటారా బసవయ్యగారూ!'

'సాంబుకు యిచ్చి......'

'నే చచ్చినా యివ్వదల్చుకోలేదు... పెద్దవాడు నా పిల్లను నిరాకరించినప్పుడు, రెండోవాడికి ఏ ముఖం పెట్టుకుని , పిల్ల నిస్తానంటాను! అది నాకే అప్రతిష్ఠ!'

'అయితే రామలింగశర్మకు యివ్వండి మీ అమ్మాయిని. సోమయాజులు, సీతమ్మ, ఉదారమైన దంపతులు! మీకు తెలియం దేముంది! పిల్ల సుఖపడుతుంది.'

బసవయ్య మాటలు పరంధామయ్యకు నచ్చాయి.

'శర్మ ప్రవర్తన ఏం బాగుండలేదోయి! బాగా పెంకివాడు.'

'అం. ఆ మూడుముళ్ళూ పడనివ్వండీ! ఎంత పెంకి మగాడైనా పెళ్ళాంచేతులో కీలుబొమ్మ అయిపోడండీ!'

పరంధామయ్య ఫక్కున నవ్వాడు. బస వయ్య ఆనందంగా ఆయన నవ్వులో శ్రుతి కల్పాడు.

'అయితే పోనీ శర్మకుయిచ్చి పెండ్లి చేద్దాం.'

'తథాస్తు. ముహూర్తం నిర్ణయిద్దాం ఇంక.'

బసవయ్య తన సంభాషణా నైపుణ్యా నికి లోలోపల సంతోషించుకున్నాడు.

పరంధామయ్య పూబంతిని కోడుక్కు యిస్తాడన్న సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అయి, కట్నం ఎంతైనా ఫర్వాలేదన్నారు సోమయాజులు దంపతులు. వెయ్యిన్నూట పదహార్లుతో తేలిపోయింది కట్నం.

'నే నీ పెళ్ళి చేసుకోనమ్మా!' చిందులు త్రొక్కుతూ అరిచింది పూబంతి.

'అన్నీ స్థిరపడ్డాక యిప్పుడు యీ గల్లంతు ఏమిటే?' తల్లి కోప్పడింది.

'నేను సాంబు బావనుతప్ప ఎవ్వరినీ చేసుకోను. నువ్వు నాన్నతో చెప్పవే అమ్మా!' పూబంతి ప్రాధేయపడింది.

'వాడో ముండల ముఠాకోరే! వాణ్ణి పట్టుకు ప్రాకులాడుతా వేమిటి?'

'నువ్వుకూడా అలాగే అంటున్నావా అమ్మా!' పూబంతి వెక్కి వెక్కి ఏడ్చింది.

స్రవంతికి కూతురుపై జాలికలిగింది.

'అయినా మీ నాన్నతో చెబుతా! ఊరుకోవే' అంటూ ఓదార్చింది.

'ఏమండీ! పూబంతికి యిష్టంలేదు యీ పెళ్ళి!' భయపడుతూనే స్రవంతి చెప్పింది.

'ఒకళ్ల యిష్టా యిష్టాలతో నాకు పని లేదు. ఈ పెళ్ళి అయితీరాలి!' మేఘంలా గర్జించాడు పరంధామయ్య. స్రవంతి హడలి పోయింది.

పూబంతికూడా తర్వాత మౌనంగానే ఉంది. అదిచూసి కూతురు మనస్సు కుదుట పరుచుకుందని స్రవంతి నమ్మింది.

అది శనివారం రాత్రి. తెల్లవారితే లగ్నం. పరంధామయ్య చాలా హడావిడిగా ఉన్నాడు. వచ్చే బంధువులకు సౌకర్యాలు చెయ్యడం - పందిళ్లు వేయించడం బంట్రో తులకు పనులు చెప్పడం...వంట బ్రాహ్మ లకు చెయ్యవలసిన పిండివంటలు చెబుతూ అజమాయిషీ చెయ్యడం మొదలైన పను లతో ఊపిరాడక గిజగిజ కొట్టుకుం టున్నాడు. ఇంట్లో నే పెళ్ళి హడావడి అంతా జరుగుతున్నా యిప్పటివరకు మాణిక్యానికి పెళ్ళిఆహ్వానం లేదు. అయినా ఆమె మనస్పర్థలు పాటించ కుండా వచ్చిన బంధువులతో కలిసికట్టుగా మాట్లాడుతూ తనకు తోచిన సహాయం చేస్తూనేఉంది.

రాత్రి రెండు గంటలదాకా పెళ్ళి పను లలో తీరిక లేక ఒళ్లు హూనమయింది పరం ధామయ్యకు. ఆ బడలిక తీర్చుకోవాలని ఒక కునుకు తీద్దామని దొడ్లోఉన్న వరండా లోని కుర్చీలో మేను వాల్చాడు. చిందర వందరగా ఉంచబడిన మంచాలు, పరుపులు ఆ కుర్చీకి అడ్డుగా ఉన్నందువల్ల పరంధా మయ్య కుర్చీలో పడుకున్నట్లు ప్రత్యేకం పరిశీలిస్తే కాని కన్పించదు.

వచ్చిన బంధువులు అందరూ పన్నెండు గంటలకే నిద్రపోయారు. స్రవంతి-సీతమ్మ- అప్పుడప్పుడు కలుసుకుని ఏవో పెళ్ళి హంగుల్ని గురించి నిర్ణయాలు చేసుకుంటు న్నారు. ఇంట్లో అలికిడి తగ్గి అంతా ప్రశాంతంగా ఉంది.

★ ఉదయకిరణాలు ★

పెళ్ళిపనులు చేసినవి చెయ్యనివి మెదడులో కదులుతూ పరంధామయ్యకు నిద్ర రాలేదు. దొడ్డి తలుపు కిర్రుమని చప్పుడయింది. పరంధామయ్య లేచి చూస్తున్నాడు. పూబంతి తలుపు తీసి కంగారుగా చెర్లు వేసి బయటికి నడిచింది. పరంధామయ్యకు ఆశ్చర్యం కలిగింది, ఈ అర్ధరాత్రి పెండ్లికూతురు బయటికి నడిచే అవసరమేముందని.

ఇటూ అటూ చూసుకుంటూ తలమీద చీరకొంగు కప్పుకుని గబగబా వీధిలో నడుస్తోంది పూబంతి. పరంధామయ్య దృష్టిలో ప్లీడరు శివరాం కూతురు కథ మెదిలింది. వెనకాల పరుగెత్తుకువెళ్లి ఆమె చెయ్యి పట్టుకున్నాడు.

పూబంతి తెల్లబోయి కంగారు అణుచుకుంది.

'ఎక్కడికి వెడుతున్నావు!'

'............'

'ఇంటికిపద!' పళ్లు బిగించాడు పరంధామయ్య.

ఇంట్లోకి కూతుర్ని తీసుకువచ్చి, గదిలో కూలేసి భార్యను పిలిచాడు పరంధామయ్య.

సంగతివిని ప్రశాంతి గుండెదడదడలాడింది.

'ఇప్పుడు యిల్లా రభసచేసి కుటుంబానికి అప్రతిష్ఠ తెస్తావుటే!' ప్రశాంతి కన్నీరు పెట్టుకుంది.

'ఎక్కడికి బయలుదేరావు' తల్లి నిజం తెల్సుకోవాలనుకుంది.

'ఆమాత్రం అర్థంకాదూ! ఆ కుండల ముఖాకోరుతో లేచిపోదామనుకుంది కాబోలు!!'

ప్రశాంతికి అర్థమయింది.

'నాకీ పెళ్లి ఒద్దమ్మా!' పూబంతి ముఖం చేతుల్లో పెట్టుకుని వెక్కి వెక్కి ఏడుస్తూ మంచంమీద వాలిపోయింది.

'ఈ పెళ్ళి ఎలా కాదో చూస్తా!' అరిచాడు పరంధామయ్య.

'నేను ఏమైనాసరే పెళ్లి చేసుకోను!' కోపంతో కేక పెట్టింది పూబంతి.

'ఏమైనాసరే పెళ్ళి జరిగితీరుతుంది!'

'బలవంతాన పెండ్లిచేస్తే చస్తాను' పూబంతి తలగడలో ముఖందూర్చి ఏడ్చింది.

'చస్తే చావు! కాని పెళ్ళిమాత్రం జరిగి తీరాలి!' పరంధామయ్య కోపంలో ఒళ్ళు మరిచి, శుభలగ్న సమయంలో నోటికి వచ్చినట్లు ప్రేలేడు.

పూబంతి తండ్రిమాటలకు కొయ్యబారిపోయింది. తండ్రి అంత కర్కోటకుడౌతాడనుకోలేదు. అతని హృదయంలో ఏమూలైనా జాలి ఉంటుందేమో అనుకుంది. అయినా సాంబుతో లేచిపోదామని పన్నాగం వేసింది. అందుకే అనవసరంగా ఏ గొడవా చెయ్యలేదు. ఆ రాత్రికి సాంబు లేచిపోయే పన్నాగాలు చెయ్యగలిగాడు. తండ్రి పట్టుకోవడంతో అవన్నీ భగ్నమైపోయాయి.

'సరే! ఛస్తాను!' పూబంతి వెక్కి వెక్కి ఏడ్చింది.

ఇప్పుడు రభసచేస్తే కుటుంబానికి అప్రతిష్ఠ తప్ప మరేమీ లేదు. తన క్షేమం కన్న తల్లితండ్రులకే అక్కరలేనప్పుడు తన జన్మ వ్యర్థమని భావించింది పూబంతి.

ఏదో విధంగా పారిపోదామన్నా మరో అవకాశం కనిపించలేదు ఆమెకు. సాంబు తనకోసం నిరీక్షిస్తూ ఉంటాడని కుమిలి కుమిలి ఏడ్చింది.

కోడికూతతో తెల్లవారు సమయం గుర్తుకు వచ్చింది అందరికీ. పూబంతిని అభ్యంగన స్నానాలకు అడుగులు ఈడారుస్తూ బలవంతాన తీసుకుపోయారు.

సాంబు కాలేజీ చెరువుదగ్గర టాక్సీలో పూబంతికై నిరీక్షిస్తూ కూర్చున్నాడు రాత్రి రెండుగంటలవుతుంది. కర్మతో పూబంతి పెండ్లి నిశ్చయమైనప్పటినుంచి ఆమెతో లేచిపోడానికి సన్నాహాలు చేస్తున్నాడు. అవధాని పంపే డబ్బు కొంత మాణిక్యం పెట్టెలో ఉంది. తనకు డబ్బు కావాలన్నట్లు తల్లికి తెలియనివ్వదల్చుకోలేదు సాంబు.

తన కాలేజీ స్నేహితుడు రంగపాండును అప్పు యిమ్మని అడిగాడు సాంబు. సంగతి తెలుసుకున్నాడు రంగపాండు. ఇటువంటి విషయాలలో అనుభవమున్న రంగపాండుకు సాంబుపై జాలికలిగింది. 'మీరు పెళ్ళి చేసుకోడానికి అన్ని ఏర్పాట్లు నే చేస్తా' అని హామీ యిచ్చాడు.

ఆరాత్రి టాక్సీ కుదిర్చాడు. తన స్వంత ఊరు పిఠాపురంలో ఆ ముహూర్తానికే గుళ్లో మీ రిద్దరికీ పెళ్ళిచెయ్యడానికి సన్నాహాలన్నీ చేశాడు.

రెండుగంటలకు సరిగా రావలసిన పూబంతి తెల్లవారుతున్నా వచ్చేజాడ లేనందున సాంబు గుండె దడదడలాడింది. కంగారుతో చెమటలు పోశాయి. ఒంటిలో శక్తిపోయి నీరసం ఆవహించింది. దిగులుతో బిక్కుబిక్కుమంటూ కూర్చున్నాడు.

పూబంతి రాలేదు.

ఇంకొక పావుగంటలో లగ్నం.

సాంబు ఉద్రేకంతో ఒణికిపోయాడు.

గబగబ యింటికి పరుగెత్తాడు.

పెళ్లిబాజాలు, సన్నాయి మ్రోగుతున్నాయి. జనం పెళ్ళిపందిరిలో హడావిడిగా తిరుగుతున్నారు.

పెళ్ళి మంటపంలో కర్మ పూబంతికి తాళి కడుతున్నాడు.

సాంబుతల తిరిగిపోయింది.

మాణిక్యం దూరంనుంచి కొడుకును చూసి పిలవబోయింది.

దుఃఖం ఆపుకోలేక ఏడుస్తూ సాంబు తన గదిలోకి పోయి మంచంమీద ఒరిగాడు. పూబంతి ఎందుకు రాలేదా అని పరిపరి విధాల ఆలోచించాడు. కుటుంబానికి అప్రతిష్ఠ తేవడం యిష్టంలేక రాలేదనుకున్నాడు. ఒళ్లంతా రైలుచక్రాలక్రింద పడి నుగ్గయినట్లు బాధతో కుమిలిపోయాడు.

పెళ్ళికి అవధాని సెలవు లేక రాలేదు. ప్రకాశానికి ఆహ్వానమే వెళ్ళలేదు. ఆహ్వానం పంపించినా చామంతి భర్త తాలూకువారు ఎవ్వరూ రాలేదు.

పరంధామయ్యకు లోపల బెంగపట్టుకుంది. ఇంట్లో శుభకార్యానికికూడా రాని వియ్యంకుడిగురించి ఏమనుకోవాలో అర్థంకాలేదు. అయినా యీవిషయం పూబంతి పెండ్లి అయ్యాక తేల్చుకుందామని నిశ్చయించుకున్నాడు.

పెళ్ళి అయిపోయింది. బంధువులు ఎవరి యిళ్లకు వాళ్లు వెళ్ళిపోయారు.

"రాకుమారీ స్వయంవరం"

వనశ్రీ

"మిస్టర్ విశ్వనాథం బి. ఎ.," తలుపు నెట్టుకొని లోపలకు వచ్చి పోస్టుమన్ ఉత్తరం ఇచ్చాడు.

పొడుగాటి గోధుమవన్నె కవరుచూడగానే విశ్వనాథానికి పంచప్రాణాలు లేచి వచ్చాయి.

ఆత్రంగా కవరు పైన డిస్పాచెస్ చూశాడు.

అదె! సంవత్సరం మూడుమాసాలుగా కళ్ళల్లో వత్తులు పెట్టుకొని దేనికోసం ఎదురు చూశాడో అదే!

విశ్వనాథం నక్షత్రాలు కనికరించాయి! ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ నుంచి ఉత్తరం వచ్చింది!

కవరు విప్పతూంటే విశ్వనాథం చేతులు వణికాయి. ఆశలు తేనెటీగల్లా ఝుంయ్యిన ముసురుకొన్నాయి.

'రేపు పదకొండు గంటలకు ఎక్స్చేంజ్ ఆఫీసులో హాజరుకావాల'ని వున్నది.

కవరుమడిచి భద్రంగా జేబులో పెట్టుకొని పక్కకు చూశాడు.

అమ్మ, చెల్లెలూ, తమ్ముడూ చుట్టూ చేరి నోరుతెరచుకొని విశ్వనాథం ముఖంలోకి చూస్తో నుంచున్నారు.

"ఎక్కడన్నా వుద్యోగం అయిందా?" అన్నది తల్లి అతుకులేసిన పాత చీరతో ముఖానపట్టిన చెమట తుడుచుకొంటూ.

"ఆఁ. రేపు ఇంటర్ వ్యూకి వెళ్లాలి! తర్వాత తెలుస్తుంది!" అన్నాడు.

ఆరాత్రి ఇంట్లో ఎవరికీ సరిగా నిద్రపట్టలేదు. విశ్వనాథం తల్లి, కొడుక్కు ఉద్యోగమయితే తిరుపతి శ్రీవారికి మొక్కు చెల్లించుకొంటానని రాగిడబ్బు మూట కట్టింది.

విశ్వనాథం ఆరాత్రి తన స్వప్నాలన్నీ నిజాలయినట్టు కలకన్నాడు! తనకు దొరకగల వుద్యోగాన్ని గురించిన ఆలోచనలతో మెదడు వుడికిపోయింది.

నిద్రలేచేసరికి ఏడుగంటలు దాటింది. స్నానంచేసి వున్న గుడ్డల్లో మంచివి ఏరి వొక చొక్కా ప్యాంటూ పెట్టెలోంచి బయటికి తీశాడు. మరి ఇన్‌టర్వ్యూకు పోతున్నాడాయె!

తీరా చొక్కా మడతలు విప్పివేసుకో పోయేసరికి గూడుమీద దమ్మిడీ వెడల్పున కొరుపట్టివుంది! చాకలాడ్ని నాలుగు తిట్టుకొని తమ్ముడ్ని పిలిచి చొక్కా మిషిన్ వాడి దగ్గరికి పంపించాడు.

మంచి శకునం చూసి తల్లి విశ్వనాథాన్ని—వుద్యోగాన్వేషణలో - స్వయంవరానికి పోతూన్న విశ్వనాథాన్ని సాగనంపింది.

విశ్వనాథం యంప్లాయిమెంట్ ఆఫీసు చేరుకొనే సరికి నలుగురు కేండిడేట్సు అప్పటికే వచ్చి కాచుకొని వున్నారు.

ఆ నలుగురూ, వస్తోన్న విశ్వనాథాన్ని అదోలా చూశారు. వాళ్ళ చూపులు విశ్వనాథం భరించలేకపోయాడు. తల వంచుకొని ఖాళీగా వున్న బల్లమీద కూర్చున్నాడు.

కొంచంసేపటికి ఒక గుమస్తా వచ్చి ఫైల్లోనుంచి ఒక పేపరు తీసి గడగడా ఐదు పేర్లు చదివాడు. ఐదుగురూ వరుసగా లేచి నుంచున్నారు.

గుమాస్తా వాళ్లందరనూ వోసారి ఎగాదిగా చూసి—

"అడవీ-పరిశ్రమల శాఖాఫీసులో వొక యల్. డి. సీ. పోస్టు ఖాళీ వచ్చింది! మధ్యాహ్నం ఒంటిగంటన్నరకు ఫారెస్టు ఆఫీసరుగారు ఇన్‌టర్వ్యూ చేస్తారు! మీలో సెలక్టు అయిన వొకర్ని తీసుకొంటారు. వెళ్లండి! ఇదిగో యీ పేపరు తీసుకొని ఆఫీసులో యిస్తే మిమ్మల్ని యిన్‌టర్వ్యూ చేస్తారు!" అని చెప్పి ఫైల్లోంచి తీసి వొక పేపరు ఇచ్చాడు.

విశ్వనాథం ఆ పేపరు అందుకొందామని అనుకొంటుండగానే ఇంకొకడు ముందుకు వచ్చి అందుకొన్నాడు.

విశ్వనాథం వాడ్ని పరీక్షగా చూశాడు. జుట్టుముడీ, చాలీచాలని చొక్కా, అడ్డకట్టూ కాళ్ళకు చెప్పులుకూడా లేవు. వాడికి ఎంతధైర్యం! వాడ్నిచూస్తే విశ్వనాథానికి ఏవగింపుగా వుంది! జుట్టుముడి కాండిడేట్ పేపరు మడిచి జేబులో పెట్టుకొని అందరికంటే ముందు నడిచాడు. మిగతా నలుగురూ అతనివెనకే నడవటం మొదలు పెట్టారు.

త్రోవలో జుట్టుముడివ్యక్తి వాలకం చూస్తూన్న కొద్దీ విశ్వనాథానికి నవ్వుముందుకు వస్తోంది. వీడికి ఎంతధైర్యం! వీడే ఛాన్సు కొట్టేస్తాడేమో?

"మిస్టర్ తిరుమలై! వాటీజ్ యువర్ క్వాలిఫికేషన్?" అడుగులో అడుగకలిపి విశ్వనాథం జుట్టుముడి అభ్యర్థిని అడిగాడు.

"పాస్‌డ్ మెట్రిక్యులేట్!" ధీమాగా జవాబు చెప్పాడు మిస్టర్ తిరుమలై.

"నేను బి. ఎ.!" ఎవరూ అడగకండే చెప్పాడు విశ్వనాథం. కడుపులోని మంటా కసీ కొంత తీరినట్టయింది. ఈదెబ్బకు వాడి పిలకముడి పునాదులు కదిలిపోయివుంటయ్ లే అనుకున్నాడు విశ్వనాథం. వాడిక తగ్గిపోతాడు!

"వై? ఐ యాం ఎ బి. యస్. సి., విత్ ఫిజిక్స్ మెయిన్!" అన్నాడు మిస్టర్ ఆనందరావు 'టూటాల్ టై' వదులు చేసుకొంటూ.

విశ్వనాథం దిమ్మరపోయి ఆనందరావుకేసి చూశాడు.

లినెన్ సూటు ఎండలో తళతళలాడుతోంది. కొత్త ఫ్లెక్సుబూటు నాడాలు సిమెంట్ రోడ్డుమీద లయయుక్తంగా మోగిస్తో ఆనందరావు ఠీవిగా నడుస్తున్నాడు.

విశ్వనాథం, తన డోక్కుపోయిన జెన్నికోరా ప్యాంటూ, యం. యస్. రెడ్ చొక్కా, సూటుమీద మినీ పాయిబు పనితనమూ, అరిగిపోయిన బాటా చెప్పులూ చూసుకొని కుంగిపోయాడు. పెరగబోయిన



ఒడ్డుపట్టిన పడవలు —ఫోటో: పి. సి. ఎమ్. ఈశ్వరబాబు.

"రాకుమారీ స్వయంవరం"

వ్యక్తిత్వం అణిగిపోయింది! ఛీ! తన ముఖాన్ని మాసి, తన గుడ్డలు చూసి ఆఫీసరు వుద్యోగం ఇస్తాడా?

"యల్. డి. సీ. పోస్టుకు మెట్రిక్యులేషన్ చాలు!" అన్నాడు తిరుమలై.

అంతా తిరుమలైవంక చూశారు.

"ఇంతకీ అక్కడ ఇన్‌టర్వ్యూలో సెలెక్ట్ కావాలి!" చిక్కు సమస్య ముడి విప్పినట్టుగా అన్నాడు తిరుమలై.

విశ్వనాథం హృదయంలో మళ్లీ ఆశలు చిగురించినై.

"నీకేం తెలివితేటలు గలవాడివి! ఇన్‌టర్‌లో క్లాసు వచ్చింది! కాలేజీ ఉపన్యాసపు పోటిలో సెకండ్! నీకేం!" అని విశ్వనాథానికి తన లోపలనుంచి వినపడుతూన్నాయి.

"అవునవును!" అనుకొన్నాడు విశ్వనాథం.

అందరూ ఫారెస్టు ఆఫీసు చేరుకొనేసరికి మధ్యాహ్నం ఒంటిగంట ఐంది.

ఆఫీసరుగారి ప్యూను వచ్చి అందర్నీ పరకాయించి చూసి—"అయ్యగారు పనిలో వున్నారు! ఇప్పుడు చూట్టానికి వీల్లేదు!" అన్నాడు. వాడికి అదో అలవాటు. ఎవ

ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక

పిల్లల దసరా సంచిక

చిత్రాలు, రచనలకు బహుమతులు

గడువుతేదీ 1955 సెప్టెంబరు 20

రాబోయే విజయదశమి పండుగకు (26-10-55) ఆంధ్రవారపత్రిక పిల్లల దసరా సంచికగా ప్రచురించబడుతుంది. మామూలు ప్రకారం ఈ సంచికలో బాలబాలికల రచనలకు చిత్రాలకు ప్రాధాన్య మివ్వబడుతుంది. 15 సంవత్సరాలలోపు పిల్లల రచనలు, చిత్రాలలో ఉత్తమమైనవానికి బహుమతు లివ్వబడతాయి.

బాలబాలికల రచనలు చిత్రాలుకాక ఈ సంచికలో ప్రత్యేక చిత్రాలు, ఫోటోలు, వ్యాసాలు, కథలు కూడా ప్రచురించబడతాయి. ఆకర్షణీయమైన ప్రత్యేక త్రివర్ణ ముఖచిత్రంతో సంచికను సర్వాంగసుందరంగా ప్రచురించడానికి కృషి చేస్తున్నాము.

బాల బాలికలకోసం ఉద్దేశించబడిన ఈసంచిక ప్రచురణలో బాల బాలికలు పెద్దలుకూడా మాకు తోడ్పడగలరని ఆశిస్తున్నాము.

చిత్రాలు, రచనలు పంపేవారు ఈ క్రింది అంశాలను గమనించ కోరుతున్నాము.

* చిత్రాలు, రచనలు, ఫోటోలు మా కార్యాలయానికి సెప్టెంబరు 20 వ తేదీలోగా చేరాలి.
* వీనిని ఎడిటర్, ఆంధ్రపత్రిక సచిత్రవారపత్రిక, మద్రాసు 1. ఎడ్రస్‌కి పంపాలి. కవరుపైనా లేక రేపర్ పైనా, లోపల మొదటి కాగితంపైనా, లేక చిత్రం వెనుకా "ఆంధ్ర-వారపత్రిక దసరా సంచికకు" అని వ్రాయాలి.
* ప్రచురణకు స్వీకరించబడని రచనలు, చిత్రాలు, ఫోటోలను తిరిగి తమకు పంపగోరేవారు వానితో పాటే అవసరమైన స్టాంపు చేర్చి పంపాలి.
* రచనలు అచ్చులో మూడు పేజీలకు మించకూడదు. కాగితంపైన ఒకే ప్రక్క సిరాలోనే వ్రాయాలి. చిత్రాలను డ్రాయింగ్ పేపరుపైన ఇండియన్ ఇంక్‌లోనే వ్రాసిపంపాలి బొమ్మలు రంగులలో కాని, రంగు కాగితంపైన కాని పెన్సిల్, సిరాలతో వ్రాసినవి కాని స్వీకరించబడవు.
* 15 సంవత్సరాల లోపు బాలబాలికలు మాత్రమే పోటీలో పాల్గొనవచ్చును.
* రచనలు, చిత్రాలు స్వతంత్రమైనవై ఉండాలి.
* పోటీలో పాల్గొనడానికి రుసుము లేదు.
* రచయితలు, చిత్రకారులు తమ పూర్తి పేరు (ఇంటిపేరుతో సహా), వయస్సు, చిరునామా అన్నీ వివరంగా రచనలూ చిత్రాలతోపాటే వ్రాసిపంపాలి.
* రచనలు చిత్రాలనుగురించి ఉత్తరప్రత్యుత్తరాలు జరపవద్దని రచయితలను చిత్రకారులను కోరుతున్నాము.

—సంపాదకుడు.

రొచ్చినా ముందు చూట్టానికి యిప్పుడు వీల్లేదంటాడు. మరి వాడు పెద్ద అయ్యగారి జవాను. ముందు వాడితో పరిచయం చేసుకోందే యీగ కూడా లోపలకు వెళ్లడానికి వీల్లేదు. అయ్యగారు అర్జంటు పనిలో వుంది లేందీ వాడి ఇష్టాయిష్టాలతో వుంటుంది.

"అదికాదు! మమ్మల్నీ ఒకటిన్నరకు ఇన్‌టర్వ్యూకు రమ్మన్నారు! యీ కాగితం తీసుకెళ్ళివ్వు!" అంటూ మిస్టర్ తిరుమలై పేపరు తీసి ఇచ్చాడు.

మళ్ళీ విశ్వనాథానికి కాలికింద ఒక మెట్టు జారినట్టయింది! జవానుతో తను మాట్లాడదామని అనుకుంటుండగానే జట్టు ముడిచాడు మాట్లాడేశాడు. అన్నిటికీ వీడే ముందు!

"ఓహో! అట్లాగా? ఐతే అక్కడ కూర్చోండి!" అని దూరంగావున్న బెంచీ చూపించి జవాను ఆఫీసరుగారి గదిలోకి వెళ్ళి క్షణంలో తిరిగొచ్చి ఆఫీసు లోపలికెళ్లి ఎస్టాబ్లిష్‌మెంటు సెక్షన్‌లో ఆ పేపరు ఇచ్చి బయటికి వచ్చాడు.

స్వయంవరానికి వచ్చిన రాజకుమారుల్లా ఐదుగురు అభ్యర్థులూ బల్లమీద మౌనంగా కూర్చున్నారు. తమ భవిష్యత్తు గురించిన ఆలోచనలు కళ్లెం తెగిన గుర్రాల్లా వాళ్ళ బుర్రల్లో స్వారీ చేస్తోన్నాయి.

ముహూర్తం దగ్గరపడుతోంది! రాజకుమారి - ఉద్యోగలక్ష్మి - ఎవరిని వరిస్తుందో? విశ్వనాథం గుండెల్లో ఏదో దడ

★ 'రాకుమారీ స్వయంవరం' ★

దడగా వుంది! అబ్బే ఏమిటి? తను భయపడుతున్నాడా? అలా భయపడిపోతే లోపల ఆఫీసరు అడిగిన ప్రశ్నలకు తనేం బదులుచెప్పగలడు? ఎందుకూ భయం? ఆఫీసరు అడిగినదానికి గడగడా బదులు చెప్పగలడు! తెలివిగా ధైర్యంగా, ఉత్సాహంగా కనపడాలి. మనసంతా ప్రశాంతంగా వుంచుకోవాలి! లేకపోతే గొడవ. కన్ఫ్యూజ్ అయిపోతుంది! అబ్బ మళ్లీ ఏమిటి యీ వెధవ ఆలోచనలూ? తనెందుకు సెలక్టు కాడు?

—విశ్వనాధానికి ముఖమంతా చెమటలు పోసింది. ముఖంమీద చెయ్యి పెట్టుకొని చూసుకొన్నాడు. అబ్బా ఒకటే జిడ్డూ! గుండెల్లో దడా మెదడులో గుర్రాలడెక్కల చప్పుళ్లూ.

విశ్వనాధం కర్చీఫ్‌తీసి ముఖం తుడుచుకొన్నాడు. గొంతు ఎండిపోతూంది. నాలుకతో పెదవులు తడుపుకొన్నాడు. జవాన్ని మంచినీళ్ళడిగితే? ఎంత పిలిచినా వాడు ఇటు రాందే? కిందకు పోయి ఏదన్నా హోటల్లో తాగొస్తే? అంతలోకే ఆఫీసరుగారు పిలిస్తే?

విశ్వనాధం మళ్లీ ఇంకోసారి ముఖం తుడుచుకొన్నాడు. గోడగడియారం చూశాడు.

ఒంటిగంటా ముప్ఫైనిముషాలు!

ఆఫీసరుగదిలోంచి జవాను బయటికి వచ్చాడు. పిలవడానికే వస్తున్నాడా? ముందెవర్ని పిలుస్తాడో?

అరే! జవాను అటు పోతున్నాడేం ఆఫీసులోకి—

సాయంకాలం ఐదు గంటలకే రిజల్టు చెప్పేస్తారు. అమ్మతో తనకు వుద్యోగం వచ్చిందని చెప్తే ఎంత ఆనందిస్తుంది! ఒకవేళ సెలక్టు కాకపోతే?

విశ్వనాధం గుండెల్లో రోడ్డు ఇంజన్ ధ్వని బుర్రలో విమానాల రొద!

గడియారం రెండు కొట్టింది!

ఇంకా పిలవరేం?

"డామిట్! ఉక్క పోస్తోంది? ఇంతవరకూ వొక్కణ్ని ఇన్టర్వ్యూ చెయ్యలేదు! ఎంతసేపని కూర్చోవడం? ఏయ్! ప్యూన్ ఇలా రావోయ్? నువ్వే ఆఫీసరులా వున్నావేమిటి?" అంటూ మిస్టర్ ఆనందరావు లేచి నుంచుని కోటుగుండీలు విప్పుకొన్నాడు.

"ఏమిటి సార్?" అంటూ జవాను దగ్గర కొచ్చాడు.

"ఏమిటోయ్? ఇన్టర్వ్యూ ఒకటిన్నరకే అన్నారు! ఇంతవరకూ అమీ తుమీ లేదు!" దబాయింపుగా అన్నాడు ఆనందరావు.

"అయ్యగారు టిఫిన్ చేస్తున్నార్ సార్!"

"ఎంత తింటున్నాడేమిటోయ్? ఇంతసేపు?" అన్నాడు ఆనందరావు పళ్లు బయట పెట్టి.

కిసుక్కున నవ్వుకుంటూ, కాలింగ్ బెల్ వినపడటంతోటే లోపలకి పరిగెత్తాడు జవాను—

ఆనందరావు ధైర్యానికి విశ్వనాధం ఆశ్చర్యపడ్డాడు. లోలోపల అతన్ని మెచ్చుకొన్నాడు.

ఒకరకంగా విశ్వనాధం ఆనందపడ్డాడనే చెప్పాలి. వచ్చినవాళ్లల్లో తనతోపాటు డిగ్రీ వుంది అతనికీ. వీడు లోపలికి పోయి ఆఫీసరుగారు అడిగిన ప్రశ్నకు యిలాగే అదిరిపాటుగా సమాధానం చెప్తే, చస్తే సెలక్టు కాడు! ఆ జవాను వీడి సంగతి ఆఫీసరుకు చెప్తే రోగం బాగా కుదురుతుంది లే?

ఇంతకీ వొకడు తగ్గినా తగ్గినట్టే! పోతే ముగ్గురుంటారు. వాడు ఆ పొట్టివాడు భూషణం! మాసిన గడ్డాం! వాడు అసలు లెక్కలోనివాడు కాడు. పోతే యీ జుట్టు ముడివాడొకడున్నాడు? వీడి ఆకారం ఏడూను. ఆఫీసరు ఎలా లైక్ చేస్తాడూ?

ఇకపోతే ఐదోవాడు వుండాలి? అన్నట్టు వాడి పేరేమిటి? అయోమయమా? ఆఁ. అరవిందం! ఇంతకీ వాడేడీ?—విశ్వనాధం బెంచీమీదనుంచి వంగి పక్కకు చూశాడు.

—అరవిందం దూరంగా వున్న బల్లమీద గోడకానుకొని నిద్రపోతున్నాడు! అది చూసేటప్పటికి విశ్వనాధానికి నవ్వొచ్చింది!

ఇహ ఈ నిద్రమొహంవాడు ఏం సెలక్టు అవుతాడు? పోతే తనకే మంచి అవకాశం వుంది!

విశ్వనాధం కష్టపడి తన వుూహాసౌధానికి వొక్కొక్క ఇటుకే పేర్చుకొంటున్నాడు.

ఉండీ ఉండీ విశ్వనాధం హృదయంలో దబ్బనంపోటులా గుచ్చుకొంది! అందరూ తనలాగా వుద్యోగంకోసం కొండంత ఆశ పెట్టుకునివచ్చినవాళ్లేగా? వాళ్ళూ తనను గురించి ఇలాగా అనుకొంటున్నారా? ఇక్కడ జరుగుతున్నదేమీ పట్టనట్టు నిశ్చింతగా నిద్రపోతోన్న అరవిందంమీద జాలి పుట్టుకొచ్చింది విశ్వనాధానికి.

విశ్వనాధం లేచివెళ్ళి నిద్రపోతూన్న అరవిందాన్ని భుజంతట్టి లేపాడు. అరవిందం తత్తరపోయి లేచి నుంచొని కళ్ళు నులుపుకొంటూ "నన్ను పిలిచారా?" అంటూ ఆఫీసరు గదివేపుకు పోతున్నాడు.

విశ్వనాధానికి నవ్వు వచ్చింది. అతణ్ని వారించి "ఇంకా లేదులే! పిలుస్తారేమోనని లేపాను!" అన్నాడు.

"అంతేనా? టైం ఎంతయింది?" ఆవలిస్తో అడిగాడు అరవిందం.

విశ్వనాధం గడియారం చూసి—

"మూడుగంటలైంది!" అన్నాడు.

"మంచినీళ్లవుతూన్నయ్! బయటికి పోయి సోడా తాగివద్దాం వస్తారా?" అన్నాడు అరవిందం.

మంచినీళ్లనగానే విశ్వనాధానికి ఏదో మర్చిపోయినట్టు గుర్తుకు వచ్చింది.

"నాకూ చాలా సేపట్నుంచీ గొంతెండిపోతూంది! కాని మనం అటు వెళ్లగానే పిలిస్తే?" విశ్వనాధం కొశ్చన్‌మార్కులా ముహం పెట్టి అన్నాడు.

"పిలవర్లే!" ఎంతో నమ్మకంగా

అన్నాడు అరవిందం. ఆ నమ్మకానికి ఆధారాలేమీ లేవని అరవిందానికీ తెలుసు. అవసరాన్నిబట్టి కొన్నికొన్ని సందర్భాల్లో నమ్మకాలు తెచ్చిపెట్టుకోవాలనే ధోరణిలో వున్నాడు అరవిందం.

అరవిందంతోపాటు మెట్లుదిగి, పది గజాలు నడిచేసరికి విశ్వనాథానికి పచ్చివెలక్కాయ గొంతున పడినట్టయి—

"ఒకవేళ పిలిస్తేనో?" అన్నాడు.

"పిలిస్తే మళ్లీ పిలుస్తార్లే!" విసుగ్గా అన్నాడు అరవిందం.

"మళ్ళీ అంటే?"—అనుమానంగా విశ్వనాథం.

"నువ్వు ఇదేనా మొదటిసారిగా ఇన్టర్వ్యూకు రావడం?" నవ్వుతూ అడిగాడు అరవిందం.

ఆ నవ్వులో వ్యంగ్యం గోచరించింది విశ్వనాథానికి.

★ 'రాకుమారీ స్వయంవరం' ★

"అవును! ఇదే మొదటిసారి! మరి మున్నో?" సూటిగా ప్రశ్నించాడు విశ్వనాథం.

"ఐదు! కాదు—ఆరు! ఇది ఆరో ఇంటర్వ్యూ అన్నమాట!" తామరాకుమీద నీటిబొట్టు కదిలినంత తేలిగ్గా అంటీ అంటనట్టు అనేశాడు అరవిందం.

"ఆరోసారా?" విశ్వనాథానికి గుండెలు చిక్కబట్టినై.

'—తనూ ఆరుసార్లు రావాల్సి వుంటుందా? ఎందుకూ తను మొదటిసారితోనే సెలక్టు అయిపోడూ! వీడు నిద్రమొహంవాడు కాబట్టే యిన్నిసార్లూ సెలెక్టు కాలేదు. ఇలాగే ఎప్పుడో బయటికి పోయినప్పుడో, బెంచీలమీద పడుకొని నిద్రపోతున్నప్పుడో ఆ పుణ్యకాలం కాస్తా అయిపోయివుంటుంది ధూత్! అసలు వీడివెంట బయటికి రావడమే తప్పు' అనుకుంటూ పక్కన ఆగాడు విశ్వనాథం. అప్పటికే ఆఫీసుఆవరణగేటు దాటి బయటి రోడ్డుమీదకు వొచ్చారు.

దూరంగా వో అరఫర్లాంగు దూరంలో సోడాకొట్టూ, దానిపక్కనే కాఫీహోటలూ కనిపిస్తున్నాయి.

"మిస్టర్ అరవిందం! నువ్వు పోయి తాగిరా! నాకిప్పుడు వద్దులే!" అంటూ విశ్వనాథం గిరుక్కున వెనక్కు తిరిగాడు. ప్రాణం నీళ్ళకోసం తపించిపోతోంది. కాని పిలుస్తారేమో! తన పేరు పిలిచారేమో?

"విశ్వనాథం! విశ్వనాథం!!" విశ్వనాథం చెవుల్లో దూరంనుంచి అస్పష్టంగా వినపడింది. అతని మనసులోని ఆలోచనల హోరు చెవుల్లో ప్రతిధ్వనించింది.

విశ్వనాథం ఒక్క పరుగులో లోపలకొచ్చిపడ్డాడు. కాని ఎక్కడివాళ్లు అక్కడ కూర్చొనివున్నారు. కళ్ళకు కనిపించే ఎండమావులు విశ్వనాథానికి చెవులకే వినిపించినై.

అక్కడికీ అనుమానం తీరక—

"నన్ను పిలిచారా?" అని అడిగాడు విశ్వనాథం.

"వాడెందుకు పిలుస్తాడయ్యా? ఐదు కానిదే?" కసిగా అన్నాడు ఆనందరావు కోటువిప్పి భుజాన వేసుకొని.

విశ్వనాథం ముఖానపట్టిన చెమటతుడుచుకొన్నాడు. దాహం! నాలుక పిడచగట్టుకుపోతూంది. తను వట్టిఫూల్! గాభరాగాడు. అరవిందంతోపాటు పోతే యీపాటికి సోడా తాగొచ్చేవని. ఇక ఆగలేదు దాహం - దాహం-

ఆఫీసరు గదిముందు కూర్చొని; కళ్లు కోడికళ్ళలా మూతవేసి కుర్రు కొట్టడానికి, సిద్ధంగావున్న జవానుదగ్గరకు పోయి విశ్వనాథం—

"ఒకగ్లాసు మంచినీళ్లు తెచ్చిపెడుదూ!" అని ప్రాథేయపూర్వకంగ అన్నాడు.

ఆఫీసరు పిలుస్తున్నాడేమోనని తత్తరపడి లేచిన జవానుకు విశ్వనాథంమీద వల్లమాలిన కోపం వచ్చింది. కాగు మరీ కమ్మని నిద్ర చెడగొట్టాడాయె?

"అదుగో ఆ ఇంటివెనక కొళాయి వుంది! పోయి తాగండి!" అంటూ వాచ్‌మన్ షెడ్ వైపు చూపించాడు ముఖం చిట్లించుకొని.

విశ్వనాథం కొళాయిదగ్గరికెళ్లి కడుపునిండా నీళ్లుతాగి, ముఖంమీద చల్లుకొన్నాడు. ప్రాణం తేరుకొన్నట్టు అయింది. నీళ్లు తలమీద చల్లుకొంటూ కాసేపు కూర్చున్నాడు.

"విశ్వనాథం! విశ్వనాథం!!" దూరంగా ఎక్కడో అస్పష్టంగా పిలుపు - విశ్వనాథం బుర్రలో సంగీతం పాడింది!

విశ్వనాథం వడివడిగా - పరుగుపరుగున వచ్చాడు. కడుపులో నీళ్లు జోడెద్దుల బండిమీది సత్రవుపీపాలోని నీళ్లలా 'గుబుక్—' 'గుబుకూ'మని మోగినై.

విశ్వనాథం తిరిగొచ్చేసరికి అక్కడ ఎవరూ లేరు! వాళ్లు కూర్చున్న పొడుగాటి బల్ల ఖాళీగా వుంది!

విశ్వనాథానికి గుండెలు జార్‌మన్నాయి! ఇన్‌టర్వ్యూ ఐపోయిందా?

కాళ్లకింద భూమి కదులుతోంది! కళ్లు మైకం కమ్ముతున్నాయి! బుర్రలో విమానాలరొద-టాంకుల చప్పుడూ—

తను మంచినీళ్లు తాగుతూ అక్కడ ఎంతసేపున్నాడు? మూర్ఛపోయి ఎక్కువసేపు అక్కడే పడివుండలేదుగదా? తను మూర్ఛపోవడమేమిటి? నాన్‌సెన్స్!

ప్యూన్‌అన్నా వున్నాడేమో అనుకుని ఆఫీసరు గదివైపు చూశాడు—

వాడూ అక్కడ లేడు!

'హరి భగవంతుడా? ఆఫీసరుకూడా వెళ్లిపోయాడా?'

విశ్వనాథానికి కాళ్లు వణుకుతున్నాయి. గుండెల్లో ఆయాసం, వళ్ళంతా నీరసించిపోతోంది. బల్లమీద కుప్పగా కూలబడ్డాడు.

డాక్టరు కావాల్సిన విశ్వనాథం డెబ్భైరెండు రూపాయల జీతంమీద గుమాస్తాగిరి! దానికి భగీరథుని తపస్సూ—హరిశ్చంద్రుని కష్టాలూ—అగ్ని పరీక్షలూ—

తనకు రాబోయే డెబ్భైరెండు రూపాయలకోసం—అమ్మకు చిరకాల వాంఛితమైన సైనుపంచా, చెల్లెలు నిత్యం కలలుకనే ఖటావ్ వాయిల్ చీరా, తమ్ముడి పెద్దబాలశిక్షా ఎదురుచూస్తున్నాయి

తనూ, అమ్మ, చెల్లి, తమ్ముడూ, కనీస జీవితావసరాలే జీవితాదర్శాలుకాగా ఎడారిలో వాళ్ళకోసం రెక్కలు విప్పుకు ఎగిరే పక్షిలా, చిన్న వుద్యోగం గుమాస్తాగిరి రెపరెపలాడే జీవితాలకు ఇంత ఆధారంకోసం వెతుకుతూంటే ఇంత దారుణం జరగాలా?

పొద్దుట్నించీ పడిగాపులు గాచాడే! దాహం తీర్చుకొచ్చేసరికే—

"హలో! మిస్టర్ విశ్వనాథం! మీరు కాఫీకి రాలేదేం?" అప్పుడే మెట్లెక్కివస్తూ భూషణం అన్నాడు.

—సాలెగూడులా అల్లుకొంటున్న విశ్వనాథం ఊహలు చిందరవందరై చెదిరిపోయినై. పీడకలలో మెలకువ వచ్చినవాడిలా చూశాడు.

భూషణం వెనకే మిగతా ముగ్గురూ వచ్చారు. నలుగురూ బల్లమీద విశ్వనాథం పక్కన సర్దుకు కూర్చున్నారు.

జవాను ఫ్లాస్కుతో ఆఫీసరు గదిలోకి వెళ్ళాడు.

విశ్వనాథం పరిస్థితి అంతా అర్థం చేసుకుని సిగ్గుపడ్డాడు. తను అనవసరంగా ఖంగారుపడ్డాడు! వట్టి ఫూల్!

"ఇంతకీ ఇవ్వాళ మనకు రాజకుమారి దర్శనమవుతుందంటారా?" అన్నాడు భూషణం

అంతా నోరు తెరుచుకొని భూషణంకేసి వింతగా చూశారు. కాఫీ తాగొచ్చిందగ్గర్నుంచీ భూషణం మాంచి వుషారుగా వున్నాడు.

"రాజకుమారి ఎవరోయ్ భూషణం?" అన్నాడు ఆనందరావు క్రాపు వూడదీసి కట్టుకొంటూ.

"రాజుగారి కూతురు—రాజకుమారి!" నొసలు పైకెత్తి కళ్లు మెరిపిస్తూ అన్నాడు భూషణం.

"అంటే ఆఫీసరుగారు?......" మిగతా మాట వచ్చే ఆవలింతలో తేలిపోయింది అరవిందానికి.

"మన విసియాను అమాంతం ఖూనీ చేస్తున్నావ్ అరవిందం! రాజు అంటే గవర్నమెంట్! కూతురు అంటే జాబ్! ఎందుకల్లనంటావా? రాజుగారి కూతురు దొరికినా, రాజుగారి కొలువు దొరికినా వొకటే గా?"

"ఉద్యోగం అంటే డబ్బు అనగా లక్ష్మి. లక్ష్మీదేవి ఆడదిగదా? దెర్‌ఫోర్ - ప్రభుత్వోద్యోగం అంటే రాజకుమారి!" చేతులు తిప్పుతూ భూషణం అన్నాడు.

విశ్వనాథానికి నవ్వాగింది కాదు "ఏమిరా మనిషి చూస్తే ఇంత వున్నాడు పొట్టి బుడంకాయల్లే; మాటలు చూస్తే - అందుకే ఏ పుట్టలో ఏ పాముందో అంటారు' మనసులో అనుకొని విశ్వనాథం—

"మాష్టారూ మీ గ్రూపు ఏమిటండీ?" అని భూషణాన్ని అడిగాడు.

"ఇన్‌టర్ ఆల్‌జీబ్రాతో బుర్ర తిరిగి చదువు మానేశాను!" అన్నాడు భూషణం. అంతా కాసేపు మౌనంగా కూర్చున్నారు.

"మనం రాజకుమార్తె స్వయంవరానికి వచ్చిన రాజకుమారులమన్నమాట!" స్టేజి యాక్టరులా అన్నాడు భూషణం.

"భలే! భలే మాట అన్నావ్!" భూషణానికి వుషారిచ్చాడు ఆనందరావు.

"మన ఐదుగురిలో అసలు వరుడు వకడే వున్నాడు! రాకుమారి దమయంతి అసలు నలుడెవడో తేల్చుకొని దండ వేసేస్తుంది!"

"రాణిసంయుక్తలాగా, యీ రాజకుమారి స్వయంవరానికొచ్చిన రాజులందర్నీ వదిలేసి వాకిటి బయటవున్న ఏ పృథ్వీరాజు బొమ్మకో వేస్తే!" అన్నాడు అరవిందం.

అరవిందం హిస్టరీ స్టూడెంటు! విశ్వనాథం అతడివంక ఆశ్చర్యంగా చూశాడు—

'వీడి దుంప తెగ! ఎంత తెలివిగా అన్నాడు! మళ్ళీ చూస్తే నిద్రముఖం వీడూను? అందరూ అన్ని కతుల్లాగానే వున్నారే?' అనుకొన్నాడు.

"ఇన్నిటికీ ఆ రాజకుమారికి రహస్య ప్రియుడు ఎవడున్నా వున్నాడో ఏమో?" అన్నాడు ఆనందరావు. తను మాత్రం తీరికే ఎందుకుండాలి!

విశ్వనాథం గడియారం చూశాడు—

నాలుగున్నర అయింది!

"పిలుస్తాడో లేదో కనుక్కుందాం పదండి! ఇంకా ఇంతసేపు కూర్చోవడం!" విసుగ్గా అన్నాడు ఆనందరావు.

విశ్వనాథం—"ఇంతసేపు కూర్చున్నాం గదా? ఇహ ఆ అరగంటకూడా చూద్దాం!" వాడిపోతూన్న ఆకలకు నీరుపోస్తూ అన్నాడు.

"మిస్టర్ అర్జున్‌రావు మత్స్యయంత్రం నువ్వే కొట్టాలి!" భూషణం ముందుకువంగి విశ్వనాథంవంక చూస్తో అన్నాడు.

"నా పేరు విశ్వనాథం!" అన్నాడు వెల వెల పోతూ విశ్వనాథం.

"అవుననే! పంచపాండవులు ఐదుగురు కదా? మనమూ ఐదుగురమే! మత్స్యయంత్రాన్ని కొట్టి ద్రౌపదిని చేసుకోడానికి వాళ్లు వెళ్లినదీ, ఇప్పుడు మనం వచ్చిందీ ఇంచుమించు వొకటే! మనం కూర్చున్న వరుస చూస్తే, నేను ధర్మరాజూ, అరవిందం భీముడూ, నువ్వు అర్జునుడూ, తిరుమలై, ఆనందరావులు నకుల సహదేవులూ అవుతారు!"

"మీకు తెలుగు సాహిత్యంలో బాగా ప్రవేశమున్నట్టుందే?" అన్నాడు విశ్వనాథం.

"ఆఁ మా నాన్న పండితుడు. సంస్కృతం తెలుగూ బాగా చదువుకున్నాలే చిన్నప్పుడు!" అన్నాడు భూషణం.

"అంటే మీరు పండితపుత్రులన్నమాట!" ధమక్‌గా అనేశాడు విశ్వనాథం. అంతా వొక్కసారి నవ్వుకొన్నారు.

అంతలావు భూషణాన్ని దెబ్బకొట్టానని లోలోపల గర్వపడ్డాడు విశ్వనాథం.

"ఇంతకీ మన విశ్వనాథం మత్స్యయంత్రాన్ని కొట్టి రాజకుమారిని సంపాదించి మనకు భాగం పెడ్తాడా?" నటుని పద్ధతిలో చెయ్యితిప్పుతూ అన్నాడు భూషణం.

"రాజకుమారి ద్రౌపది కాదు! ఏకభర్తృక! ధర్మపత్ని! ఒక్కడే భర్త!" అని మాటకు మాట విసిరాడు విశ్వనాథం.

"దరోజ్ ట్రూ! ఒకణ్ని డైవర్సు చేసేదాకా రెండోవాణ్ని చేపట్టేందుకు వీలు లేదు యీ రాజకుమారికి!" అన్నాడు ఆనందరావు.

విశ్వనాథం గోడనవున్న గడియారం కేసి చూశాడు - నాలుగుమ్ముప్పావ్ అయింది!

'ఐదుకు ఇంకా పదిహేను నిముషాలు తక్కువ! ఒక్కొక్కడికీ మూడునిమిషాలు పట్టినా పదిహేను నిముషాలు పట్టుంది ఇంటర్వ్యూ పూర్తికావడానికి?

—ఇంకా పిలవడేం?'

ఆఫీసరు గదిలోంచి కాలింగ్ బెల్!— 'సార్! వస్తున్నా' - జవాను లోపలకి పరుగు తీశాడు.

"ఎస్టాబిష్‌మెంటు సూపర్నెంటును పిలువ్!"

"సూపర్నెంట్ సార్! అయ్యగారు పిలుస్తున్నారు!"

సణుక్కుంటూ సూపర్నెంటు జవాను వెనుకే ఆఫీసరు గదిలోకి పరుగూ—

'ఐతే ఇక ఇన్‌టర్వ్యూ మొదలవుతుంది!' -విశ్వనాథం గుండెల్లో దడదడా, తల్లో బుయ్యిఁ బుయ్యిఁ సాగినై.

—మత్స్యయంత్రం తనే కొట్టాలి - అద్దంలోనుంచి చూస్తూ పైన గిర్రున తిరుగుతున్న మత్స్యయంత్రాన్ని వొక్క బాణంతో -పాంచాలి పూలదండ తన మెడలో వేస్తోంటే - రాజకుమారి చెయ్యిపట్టుకొని-చిన్నప్పుడు చూసిన సురభికంపెనీ నాటకంలో - అర్జునుడు ఎంత దర్జా—

"విశ్వనాథం! విశ్వనాథం!!" అరే! తననే ముందు పిలిచారు. తనదె ఫస్టుఛాన్స్!

ఆఫీసరు గదిలోకి వెళ్తుంటే ఇదేమిటి తనకాళ్లకు భూమి తగలటంలేదేం? మోకాళ్లు అంతగా ఎందుకు వణుకుతాయి? మ-మ-మాట కూడా రా - రావడంలేదేం?

రాక్షసుడిలా ఆ ఆఫీసరుకు కోరలూ -

★ 'రాకుమారీ స్వయంవరం' ★

జేబుజుట్టూ లేదేం? అంతా మామూలుమనిషిలాగానే వున్నాడేం?

"వాటీజ్ యువర్ క్వాలిఫికేషన్!–" ఆఫీసర్.

"బి. ఏ! ఇ-ఇంటర్‌లో క్లాసు వచ్చింది సార్!"

"అంటే బి. ఏ. లో క్లాసురాలేదా?" ఆఫీసరు విరగబడి నవ్వుతున్నాడు.

"లేదు సార్! ఐదుమార్కుల్లో పోయింది!"

"ఐదుమార్కుల్లో పోయినా వంద మార్కుల్లో పోయినా ఒకటే లేవయ్యా!" ఆఫీసర్ కళ్ళల్లో అదంతా కోపమే?

అమ్మో! ఆఫీసరుకు కోపంవచ్చింది! తను కాళ్ళు ఇంకొంచం దగ్గరకు జరుపుకొని, చేతులు వెనక్కి గట్టిగా బిగించిపట్టుకొని, వసుం ఇంకొంచం - ఇంకొంచెం - ఆఁ! అలావంచి నిల్చుంటే సరి!

"మీతండ్రి ఏం చేస్తుంటాడు?"

"మా తండ్రా సార్!"

"అవును మీతండ్రేనోయ్! మరి ఎవడి తండ్రి అనుకొన్నావ్?"

"యస్ సార్! మా నాన్న తాలూకా ఆఫీసులో హెడ్‌గుమస్తా చేస్తో రిటైరయా!"

"రిటైరయా–?"

"చనిపోయాడు సార్!"

"ఓ ఐసీ! మరి వుద్యోగం యిస్తే బాగా చేసుకుంటావా?"

"యువర్ మోస్ట్ ఒబీడియన్ట్ ఫైత్‌ఫుల్ సర్వెంటుగా"—

"ఆల్ రైట్! ఇక నువ్వెళ్ళొచ్చు!"

"థాన్క్ యూ! థాన్క్యూ వెరిమచ్!" సినిమాస్కోప్ సినిమాలో సీజరు దర్బారులో సైనికుడిలా-వెనక్కి వెనక్కి నడిచి-నడిచి-బయటికి రాగానే వీరాధివీరుడిలా, సింహంపిల్లలా రొమ్ము విరుచుకొని ఆఫీసరు గదిలోంచి బయటికి వస్తోన్నాడు తను-! కొండలూ-సముద్రాలూ-లోయలూ అగాథాలూ—

"ఏవిటోయ్! మిస్టర్ విశ్వనాథం! నువ్వు ఇక్కడ వుండే మత్స్యయంత్రానికి గురిపెట్టున్నట్టున్నావ్?"-విశ్వనాథం భుజంతట్టి వూపుతూ అన్నాడు భూషణం.

విశ్వనాథం కలలు కరిగిపోయినై! భ్రమలు విచ్చిపోయినై! కొండమీదనుంచి దొర్లిన మట్టికుండలా విశ్వనాథం ఆలోచనలు చెల్లాచెదరయిపోయినాయి.

తలా, ముఖం, చొక్కా వర్షంలో తడిసినట్టుగా వుంది!

వళ్ళంతా చెమటలుకమ్మినై - హీనస్వరంతో కళ్లు తేలవేస్తో—

"భూషణం! నా కేదో కళ్లు తిరుగుతున్నట్టు మైకంగా వుంది!" అన్నాడు విశ్వనాథం.

"కాదు మరీ! పొద్దున ఎప్పుడు తిన్నావో పాపం! మధ్యాహ్నం కాఫీకూడా తాగక పోతివి? లే! ఇంద! కాస్త సంజీవి పుచ్చుకో?" అంటూ భూషణం కాఫీగ్లాసు విశ్వనాథం నోటికి అందించాడు.

ముఖాన కారుతోన్న నీళ్ళతడి తుడుచుకొంటూ విశ్వనాథం జాలిగా, వెర్రిగా చూస్తో—"నేను - నేను మూర్ఛపోయానా?" అన్నాడు.

"అవును! తమ్ముడా! లక్ష్మణా! మరి సంజీవి తెప్పించాంగా! ఒక్క గుటక వెయ్ ముందు!" ఫక్తు నాటకఫక్కీలో అన్నాడు భూషణం.

విశ్వనాథానికి నవ్వూ ఏడుపూ కలిసి వచ్చాయి—

"నువ్వుండవోయ్ రామచంద్రా! అసలే విశ్వనాథం గాభరాపడిపోతుంటేను!" అని భూషణాన్ని మందలించాడు ఆనందరావు.

అరగ్లాసెడు కాఫీ తాగినాక కొంచెం తేరుకొన్నాడు విశ్వనాథం.

"మీకు ఇదివరకు ఎప్పుడైనా ఇలాగే వచ్చేయా?" అని అడిగాడు అరవిందం.

"లేదు! ఇదే మొదలు—" సాలోచనగా అన్నాడు విశ్వనాథం.

"ఏమైనా, మీకు నర్వస్ వీక్‌నెస్‌లాగా వుంది! మంచి వైటమిన్ ఫుడ్ తీసుకోవాలి!" బి. యస్. సీ విజ్ఞానాన్ని వెలగబెడ్తో అన్నాడు ఆనందరావు.

"అసలు ఆహారమంటూ వొకటి దొరికితే, అందులో వైటమిన్సు వున్నాయో లేదో తర్వాత చూసుకోవచ్చు!"— మనసులో అనుకొన్నాడు విశ్వనాథం.

"మీరు అంతగా మానసికబాధలకు లోనుకాకూడదు. మెన్టల్ స్ట్రెయిన్, మీ నరాలమీద దెబ్బ తీస్తుంది!"

"తనకు మానసికబాధలు కావాలని కోరుకొన్నాడా? వాటిని కోరి తెచ్చుకుంటున్నాడా?" మనసులో మథనపడ్డాడు విశ్వనాథం—

'అన్నట్టు ఇన్‌టర్వ్యూ ఏమయింది?' గడియారంకేసి చూశాడు. అదెందుకు ఆగిపోతుంది? తనంటే దానికి జాలా?

ఐదుకు ఇంకా రెండు నిముషాలుంది! విశ్వనాథం గుండెల్లో ఏదో బరువుగా తగిలినవాడై—

"ఇన్‌టర్వ్యూ ఐపోయిందీ?" నిరాశలో మునిగిపోతూ అన్నాడు.

"లక్ష్మణమూర్ఛ అయినా సీతజాడలైనా కంటపడలేదుగదా తమ్ముడూ?" అన్నాడు భూషణం వచ్చిన అవకాశాన్ని వదులుకోకుండాను.

అంతా వొక్కసారి గొల్లున నవ్వా "ఆ ఇన్‌టర్వ్యూ సంగతేదో తేల్చుకుందాం పదండి! ఐదయిపోతూంటేను!" బల్లమీదనుంచి లేచినుంచుని అన్నాడు ఆనందరావు.

"సరే! సంగతేమిటో అడిగేద్దాం పదండీ!" అంటూ అంతా లేచి నుంచుని ఆఫీసులోపలికి పోవడానికి సిద్ధమయ్యారు.

అంతలోకే ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్ అప్పర్ డివిజన్‌గుమస్తా వొకడు చేత్తో ఒక ఫైల్ పట్టుకొని బయటకు వచ్చాడు.

చూట్టానికి నలభై సంవత్సరాల్లా కనపడుతోన్న ముప్ఫై ఏళ్ళ ఆ గుమస్తా ఇన్‌టర్వ్యూకోసం కాచుకొనివున్న ఐదుగురు అభ్యర్థులను సమీపించి అన్నాడుగదా—

"మాఆఫీసులో ఖాళీఅయిన లోవర్ డివిజన్ గుమాస్తా పోస్టులో నిన్ననే మా ఆఫీసు అటెండరును వొకడిని ప్రొమోట్‌చేసివేశాం! ఆ సంగతి నిన్ననే ఎంప్లాయిమెంట్ యక్ఛేంజ్ వాళ్లకు తెలియజేశాం. ప్రస్తుతం మాఆఫీసులో ఏమీ ఖాళీలు లేవు!"

అది వింటూనే అభ్యర్థులు ఐదుగురూ గుడ్లు మిటకరించి కొయ్యబొమ్మల్లా నిశ్చేష్టులయి నుంచున్నారు!

"ఐతే ఎంప్లాయిమెంట్ యక్ఛేంజి వాళ్లు మమ్మల్ని ఇక్కడకెందుకు పంపించినట్టూ?" తీవ్రంగా అన్నాడు ఆనందరావు.

ఫైల్ చంకన పెట్టుకొని పోతూన్న గుమాస్తా వెనక్కి తిరిగి—

"బహుశః మా రిఫరెన్సు, వాళ్ళ రిఫరెన్సూ క్రాస్ అయివుంటయ్!" అన్నాడు.

"మీ రిఫెరెన్సులు కావయ్యా! అసలు మా స్టార్స్ క్రాస్ అయివుంటాయిలే" అన్నాడు భూషణం.

గుమస్తా అదే పోతగా లోపలికి పోయాడు.

అభ్యర్థులంతా ఆఫీసుమెట్లు దిగి నడచి ఆవరణ గేటు దగ్గర కొచ్చారు

—విశ్వనాథానికి లోలోపల దుఃఖం, వల్ల మాలినదుఃఖం పసిఫిక్ సముద్రం అంత లోతుగా— హిమాలయాలంత ఎత్తుగా నయాగరాలు దూకటానికి ఘోష పెడుతోంది.

"సాహసివి కనకే రాకుమారీ! తోటమాలినే వరించావుగదే?" నేపాళ మాంత్రికుడిలా పోజుపెట్టి గాల్లోకి చేయి విసురుతూ అన్నాడు భూషణం.

భూషణం మాటలు వింటోన్న విశ్వనాథం కళ్ళ వెనక నవ్వూ, ఏడుపూ నేను ముందంటే నేను ముందని కీచులాడుకొన్నాయి. ★

వనితాలోకం

శ్రావణమాసము-వ్రతాలు

ఇల్లిందల సరస్వతీదేవి

శ్రావణ భాద్రపదాలు వస్తాయని పాత ధాన్యము, ఘాటైన ఊరగాయలూ భద్రపరచుకొంటారు గ్రామస్థులు. భూమి అదనుకు పదనయితే బంగారు పంట పండుతుందని శ్రావణములో వర్షాగమనానికి ఎదురుచూస్తూఉంటారు రైతులు. తెలుగు సీమలోని ముత్తయిదువలు తమకు అయిదవ తనమిచ్చి, అష్టైశ్వర్యాలనూ ప్రసాదించే మంగళగౌరి, వరమహాలక్ష్మీ వ్రతాలకోరకు వాళ్ళ హృదయాలు ఉరకలు వేస్తూ ఉంటాయి.

'ఏమే! అమ్మాయికి అత్తవారు శ్రావణ పట్టీ పంపుతారంటావా?' అని గృహస్థు అంటే—'ఎందుకు పంపరూ? మనము ఆషాఢపట్టీ పంపాముగా!' అంటుంది గృహిణి.

శ్రావణ మాసములో ఇంటింటా పచ్చ వాకు తోరణాలూ పసుపు కుంకుమల రాసులు!

* * *

అది శుక్లపక్షమి. శుక్రవారము ఉదయము ఆరు గంటలవేళ ఒక పెద్దముత్తయిదువ బురదలో దిగబడుతున్న కాళ్లతో ఎత్తి ఎత్తి అడుగులు వేస్తూవచ్చి ఒక అరుగు మీద చతికిలబడి ఇంట్లోకి తొంగిచూసింది. ఆ యిల్లు చక్కగా అలికి ఉన్నది. తెల్లటి ముగ్గుతో రంగవల్లులు తీర్చి ఉన్నాయి. క్రింద పసుపు కుంకుమలతోను, పైన పచ్చ వాకు తోరణాలతోను ముఖద్వారము కల కలలాడుతున్నది. ఆ యింటి దిద్దుబాటుకు పండు ముత్తయిగువ విశాల నేత్రాలు ఆనం దాతి రేకాన్ని వెలిబుచ్చాయి. ఆమె ధరించిన రత్నాభరణాలు కుందనము వంటి ఆమె దేహకాంతులతో పోటీబడుతున్నాయి. పండిన శిరోజాల కొప్పుమీది చేమంతులు సంపెంగలు ముత్యాల కొప్పు గొలుసుతో సయ్యాట లాడుతున్నాయి. వాకిటి అరుగుమీద ఆమె ఆసీనురాలు కాగానే ఆ వీధికే వెలుగువచ్చినట్లయినది.

'ఇంటనున్న దెవర'ని ఆమె పృచ్ఛించి చూసింది. జవాబురాని కారణముచేత లోపలికి వెళ్లింది. నాలుగుమూలలూ చుట్టివచ్చిన పెద్దముత్తయిదువకు ఆ యింట జన నివాసము ఉన్నట్లే తోచింది; కాని ఎక్కడా మనిషి అలికిడిలేదు. నిరాశతో తిరిగి పోతున్న ఆమెకు, పసుపుచాయలు దేరిన ముఖబింబ మొకటి తలుపుచాటునుండి తళుక్కున మెరసినట్లయినది.

ఆమె ఒక నిరుపేద ఇల్లాలు. ఆనాడు సంపద శుక్రవారమని తెల్లవారకముందే ఇల్లలికి ముగ్గులు పెట్టింది. తాను తలంటి నీళ్లు పోసుకొన్నది. తన చీరెలో కొంత ముక్క చింపి పెనిమిటిని ఊళ్ళోకి యాయవారానికి పంపింది. ఆ మిగిలిన ముక్క తనకు చుట్టుతిరగలేదు. తలుపులు మూసుకొని ఇంట్లో ఉందామన్నా వీలులేదు. ఆనాడు లక్ష్మీదేవి రాకకు ద్వారములన్నీ తెరచే ఉంచాలి. ఆ కారణముచేత తలుపుచాటున ఒదిగిపోయింది.

ఆ పెద్దముత్తయిదువ ఆనాడు ఊరంతా తిరిగి ప్రతియిల్లూ తొంగిచూసింది. ప్రతి ఇల్లాలూ ఇంటి శుభ్రమూ ఒంటిశుభ్రమూ ఎరుగకుంటా, పాచియింట్లో, పాచిముఖముతోనే ఉన్నది. పాచిఇళ్లలో కొందరు ప్రొద్దుననే తలలు దువ్వుకుంటున్నారు; కొందరు ఫలాహారాలు చేస్తున్నారు. మరి కొందరు పడకలమీదనే ఉన్నారు.


ఇల్లుచూసి ఇల్లాలిని చూడమన్నారు. ఆయిల్లు ఎంత శుచిగా శుభ్రముగా ఉన్నదో ఇల్లాలి ముఖమంత కలకలలాడుతున్నది.

'ఇవాళ సంపదలిచ్చే శుక్రవారము. ముత్తయిదువలంతా వరమహాలక్ష్మిని పూజించాలి. లక్ష్మీపూజ చేసుకొని నాకింత

(30-వ పేజీ చూడండి)



"వెండి కెరటాలలో..."



—ఫొటో: నాళం కామేశ్వరరావు, రాజమండ్రి.

★ శ్రావణమాసము-వ్రతాలు ★

అన్నము పెట్టమ్మా!' అని పెద్ద ముత్తయిదువ ఆ యిల్లాలిని అర్థించింది.

అర్ధనగ్నంగా ఆమె కంటబడినందుకే ఆ యిల్లాలి ప్రాణము సగము చచ్చిపోయింది. పూజ భోజనపు ప్రశంసరాగానే నిలువునా క్రుంగిపోయింది. 'అమ్మా! నాకూ నా పెనిమిటికీ ఒక్కటే నిండుబట్ట. ఆయన గ్రామ సంచారమయి వస్తేగాని, నేను ఇవతలికి రావీలు లేదు. చెంబునిండితేగాని మా కడుపులే నిండవు' అని ఉస్సురన్నది.

'అమ్మో! ఎవరికయినా ఇబ్బందులు వస్తూనే ఉంటాయి. ఇప్పటికి నా చీర కట్టుకోఅమ్మా' అంటూ పెద్ద ముత్తయిదువ తనచీరను కట్టుకోనిచ్చింది. తన పేరు చెప్పి కోమటిదు కొణముమీద సామాను తెమ్మన్నది.

ఈమె పేరు చెప్పగానే ఏ సెట్టి సామాను అరువుఇస్తాడు? అయినా వెళ్లిచూద్దామని ఆయిల్లాలు బయలుదేరింది; సెట్టిని చూడగానే మాటతడబడ్డది. అయినా అడగగానే సెట్టి, కోరినసామాను కొలిచిపంపాడు. ఆమె యింటికి వచ్చేసరికి, సంచారానికి వెళ్లిన యజమాని ఎడాపెడా మోయలేనన్ని మూటలు వేసుకొని ఇంటికి వచ్చాడు.

ఇదంతా ఆ పెద్ద ముత్తయిదువ మాహాత్మ్యమనుకొని ఆదంపతులు పంచభక్ష్యపరమాన్నాలతో ఆమెకు విందుచేశారు. రాత్రి తెల్లవార్లూ ఆమెను కనిపెట్టుకొనే ఉన్నారు. తెల్లవారుజామున వాళ్లిద్దరికీ కన్ను మలిగినట్లయినది. ఉదయపువేళ లేచి చూడగా ఆ పెద్దముత్తయిదువ ఎక్కడా కనబడలేదు. ఆమె పడుకున్న గదిలో నాలుగు మూలలా కుందనపు రాసులు మెరుస్తూ ఉన్నాయి.

ఆ యిల్లాలు ఆచోద్యాన్ని ఇరుగు పొరుగులకు చూపించింది. వారంతా ఆశ్చర్యపడ్డారు. 'ఆ పెద్దముత్తయిదువే వరమహాలక్ష్మి' అన్నారు. ఆ బంగారు రాసులను ఇట్టింట ప్రోగుచేసి పూజచేశారు. తొమ్మిది రకాల పిండివంటలతో నైవేద్యము పెట్టారు. ఇదే వరలక్ష్మి వ్రతమయి ప్రతి తెలుగు యింటా అనుసరణీయమయింది. ఈ వ్రతము అయిదవ తనము ఉన్నంతవరకూ స్త్రీలు ఆచరిస్తూ ఉంటారు.

క్రొత్తగా వివాహమయిన బాలికలను శ్రావణపట్టే అత్తవారు పంపాలి. అత్తవారంపిన చీర రవికా ధరించి, వారి ఖర్చుతో మంగళగౌరిని ఆరాధించి పూజిస్తారు. ఈ వ్రతము శ్రావణమాసములోని ప్రతి మంగళవారము నోచుకుంటారు. ఇది అయిదు సంవత్సరాల వ్రతము. దీనికొక విధానమూ, కరుణరసభరితమైన ఒక కథా ఉన్నాయి.

సంతానములేని ఒక రాజు తన దేశాన్ని జనరంజకముగా పాలిస్తున్నాడు. ఆ రాచ దంపతులకు శుభములివ్వ దలచిన పరమేశ్వరుడు జంగమావతారమెత్తి రాచ మేడలకు వెళ్లాడు. ఆ రాణి బంగారుపళ్లెమునిండా మొహరీలు పోసుకొని వచ్చింది. ఆమెను చూడగానే ఆ జంగము 'మీ చేతిభిక్షము నే నంటన'ని తిరిగి వెళ్లబోయాడు. రాచ దంపతులు కారణ మడుగగా 'మీకు పుత్రులూ పౌత్రులూ లేరు కనుక మీ చేతి భిక్షము నే నంటన'న్నాడట. 'మా కేది గతి' అని ఆ దంపతులు సాష్టాంగపడ్డారు. పరమేశ్వరుని గురించి తపస్సు చేయుమని చెప్పి ఆ జంగము వెళ్లిపోయాడు.

రాజ్యాన్ని విడిచి ఆ దంపతులు అడవికి వెళ్లి తపస్సుచేయగా ప్రత్యక్షమయిన పరమేశ్వరుడు 'ఆయుర్దాయము లేని పురుషుడు కావలెనా - అయిదవతనము లేని స్త్రీసంతానము కావలెనా' అని అడిగాడు. 'అయిదవతనము లేని ఆడపిల్లకంటె ఆయుర్దాయము లేని మగవాడే మేలన్నా'రా దంపతులు. పదహారు సంవత్సరాల ఆయుర్దాయము మాత్రముగల పురుషుడు పుట్టగానే ఆ దంపతులు ఎంత సంతోషించారో అంతగా దుఃఖించారు. ఆ బాలుడు పెరుగుతున్న కొద్దీ దుఃఖాన్ని పట్టలేక మేనమామను తోడిచ్చి కాశీయాత్రకు పంపుతారు. మార్గములో వాళ్లిద్దరూ ఒక తోటలో రాత్రి పూట పడుకొంటారు. తెల్లవారి లేచి బయలుదేరుతుండగా ఆ ఊరి బాలికలందరు ఆ తోటలోకి పుష్పాపచయానికి వచ్చారు. వాళ్లల్లో వాళ్లు తగాదాలుపడిన కారణము చేత ఒక బాలికకు మిక్కుటమైన కోపము వచ్చి 'నాకీరాత్రి పెళ్లి జరుగబోతున్నది. మా అమ్మ శ్రావణ మంగళవారము నోము ఉద్యాపన తీర్చుకొని నాకు వాయన మివ్వబోతున్నది. ఇటువంటి సమయములో మీరంతా తిట్టారు' అని కోసిన పూలనన్నిటిని చెల్లుమీదికి విరజిమ్మింది. ఆ పూలన్నీ ఏ కొమ్మ వా కొమ్మకు చేరి—ఎప్పటివలె తొడిమలలో నిలచాయి.

ఈ చోద్యాన్ని చెట్టుచాటునఉండి తిలకిస్తున్న రాజకుమారుడు గమనించి 'ఈ చిన్నదాని శీలము కడు గొప్పది. ఈ కన్యను నేను వివాహమాడగలిగితే అదృష్టవంతుడను' అనుకున్నాడు.

ఆ రాత్రి ఆ బాలికను పెళ్ళికూతురిని చేశారు. బాజాభజంత్రీలు మ్రోగుతున్నాయి. వివాహమంటపము కిటకిటలాడుతున్నది. ముహూర్తము మించిపోతున్నదని అందరూ కేకలు పెట్టుతున్నారు. అంతలో పెళ్ళికొడుకు మూర్ఛపోయాడని గుసగుసలు వినవచ్చాయి. ఆ ముహూర్తము ఊరకే పోగూడదని ఆ రాజుగారు పట్టుబట్టి పెళ్ళికొడుకును ఎరువు తెమ్మన్నారు. కాశీయాత్రకని తొందరపడి పయనమవుతున్న రాజకుమారుని అతని మేనమామ అనుమతితో పెళ్లికొడుకును చేసి వివాహము పూర్తిచేశారు. ఆ రాత్రి రాజకుమారుకొక భయంకరమైన కల-'నీ పెనిమిటికి సర్పగండమున్నది కాచుకో' అని. మంగళగౌరి ఆదేశమిచ్చినట్లుగా వినిపించింది. వధువు కళ్లు తెరచిచూసేసరికి బుస్సుబుస్సుమంటూ నాగేంద్రుడు చరచర పైకివస్తున్నాడు. వెంటనే ఆమె అటుకమీద పెట్టిఉంచిన వాయనపు కలశము నందుకోబోయింది; కాని అందలేదు. తత్తరపాటుతో పెనిమిటి తొడమీద అడుగువేసి కలశమందుకొని సర్పరాజు ఎదుట పెట్టింది. ఆ పాము దానిలో జొరబడగానే తన ఒంటిమీది రవికతీసి వాసెన కట్టి అటుకమీద పెట్టింది. తెల్లవారిన తరువాత రాత్రిజరిగిన విశేషమేమాత్రము తెలియని వరుడు మేనమామతో కాశీయాత్రకు వెళ్లిపోతాడు.

వధువు తండ్రి మొదట నిర్ణయించిన రాజకుమారుని పిలిపించి తిరిగి తలంబ్రాలు పోయించాలని ఏర్పాటుచేస్తాడు. కాని ఆమె తన నిశ్చయాన్ని తండ్రికి తెలుపుతుంది.

'నామాట వినియూ నన్నాదరించు
నీవు వ్రతము నేడు నిజముతో నడిపితే
భక్తితో తాంబూల మిత్తు నేను
జయమంగళా!!'

అంటుంది. ఈ విధముగా ఒక యేడాది వ్రతము చేసినట్లయితే తనపెనిమిటి తిరిగి వస్తాడని వేడుకుంటుంది. యాత్రకు వెళ్లిన ఆమె పెనిమిటి మేనమామతో

'కాశిచేరియు వారు గంగాస్నానముచేసి
కాలభైరవుల దర్శనముచేసిరి

అన్నపూర్ణను చాల అతిభక్తివేడుకొని
విశ్వేశ్వరుని గుడి దర్శించిరి
జయమంగళా నిత్యశుభమంగళా
మణికర్ణికాదేవి తిరువేణిదర్శించి
బిందు మాధవదర్శనము చేసిరో
భాగీరథిని చాల భక్తితో వేడుకొని
తిరిగివచ్చిరి వారు కాశికపుడూ
జయమంగళా॥

కాశిజేరినవారు గంగాస్నానము చేసి
కాశిపట్నానికే వచ్చిరపుడూ'

మామా అల్లుడూ పురోద్యానవనములో ఉపవాసము పడుకోవాలను కుంటుండగా, రాజభటులు చెప్పారట 'చిన్న రాణిగారు అన్నదానము తాంబూలము చేస్తున్నా'రని. 'మేము కాశీయాత్రచేసి వస్తున్నాము. స్వయంపాకము చేసుకొంటా'మని జవాబిచ్చారట. 'పోనీ తాంబూలమయినా వేసుకొండని రాజభటులు బ్రతిమిలాడారట. వారిద్దరూ దానికి అంగీకరించలేదు. అదొక నేరముగాఎంచి రాజభటులు వారిద్దరినీ రాజసముఖానికి తీసుకొని వెళ్ళగా, రాజకుమార్తె లేచి ఎదురుగా వెళ్ళి, రాజకుమారునికి తాంబూలమిచ్చి చెయ్యిపట్టుకొని 'ఇతడే నా పెనిమిటి'ని సభలో ఉన్నవారందరికీ చూపించింది. వధువు వరునివైపు చూసింది గుర్తులను చెప్పమంటూ. రాజకుమారుడు ముసిముసి నవ్వులతో—

'కాశికి బోదామనుచు కాంక్షతో
నిద్రను నిలిచి తోటాలోనె ఉండగను
అక్కడికి వేంచేసి నన్నింక నిమిషమున
మధురపర్కమిచ్చి కల్యాణమందె.'
జయమంగళా॥

(గుజరీ ప్రతిలోఉన్న పాట యథాతథంగా ఉదహరింపబడ్డది).

'ఆరాత్రి నిద్రపోయినట్లు నటించి అంతా చూస్తూనే ఉన్నాను. ఎక్కడినుండో ఒక పెద్ద కృష్ణసర్పము వచ్చింది. దానిని చూడగానే ఎంతమాత్రము భయపడక అటుకమీద నున్న కలశాన్ని, నా తొడమీద కాలుపెట్టి అందుకొన్నది. తన రవికతో వాసెన కట్టింది. ఆమె పసుపు పాదము ఇదిగో'నని గుర్తు చూపించాడు. రాజు అటుకమీది కలశము తెప్పించి చూడగా దానిలో బంగారు సర్పము కనబడ్డది. అప్పుడా రాజు అపరిమితానందముతో ఆకాశమంత పందిరి వేసి - భూమి అంతా అరుగు వేసి ముత్యాల తలంబ్రాలు పోసి వివాహము చేస్తాడు. మంగళగౌరి ఆ బాలికకు ఇలవేల్పు అవుతుంది. మంగళగౌరి మహిమతో ఆమె అత్తమామలకు పోయినవనుకొన్న కన్నూ కాళ్ళూ తిరిగి వస్తాయి. అష్టైశ్వర్యాలతో సుఖిస్తారు. ఆమె పట్టిన నోము జగమంతా పట్టారు.

ఇవి రెండూ తెలుగు ముత్తయిదువుల శ్రావణమాసపు నోములు. కథ లోపమైన వ్రతలోపము కారాదు. భక్తి తప్పినా ఫలం తప్పదు. ఈ వ్రతాలు ప్రారంభించి ఉల్లంఘనము చేసినవారికి ఇహలోక బాధలు అనేకము పరలోక సుఖాలు దూరము.

శ్రావణ మాసపు పేరంటాలు నోములు లేనివారికి కూడా ఆనందాన్ని కలిగిస్తాయి. స్త్రీలందరూ పచ్చపచ్చగా అలంకారాలు చేసుకొని బయలుదేరుతారు. ఎంత వర్షములోనయినా పసుపులు కుంకాలు వాయనాలు తప్పవు. ఈ పేరంటానికి పిలువని ఇళ్లకు కూడా వెళ్లి వాయనము తెచ్చుకోవటము ఘనముగా భావిస్తారు. వ్రతమయిన మరునాడు పిల్లలు పెద్దలు మొలకలు వేరిన సెనగలను ఆప్యాయంగా ఆరగిస్తారు.

జౌత్తరాహులకు ఈమాసములో మరొక పండుగ. స్త్రీలు పురుషులకు రక్షాబంధనము చేస్తారు. ఇది పున్నమినాటి పండుగ. రక్షను కట్టించుకొన్న పురుషుడు ఆ స్త్రీకి సోదర సమానుడని అర్థము. దీనిలో కులమత భేదాలు లేవు. ఆమెకు ఏ వేళ కష్టము వచ్చినా భ్రాతృసమానుడైన ఈ పురుషుడు వెళ్లి కాపాడాలి. పూర్వము ఒక క్షత్రియాంగన ఒక మహమ్మదీయ ప్రభువుకు రక్షాబంధనము చేసి ఆపదలనుండి తనను కాపాడుమన్నది. ఆ ప్రభువు శత్రుకోటిలో చేరినవాడైనా, తన కులమతాలనూ, వైరాన్ని విస్మరించి ఆమెను తోబుట్టువు సోదరివలె ఆదరించాడు. దీనిని జౌత్తరాహులు రాఖీ పున్నమి అంటారు.

అన్ని ప్రాంతాలలోను వ్రతాలు ఏదో ఒక పేరుతో ఉంటూనే ఉన్నాయి. ఈ వ్రతాలు సుమారు 245 ఉన్నాయని లక్ష్మీధరప్రోక్తమయిన 'వ్రతకాండ'వల్ల తెలుస్తున్నది. వీటిలో కొన్ని విష్ణుపరమైనవి, కొన్ని దేవిపరమైనవీ కాక, ఇతర దైవముల పరమైనవి కూడా ఉన్నాయి. వ్రతాలు కొన్ని అతి ప్రధానమైనవీ, కొన్ని వార మే ప్రధానమయినవి. మంగళగౌరి, వరలక్ష్మీవ్రతాలకు మాసమూ వారమూ కూడా ప్రధానమే. కొన్ని వ్రతాలు నక్షత్ర ప్రధానమయినవీ, మరికొన్ని తిథి వార నక్షత్రాలు మాసముతో కూడా ప్రధానమయినవి ఉన్నాయి. అట్లతదియ, నాగులచవితి, ఋషిపంచమి, సుబ్బరాయషష్ఠి, శ్రీకృష్ణ జన్మాష్టమి, శ్రీరామనవమి, విజయదశమి, వైకుంఠైకాదశి, చిలుకుద్వాదశి, శనిత్రయోదశి, నరక చతుర్దశి, వైశాఖపౌర్ణమి, దీపావళి అమావాస్య (సోమతీఅమావాస్య) మొదలైనవి. వీటిలో కొన్ని కేవలము పండుగలు; కొన్ని వ్రతాలకు సంబంధించినవి. మొత్తముమీద అన్నీ మతానికీ దేవతా పూజకూ సంబంధించినవి. కొన్ని వ్రతాలు దంపతులిద్దరూ కలిసి చేయవలసినవి. స్త్రీలే ప్రత్యేకముగా చేసేవి కొన్నిఉన్నాయి. స్త్రీలవ్రతకథలపుస్తకము ప్రకారము మూగనోము, చిట్టిబొట్టు, నిత్యశ్రింగారము కేదారగౌరి, కరుళ్ళగౌరి, నందికేశునినోము, పదహారుఫలాలవ్రతము, మొదలైనవి అనేకముగా ఉన్నాయి. ఇవన్నీ స్త్రీలకు ఒక విధమైన నిగ్రహాన్నీ దీక్షనూ కల్పించాలని ఏర్పరచిన పరంపరాగతమైన సంప్రదాయ స్వరూపాలు; సర్వులకూ అనుసరణీయమైన సాంఘిక సాంస్కృతిక ఆధారాలు. ★

స్వర్గీయ బాలాంత్రపు శేషమాంబగారు

కనుపర్తి వరలక్ష్మమ్మ

బాలాంత్రపు శేషమాంబగారు గత జూను నెల మొదటివారం చనిపోయినట్లు పత్రికలో వార్తామాత్రంగా చదివాను. ఆంధ్రమహిళాభ్యుదయానికి ఏభై సంవత్సరాలు సర్వతోముఖంగా కృషి చేసిన శేషమాంబగారి జీవిత చరిత్రను పరిశీలించవలెనంటె దాదాపు అరవై సంవత్సరాలు - అనగా వీరేశలింగం పంతులుగారి సంఘ సంస్కరణోద్యమం నాటి చరిత్రపుటలను తడుముకోవాలె.

శేషమాంబగారి భర్త సుందరరామయ్య పంతులుగారు ఉద్యోగరీత్యా రాజమహేంద్రవరం చేరి కాపురం పెట్టేటప్పటికి శేషమాంబగారు పద్దెనిమిది సంవత్సరాల యెల జవ్వని. సుందరరామయ్యగారికి స్త్రీ విద్యయందు అభిమానం మెండు. శేషమాంబగారు అప్పటికే పంచకావ్యాలు చదివి భారత భాగవతాలకు అర్థం చెప్పగల నైపుణ్యంతో ఉన్నది. ఇక రాజమహేంద్రవరమో ఆంధ్ర మహిళోద్ధారకుడైన కందుకూరి వీరేశలింగం పంతులుగారి బహుముఖ నారీజనోద్ధారణ కృషికలన ఉద్రిక్తంగా ఉన్నది. శ్రీ పంతులుగారి ప్రియశిష్యురాలైన కొటికలపూడి సీతమ్మగారు పంతులుగారితోబాటు స్త్రీల అభ్యుదయానికి పాటుపడుచున్నారు. విదుషీమణియు సహజముగానే సంఘసేవానురాగము కలదియు నైన శేషమాంబగారిని అచటి పరిస్థితులాకర్షించినాయి. తోడనే పంతులుగారు స్థాపించిన ప్రార్థనా సమాజంలో చేరి సీతమ్మగారితో బాటు ప్రార్థనా సమాజానికి వెళ్ళి అచటి ప్రార్థనా ప్రసంగములు వినడము, పంతులుగారు స్త్రీలనిమిత్తం ప్రచురిస్తున్న గ్రంథ పత్రికాదులు చదవడము ప్రారంభించింది. దీనికితోడుగా విదుషీమణియైన దేవగుప్తాపు మహాలక్ష్మమ్మగారు, తాము ఒక యింటిలోనే కాపురముండడంగూడా శేషమాంబగారి విద్యాభివృద్ధికి దోహదమయింది. ఆ రోజులలోనే ఆమె ప్రబంధ కావ్యాలు అత్యధికంగా చదివి చక్కని సాహిత్య సంపద అలవర్చుకున్నది.

ఇంతలో శేషమాంబగారి భర్తను జిల్లా బోర్డు హెడ్ గుమాస్తాగా మార్చి కాకినాడ బదలాయించడం సంభవించింది. అప్పటికే కాకినాడలో విద్వత్కవయిత్రీ తిలకమైన పులుగుర్త లక్ష్మీనరసమాంబగారు స్త్రీలకు సావిత్రీ పత్రికను నడుపుటద్వారాను పురాణ కాలక్షేపాదులద్వారాను స్త్రీలలో కొంత ప్రబోధం కలుగజేస్తున్నారు. అబలా సచ్చరిత్ర రత్నమాల అను అపూర్వామూల్య గ్రంథం వ్రాసి ఆంధ్రనారీలోకానికి ఎనలేని ఉపకృతి చేసిన కీర్తిశోభితురాలు బండారు అచ్చమాంబగారు అప్పుడు కాకినాడలోనే ఉన్నారు. కాకినాడ రావడంతోనే నరసమాంబ అచ్చమాంబగార్లవంటి విదుషీమణుల సాహచర్యం లభించడంవల్ల స్త్రీ సంఘసేవ చేయవలెనని ఉత్సాహపడుచున్న శేషమాంబగారికి మంచి ఊత లభించినట్లయింది. ఈ ముగ్గురు విదుషీమణులు ఏకమై స్త్రీ సమాజస్థాపనకు యోచనలు చేయడం మొదలుపెట్టారు. అంతలో శ్రీ కందుకూరి వీరేశలింగంపంతులుగారు కార్యాంతరముమీద సతీసమేతముగా కాకినాడవచ్చి శేషమాంబగారి యింటనే ఉండటం సంభవించింది. అదివరకే స్త్రీ సమాజస్థాపనకు ప్రయత్నిస్తున్న విదుషీత్రయం శేషమాంబ,నరసమాంబ,అచ్చమాంబగార్లు పంతులుగారితో తమ అభిలాష వెల్లడించారు. పంతులుగారికంతకంటె ఆనందకరమైన విషయమేమున్నది? వారి సంకల్పమునకెంతో సంతోషించి తక్షణం సమాజస్థాపనకు వలయు నియమావళి వగైరాలు తయారుచేసి సుముహూర్తం నిశ్చయించారు. 1910 సంవత్సరం సెప్టెంబరు 4 తేదీని శ్రీ వీరేశలింగంపంతులుగారి సమక్షాన విద్యార్థినీ సమాజం స్థాపితమయింది. సంవత్సరం తిరగకముందే విద్యార్థినీ సమాజము రిజిష్టరయింది. శేషమాంబగారు దానికి కార్యదర్శినిగా నియమితులైనారు. సమాజస్థాపన కాగానే దాని పురోభివృద్ధికి ముఖ్య ప్రతిబంధకంగా ఏర్పడేది గృహము, సమాజానికి సొంతభవనముంటూ లేకపోతే ఏ అభివృద్ధి కార్యమూ తలపెట్టడానికి వీలుండదు. కాకినాడ గ్రేజరుపేటలో 17 వందల గజముల నివేశనస్థలమును గృహముతోగూడా కొని ఆసమస్యను క్షణంలో తీర్చివేశారు శేషమాంబగారు. ఈగృహం కొనే నిమిత్తం శేషమాంబగారి భర్త సుందరరామయ్య పంతులుగారు అడ్వాన్సు నిమిత్తం రు. 1400-0-0 లు సొంతంగా నోటువ్రాసి తెచ్చి యిచ్చారంటే శేషమాంబగారికి భర్తగారి ప్రోత్సాహ సహాయములు ఎంతగా ఉండేవో తెలుస్తుంది. తరువాత విరాళములద్వారా సమాజ సభ్యురాండ్రు చాలా శ్రమపడి ఆ యింటిబాకీని పూర్తిగా తీర్చివేశారు.

ఈనాటికీ ఆంధ్రదేశంలో స్త్రీ సమాజస్థాపనంటే గడువిషయంగానే ఉంటున్నది. పురాణాలకు, హరికథలకు, భజన కాలక్షేపాలకు, ధారాళంగా వెళ్ళే మన తెలుగు స్త్రీలు స్త్రీ సమాజాలకు యెక్కరు. వానికి ధనసహాయం చేయరు. పై కాలక్షేపములన్నీ పుణ్యప్రదమైనవనిన్నీ, ఈ సమాజాలన్నీ కేవల ఐహిక కార్యకలాపాలతో కూడుకున్నవి గనుక నిష్ప్రయోజనమైనవనీ వారి తలంపు. స్వార్థవిరహితమైన సేవంతా పుణ్యప్రదమైనదేననీ, దానివల్ల పుణ్యం వచ్చుటకు లోపం వుండదనీ, వారికి తోచదు. ఈ మహాశయం స్త్రీజనంలో యిప్పటికీ మృగ్యంగానే ఉంటున్నప్పుడు నలభైఅయిదేండ్ల క్రిందట స్త్రీ సమాజం స్థాపించిన శేషమాంబగారు పూర్వాచార పరాయణులైన స్త్రీ పురుషుల ప్రతిఘటనలకు ఆక్షేపణలకు ఎంతగా గురైనారో మనం ఊహించుకోవచ్చును. అట్టి అవరోధాలు లెక్కచేయకుండా ఆమె అనతికాలంలోనే దానికి సొంత భవనావరణలు కూడా సమకూర్చారంటె ఆమె సామర్థ్యము కార్యదీక్ష ఎట్టిదైంది విశదమవుతుంది.

హిందూ సుందరి పత్రిక: ఎంత గొప్పగా నడిచినా విద్యార్థినీ సమాజము స్త్రీల నిమిత్తంచేసే సేవ కాకినాడ నగరమునకు మాత్రమే పరిమితమయింది. శేషమాంబగారి విశాల హృదయము యావదాంధ్ర మహిళాలోకమును ఉద్బోధింప ఉత్సాహపడుచున్నది. ఆమె ఈ సమాజంతోనే ఏవిధంగా తృప్తిపడగలదు? స్త్రీలందరితో పరిచయం కలుగచేసుకొని ప్రబోధించవలెనంటే దానికి పత్రికాస్థాపనకన్న వేరు మార్గం లేదు. ఆ రోజుల్లో పశ్చిమ గోదావరి జిల్లా కంతేరు వాస్తవ్యులు సత్తిరాజు సీతారామయ్యగారు చిన్న అచ్చుకూటమిపెట్టుకొని స్త్రీల నిమిత్తం 'హిందూ సుందరి' అను మాసపత్రికను నడుపుచుండిరి. వారు

ఆ పత్రికను అచ్చువేసిరి. శేషమాంబగారు కూడా సత్తిరాజువారి ఆడపడుచే, పశ్చిమ గోదావరి జిల్లా వేలివెన్ను ఆమె పుట్టిన ఊరు. సత్తిరాజువారితో ఉన్న సంబంధం ద్వారా సీతారామయ్యగారి అభిప్రాయం తెలుసుకొని ప్రియమిత్రులైన మాడభూషి చూడమ్మ, వడింపల్లి సుబ్బమ్మగార్లతో కూడా కంతేరువెళ్ళి వెయ్యి రూపాయలకు ముద్రణాలయంతో హిందూ సుందరిని కొని కాకినాడలో హిందూ సుందరి మాసపత్రికను నడుపసాగిరి.

రాజ్యలక్ష్మి గ్రంథాలయము :

సేవాసక్తమైన హృదయము ఏదో ఒక పని పెట్టుకొని దానితోనే గుడుగుడు గుంజము లాడుతూ ఉండలేదు. ఎప్పటికప్పుడు క్రొంగ్రొత్త శోభతో అనలు కొమ్మలు వేసుకొని విస్తరిల్లెడి లతాద్రుమంవలె దానిని క్రొత్త క్రొత్తగా రాటలువాలి విస్తరింపజేస్తూ ఉంటేనే వారి కానందము. శేషమాంబగారికి సమాజమునందు గ్రంథాలయము గూడ ఉన్న బాగుండునని క్రొత్త తలంపొకటి మరల ఉదయించింది. శేషమాంబగారి సంకల్పమునకు ఆచరణకు, ఎడ ఉండదు. ఆమె గ్రంథాలయ స్థాపన సంకల్పమును వీరేశలింగం పంతులుగారికి వెల్లడించారు. ఆయన వారి ప్రయత్నమునకు చాలా సంతోషించి స్వవిరచిత గ్రంథాలన్నీ బహూకరించారు. చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు కూడా తమ గ్రంథాలు యిచ్చారు. ఇంకా ఎందరో వదాన్యులు గ్రంథములు బీరువాలు ధన సాహాయ్యం కూడా చేశారు. ఆ గ్రంథాలయం వీరేశలింగం పంతులుగారి సహధర్మిణి అయిన శ్రీమతి రాజ్యలక్ష్మమ్మగారి పేర స్థాపించవలెనను సముచితమైన తలంపు శేషమాంబగారికి కలిగింది. సంకల్పశుద్ధిగల శేషమాంబగారి ప్రయత్నంవల్ల రెండు వేల గ్రంథాలతో రాజ్యలక్ష్మి గ్రంథాలయం వెలిసింది.

మహిళా విద్యాలయము :

బాలికలకు ఉన్నత పాఠశాలలు లేకపోలేదు కాని అవి ధనసాధ్యమైనవి. వాని జీతం వగైరా ఖర్చులకు సామాన్యులు తట్టుకోలేరు. అనాథ స్త్రీ లెందరో జీతాలు కట్టి చదువుకోలేక నానా అవస్థలు పడటం శేషమాంబగారి దృష్టికి తగిలింది. ఇటువంటి యువతుల నిమిత్తం ఒక విద్యాలయం స్థాపించవలెననే అభిప్రాయం శేషమాంబగారి హృదయాన అంకురించింది. తక్షణమే ప్రభుత్వమువారి ప్రాచ్యవిద్యా పరీక్షలకు తయారుచేయు విద్యాలయం ఆమె స్థాపించారు. మరియు శేషమాంబగారికి సంస్కృతముపై మక్కువ యెక్కువ కనుక దానిని మహిళా సంస్కృత ప్రాథమిక పాఠశాలగా రూపొందించి గవర్నమెంటువారిచే రికగ్నిషన్ పొందారు. తోడ్తోనే హిందీ, కుట్టు, సంగీతము, నూలు వడకుట మొదలైన శాఖలుగూడ అందు స్థాపింపబడినవి. ఈ బడికి దూరపు పేటల నుండి విద్యార్థినులను తోడ్కొనివచ్చుటకు శేషమాంబగారు స్వయంగా బండి పెట్టుకొని యింటింటికి వెళ్లుచుండిరనిన శేషమాంబగారి కార్యాసక్తి వివరం కాగలదు.

ఈవిధంగా ఒకదాని వెనుక ఒకటి క్రొత్త క్రొత్త శాఖలు స్థాపిస్తూ వాని పోషణ, నిర్వహణ, కార్యములందే నిమగ్నురాలై యుండి శేషమాంబగారు దేశంలోని యితర ఉద్యమములను గమనించలేదని మనం భావించరాదు.

మహాత్మాగాంధీగారిచే నడుపబడిన నిరాకరణోద్యమములో పాల్గొని, మద్యనిషేధము, విదేశవస్త్ర బహిష్కారము మొదలైన కార్యక్రమాల్లో అఖండంగా పనిచేసింది. విదేశవస్త్ర దుకాణములవద్దను, కల్లంగళ్ళ వద్దను పికెటింగులు చేస్తూ ఊరేగింపులు చేస్తూ ఎల్లెడల తానై ప్రవర్తించిన ఆమెను కాకినాడ పౌరులు మరువలేరు. తమ తోటలో ఉన్న తాటిచెట్ల నామె గీతగీయడం మాన్పించింది. కాకినాడలో కాంగ్రెసు జరిగినప్పుడు స్త్రీ వలంటీరు దళనాయకురాలుగా పనిచేసిన నారీరత్నము శేషమాంబగారే. మద్రాసు బెల్గాం వగైరా ప్రదేశములలో జరిగిన కాంగ్రెసులకు శేషమాంబగారు వెళ్లి ఉన్నారు. లవణ సత్యాగ్రహం దినములలో స్త్రీ సత్యాగ్రహులకు నాయకురాలై సముద్రతీరమునకు వెళ్లి ఉప్పు తయారుచేసి ఆ ఉప్పును విక్రయించి మహాత్మ గాంధీకి పంపించింది. ఇన్ని చేసినా శేషమాంబగారు ఏలనో శ్రీకృష్ణ జన్మస్థానమునకు వెళ్లలేదు.

కాకినాడ మ్యునిసిపల్ కౌన్సిలరుగా ఉండి శేషమాంబగారు పవరుహౌసు కట్టుటకున్నూ, రామారావుపేటలో ఆయుర్వేదవైద్యశాల పెట్టుటకున్నూ ఇతరిత ర ప్రజాసౌకర్యాలెన్నో కల్గించడానికి ఎంతో కృషి చేసింది.

ఆమె బహువిధసేవను గుర్తించి డాక్టరు కె. యస్. కేసరిగారు 1939 గృహలక్ష్మి స్వర్ణకంకణమిచ్చి సత్కరించారు. మద్రాసు ఆంధ్రమహిళా సభవారును 1942లో విదుషీ సన్మానం చేశారు. అవధులు లేని శేషమాంబగారి బహువిధ సేవకు సన్మానములనే కొలత బద్దలు అనవసరమే అయినా ఇది సన్మానం పొందినవారికంటె చేసినవారికే గౌరవం కలిగిస్తుంది.

శేషమాంబగారు మంచి చదువరి అని మొదటనే చెప్పాను. నర్సాపురం స్త్రీల బహుమతి పరీక్షలోను విజ్ఞానచంద్రిక పరిషత్పరీక్షలోను కృతార్థులైనారు. చిన్నయసూరి పంచతంత్రమును మించిన ప్రౌఢశైలిలో ఆమె వ్రాయగలిగి ఉండేవారు. కవిత్వంగూడా చెప్పేవారు. అయినా ఆమె కవయిత్రిగా గణనకు రాలేదు. ఆమె ప్రత్యేకముగా వ్రాసిన గ్రంథములు లేనప్పటికి, బహువిధ వ్యాసంగములవల్ల ఆమె సాహిత్యపరంగా విశేషకృషి చేయలేకపోయినప్పటికీ, హిందూసుందరి కామె వ్రాసిన సంపాదకీయాది వ్యాసాలు, బరంపురం మొదలు మద్రాసువరకు అనేకపట్నములలో జరిగిన స్త్రీలసభలకు అధ్యక్షురాలై ఆమె చేసిన ప్రసంగాలు ఎన్ని సంపుటాలకైనా మెక్కవచ్చును. పద్యములే గాక వచనముగూడా కవిత్వమునకే చెందితే ఆమె కవయిత్రీ తిలకమనడానికి సందేహం లేదు.

శేషమాంబగారు యిన్ని సంస్థలు స్థాపించి యిన్ని విధముల సేవ జేయడానికి భర్తగారి ప్రోత్సాహమే గాక, మిత్రురాలు మాడభూషి చూడమ్మగారి తోడ్పాటు ఎంతో ఉన్నది. ఎవరైనా సరైన సహచర భాగ్యము కలిగినప్పుడే తాము అనుకున్న కార్యము జయప్రదంగా నిర్వహింప కలుగుతారు. చూడమ్మగారు గొప్ప విదుషి. విజ్ఞానచంద్రికాపరిషత్పరీక్షలో నూటపదారులంగొన్న విద్యావతి. హిందూసుందరికి సంపాదకీయాలు వ్రాయడం మొదలుకొని కంపోజింగు చేసి అచ్చు కొట్టడం వరకు స్వయంగా చేయగల సమర్థురాలు. ఏ పనినీ వీరుభయులూ కలిసి చేసేవారు. శేషమాంబగారు సంకల్పమైతే చూడమ్మగారు క్రియ. సంస్థల నిర్వహణలో శేషమాంబగారికి చూడమ్మగారి తోడ్పాటు ఇంతా అంతా గాదు. చూడమ్మగారు అనాథ స్త్రీలనెందరినో సహాయం చేసి వారికి స్వతంత్ర జీవనం అలవరింప చేశారు. సమాజం విషయంలోనే గాదు. ఇంటి విషయంలో కూడా శేషమాంబగారికి చూడమ్మగారు కుడిభుజమే. ఆ స్నేహసౌహార్ద్రమెంత బలీయమైనదో చెప్పలేము. మహాలక్ష్మి సుందరికి శేషమాంబగారు కన్నతల్లి. చూడమ్మగారు పెంపుడు తల్లి. చిన్నతనంలో పెంచడమే గాదు, ఆమె బెనారసులో చదివే రోజుల్లో కూడ వెంట ఉండి ఆమెకు భోజన భాజనాదుల్లో ఎటువంటి ఇబ్బంది లేకుండ చూడమ్మగారు సాకినది.

శేషమాంబగారికి చిరకాలము సంతానము లేదు. సేవావ్రతమైన శేషమాంబగారికా చింతా లేదు. ఆమె సంస్థలే ఆమె సంతానము. వాని లాలన పాలనలోనే ఆమె నిమగ్నురాలై ఉండేది. భర్తగారి సోదరుల బిడ్డలు వారి యింటనే ఉండి చదువుకుంటూ ఉండేవారు. వారికి చదువులు

★ స్వర్గీయ బాలాంత్రపు శేషమాంబగారు ★

చెప్పించడమును పెండ్లిండ్లు చేయడమును అత్తివారిళ్లకు పంపడమును ఈ కార్యకలాపాలతో వారికి పిల్లల ముచ్చట తీరుతూఉండేది. అయినను భగవంతు డామెకు మాతృత్వమును ప్రసాదింప అనుగ్రహించెను. ఫలమున్నను భాగ్యమున్నను తప్పదన్న సామెతగా కాపురమునకు వచ్చిన యిరవై యేండ్లకు నలుబదవ పడిలో భగవంతుడు వారికి ఒక కొమార్తెను ప్రసాదించాడు. మహాలక్ష్మి సుందరి అని ఆ అమ్మాయికి నామకరణం చేశారు. అయిదవయేట ఆ బాలకు తమకు అత్యంతాప్త మిత్రురాలును ఆర్షధర్మానురాగియు అయిన శ్రీమతి కాంచనపల్లి కనకాంబగారిచేత గీర్వాణ భాషలో అక్షరాభ్యాసం చేయించారు. మహాలక్ష్మి సుందరి క్రమంగా విద్యాభ్యాసం చేసి తలిదండ్రులకు ప్రియతమమైన గీర్వాణ భాషలో ప్రవీణురాలై ఆపై బెనారసు మెట్రిక్యులేషన్ పరీక్షలోను ఎఫ్ యే పరీక్షలోను కృతార్థురాలై మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలయందు సంస్కృతమున ఆనర్సు పరీక్షయందుత్తీర్ణయై, మరల ఆంధ్రమున కూడ ఎం. ఏ. కు చదివి జయమంది డబుల్ ఎం. ఏ. ఐ ఆంధ్ర యువతీమణులలో సంస్కృతాంధ్రముల రెంటను ఎం. ఏ. పరీక్షనిచ్చిన యువతీరత్న మీమియే అనిపించుకున్నది.

మహాలక్ష్మి సుందరి వివాహ విషయంలో కూడా శేషమాంబ దంపతులు ఆదర్శంగానే ప్రవర్తించారు. ఆనాటికి రజస్వలానంతర వివాహాలు పరిపాటిగా జరగకపోయినా మహాలక్ష్మి సుందరికి యుక్తవయస్క అయిన తర్వాతనే పెండ్లిచేశారు. అల్లుని తెచ్చుకోవడంలో కూడా తను కున్నది సర్వస్వ మర్పించి తలకు మీరిన వియ్యాలవారిని తెచ్చుకొని తంటాలు పడకుండా సామాన్య కుటుంబానికి చెందినవాడున్నూ, తమ బంధువర్గంలోనివాడును, తమ యింటనే ఉండి చదువుకొని తమ ఆదర్శముల కనుగుణమైన భావాలుకలవాడును, యోగ్యుడూ సరసుడు బి.ఏ. పరీక్ష నిచ్చినవాడూ అయిన కాళ్ళకూరి శేషయ్య పంతులుగారి కిచ్చి వివాహం చేశారు. కూతురు అల్లుడు ఏలూరులో ఉద్యోగాలు చేస్తూ సుఖంగా ఉన్నారు. మహాలక్ష్మిసుందరి ప్రబోధసుధాకర మనే శంకర భగవత్పాదులవారి గ్రంథం తెలుగులోను, మహిళా మర్యాదా అను గ్రంథం సంస్కృతంలోను వ్రాసింది.

ఇంతలో శేషమాంబగారి భర్త సుందర రామయ్య గారు స్వర్గస్థులైనారు. శేషమాంబ గారికి తలకుమీరిన దుఃఖం ఏర్పడ్డది. ఈలోపుగానే ఆదినుండి తనకు సమస్త విషయాల్లో చేదోడువాదోడుగా ఉన్న ప్రియ మిత్రురాలు చూడమ్మగారు కూడా పరమపదించింది. ప్రేమాస్పదుడైన జనకుని వియోగానికినీ, పాలకమాతయైన చూడమ్మ గారి వియోగానికినీ దురపిల్లుచు కూడా మహాలక్ష్మీసుందరి ధైర్యం వహించి ఆధ్యాత్మిక విషయబోధనద్వారా తల్లికి దుఃఖోపశమనం చేస్తూవచ్చింది. ఆ అండ అయినా శేషమాంబగారికి లేకుండా ఉండుటము విధి నిర్ణయం కాబోలు. తండ్రి పోయిన రెండు సంవత్సరాలకు విషజ్వర పీడితురాలై మహాలక్ష్మీసుందరి కూడా మరణించి తల్లిని దుఃఖ సాగరంలో ముంచివేసింది. లేక లేక కల్గిన ఏకైక పుత్రిక, సర్వవిద్యా విభూషిత ఇరువదైదేండ్లు నిండీ నిండక మునుపే మరణించినప్పుడు శేషమాంబగారి దుఃఖము ఎంత అత్యధికమో ఎవరు చెప్పగలరు? మహాలక్ష్మీ సుందరమ్మ చనిపోవడం చూస్తే మన ప్రతి కథల్లో చెప్పినట్టుగా శేషమాంబగారు పూర్వజన్మలో బిడ్డలకొఱకై ఏ పార్వతీ పరమేశ్వరులనుగురించో తపస్సు చేయగా వారు ప్రత్యక్షమై అల్పాయుర్దాయముగల విద్యావతి కావలెనా? దీర్ఘాయుర్దాయముగల అవిద్యావతి కావలెనా అని అడుగగా విద్యాభిమానియైన శేషమాంబగారు అల్పాయువైన విద్యావతి నే కోరియుండెనో, లేక విద్దెలరాణియైన సరస్వతీదేవి ఏ శాపవశం వలననో మర్త్యలోకంలో పుట్టవలసి స్త్రీవిద్యా ప్రియులైన శేషమాంబా దంపతుల గర్భశుక్తి ముక్తాఫలమై జన్మించియుండెనో అనిపిస్తుంది. సహజంగా ధైర్యశీల అయినను శేషమాంబగారు ఈ కడుపు శోకంతో క్రుంగి కృశించిపోయింది. అవిరామంగా వెడలే దుఃఖాశ్రుధారలతో శేషమాంబగారి కన్నులు బాగా జబ్బిచ్చినవి. శేషమాంబగారి బంధువులు మిత్రులు ఆమె నెఱిగిన పండితులు కవులు విదుషీమణులు ఎన్నో విధముల వోదార్చారు. కాని అటువంటి పుత్రీరత్నాన్ని కోల్పోయి ఆమె ఊరట చెందడం సామాన్యమా!

ఆమె సర్వస్వమనుకున్న కొమార్తె విడచి వెళ్లిపోయింది. తనకో పెద్దతనం వచ్చింది. కళ్ళు పని లేవు. ఈ పరిస్థితిలో తన ముందు సంగతేమిటో తేల్చుకోవలసిన భారం శేషమాంబగారిపై పడ్డది. ఉదారసంస్కరణలకు సుముఖురాలైనప్పటికి శేషమాంబగారి హృదయమున ప్రాచీన సంప్రదాయముల దెస విశ్వాసం పూర్తిగా లోపించలేదు. పెద్దతనము వచ్చినకొద్దీ సంతులేనివారు తమ సద్గతుల విషయమై జిజ్ఞాసపడటము, వానికేదైనా ఇతర ప్రయత్నాలు చేసుకోవడము మన దేశంలో పరిపాటి. శేషమాంబగారిలో కూడా ఈజిజ్ఞాస రేకెత్తింది. చాలాకాలం సంతానం లేకుండా ఉండటంవల్ల బావగారి బిడ్డలను తెచ్చి చదువులు చెప్పించడం పెళ్ళిళ్లు చేయడము వారి కిదివఱకే అలవాటు. వారుకూడ ఆమెయందు మాతృభక్తితో మెలగేవారు. కనుక మొదటినుండి తమ కెవరు ప్రాపుగా ఉండేవారో, ఆ బావగారి కొమారుని పుత్రుని తాను దత్తు చేసుకొనుటకును, ఆదత్తపుత్రుడి పేరి నే తమ అల్లుడు శేషయ్యపంతులు కిచ్చునట్లును ఏర్పాటు చేసింది. తమకున్న పొలము ఇల్లును అల్లుడికినీ, మహాలక్ష్మి సుందరమ్మ పేర విద్యార్థివేతన మిచ్చుటకై త్రిలింగ విద్యాపీఠమునకు ఒక ఎకరమున్న ఇచ్చినది. మిగతాది దత్తుడికి యిచ్చివేసింది. మహాలక్ష్మి సుందరమ్మపేర తను విద్యాలయంలో కూడ ఒక విద్యార్థినీ వేతనం ఏర్పాటుచేసింది.

ఇక ఆమెకు కావలసినదేమి? జీవితమంతా లోకసేవకే వినియోగించింది. కాశీ రామేశ్వరాది యాత్రలు చేసుకున్నది. పురాణ కాలక్షేపంతోను తత్వవిచారంతోను చరమకాలం గడిపివేసింది. ఇన్ని క్లిష్టపరిస్థితులలోను ఆమె తన సంస్థలను విడనాడలేదు. చనిపోవువఱకు విద్యార్థినీ సమాజానికి ఆమే అధ్యక్షురాలు. ఆమె సంస్థలన్నీ రజతోత్సవాలు చేసుకున్నవి. తమ సంస్థల నిర్వహణభారం ఒప్పగించిన శ్రీమతి వేమగంటి పాపాయమ్మగారికి తన అమూల్యసలహాలతో తోడ్పాటు ఇస్తూ సంస్థలు చక్కగా నడిచేటట్లు కనిపెట్టి ఉంటూ ఈ సేవలోనే 77 సంవత్సరాల నిండు వార్ధక్యంలో శేషమాంబగారు కన్ను మూసింది.

శ్రీమతి శేషమాంబగారు ఆంధ్రమహిళాలోకానికి చేసినసేవ కొలపెట్టరానిది. ముఖ్యంగా కాకినాడ మహిళామండలికి ఆమె జీవితమే ధారపోసినది. కాకినాడ పుర స్త్రీలు సాంఘికంగా విద్యావిషయకంగా ఏమైనా అభివృద్ధి చెందారంటే, అది శేషమాంబగారి ఘనమైన కృషి ఫలితమేనని చెప్పాలి. శేషమాంబగారికి ఉచితమైన స్మారకచిహ్నం ఏర్పాటుచేయడం కాకినాడ పౌరుల కనీసధర్మం. మహనీయ వ్యక్తియైన శేషమాంబగారి ఆత్మకు భగవానుడు శాంతిని ప్రసాదించుగాక. వారి పవిత్రాత్మకు నా భక్తిపూర్వక నమస్సులు. ★



షెబారాణి

వజ్రపాణి

షెబారాణి సౌందర్యం,
షెబారాణి వయ్యారం,
షెబారాణి తెలివీ - ప్రజ
'షెబా'ననుచు కీర్తింతురు!

ఆమెను పెండ్లాడుటకై,
అవనిపతులు, రాజులు, రా
రాజులెల్ల యత్నించి, ని
రాశ చెందినారు తుదకు!

అందములో, చందములో,
చందమామవంటి రాజు,
సోలమన్ తెలివితేటలు
చాలగ పొగడెదరు జనులు!

పురుషులలో సోలమనూ,
తరుణులలో షెబారాణీ,
సరిసమానులనెడు వార్త
తఱచు వినెను షెబారాణి.

ఆమెకు కలిగిన దసూయ!
ఆ మేదినిపతిని ఓడ
జేయవలెనటంచు ఆమె
చిత్తములో తలపోసెను!

రూపములో, వాసనలో,
రోజావలె కనిపించెడి
ఓ గులాబిపూవు నామె
కాగితములతో జేసెను!

ఆ గులాబి ఒక్క చేత
అసలు గులాబి ఒకచేత
పట్టి - మందహాసముతో
సోలమన్ నృపాలుని కా
సుందర పుష్పములు రెండు
నొసగి, "మహారాజా! ఇం
దసలు పుష్పమేది?" అనెను.

రెండుపూలు ఒకేరీతి
నుండుటచే ఆ నరపతి
సమాధాన మీయలేక
చాలా తికమకలు పడెను!

అంతలో నెచటనుండియొ
వింతగ నొక తేనెటీగ
వచ్చి, ఒకే పుష్పముపై
వ్రాలి, తేనె గ్రోలసాగె!

"అదే అసలు గులాబి!" అనె
అవనీపతి; షెబారాణి
తలవంచెను సిగ్గుతోడ,
తన అపజయ మొప్పుకొనెను!



కథాగేయ సుధానిధి

1

సకలజంతు సంతానముతో
సందడించు సంకులవనమున
సభజేసిన వన్యజంతువులు.

2

"అసలి సింహమునకు మనపై
అధికారము నెవరొసంగిరో"
అని మర్కట మొక్కటి పలికెను.

3

"తమాయించి తర్కించినచో
సమానములు సర్వజీవు" లని
అమాయికపు హరిణము పలికెను.

4

"నిజము నిజము నీ సిద్ధాంతము
ఋజువక్కరలేదు దాని"కని
ఋజము లెగురవేసెను ఉష్ట్రము.

5

"అన్యాయము నరికట్టుటకై
అన్యోన్యముగా మెలగుద"మని
వన్యాశ్వము ప్రతిపాదించెను.

6

సింహపు పరిపాలన మికపై
చెల్లదనుచు తీర్మానించెను
చిన్న చిన్న జంతువులన్నియు.

7


మరునా డీ సభసంగతి విని
సరదాగా నవ్వుచు సింహము
పరిహాసముగా నిటులన్నది:

"ప్రయోజనము శూన్యముగానీ
ప్రసంగములు పసందైనవే!"

ఈ సప్తపదులు: 12

నండూరి రామమోహనరావు





26

చుట్టూ అంతా చాలా నిశ్శబ్దంగా ఉన్నది. మార్గరెట్ అలాగే పండుకొని ఉన్నది. షావలిన్, అనుచరులతోసహా వెళ్ళిపోయి బండి ఎక్కాడు. రాతినేలను ఒరుసుకుంటూ బండి చక్రాలు కిర్రుమన్నాయి.

సముద్రంమీదినుండి వస్తున్న చల్లనిగాలులకు ఆమె ప్రాణం కొంత తేరుకున్నది. తానక్కడికి రావటం, ఆ కొండరాళ్ల మీద ఆసమయంలో అలా పడిఉండటం అంతా నిజమేనా లేక ఏదయినా కలా అనిపించింది. ఏవిషయము ఆమెకు సరిగా తెలియకపోవటంవలన మహాబాధ పడసాగింది.

పెర్సీ షావలిన్ చేతులలో చిక్కిపోయినాడా?

ఆర్మండ్ సంగతి ఏమయినట్లు?

ఏమో?

మరొకప్రక్కన ఆమెకు కాళ్లు చేతులు పీక్కుపోతున్నాయి. ఒళ్ళంతా నలగగొట్టినట్లు నొప్పులు పెడుతున్నది.

బండి చాలాదూరం పోయి ఉండాలి. ఇంతలో నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ మరొక కంఠస్వరం వినిపించింది. అది విని, మార్గరెట్ ఆశ్చర్యపోయింది.

"అమ్మయ్య! వెధవది — ఇంత బ్రతుకు బ్రతికి..."

మార్గరెట్ సంతోషపడింది. ఎవ రది? సర్ పెర్సీ! ఎక్కడనుండి మాట్లాడుతున్నాడు. ఈ లోకంలోనా, పరలోకంలోనా తాను ఉన్నది. లేక సర్వదా అతనినిగురించే ఆలోచిస్తూఉండటంవలన తనకలా వినిపిస్తున్నదా? తన చెవులు తాను నమ్మలేకుండా ఉన్నది. ఎలాగో ఓపికచేసికొని, సగం పైకి లేచి, చుట్టూ చూసింది. ఎవరూ లేరు! మళ్లీ అంతా నిశ్శబ్దం!!

తనకేదో కునుకు పట్టిఉండాలి; ఆ మగత నిద్రలో తాను కలవరించి ఉండవచ్చు అనుకున్నది మార్గరెట్.

"అబ్బ! ఇంతకంటె ఛండాలపు కర్మ మరొకటి ఉండదు. వెధవలు, కొంచెం మెల్లిగా కొట్టి ఉండవలసింది!"

ఈసారి ఆమె ఆశ్చర్యానికి అంతులేకపోయింది. అలాగే లేచి నిలబడింది. పెర్సీయే మాట్లాడుతున్నది. సందేహం లేదు. కాని ఏడీ?

"ఛూత్! చచ్చే నీరసంగా ఉంది."

మార్గరెట్ శ్రద్ధగా విన్నది. చుట్టూ ఉన్న గుట్టలవైపు, ఆగుట్టమీదఉన్న కుటీరంవైపు చూసింది. తాను నిలబడినచోటనో, లేక ఆ ప్రక్కనో, ఏ గుహాయినా, రహస్యస్థలమయినా ఉండిఉండాలి అనుకుంటూ వెతుక నారంభించింది.

"పెర్సీ! పెర్సీ!! ఇక్కడ ఉన్నాను. రా! ఎక్కడ నీవు?" అని పిలిచింది.

"నీవు పిలవటమైతే పిలిచావు. బాగానే ఉంది. నేను రావద్దూ? నేను లేవలేకుండా ఉన్నా. నీవే రా! ఇంతబ్రతుకుబ్రతికి ఆ వెధవల చేతుల్లో దెబ్బలు తినవలసి వచ్చింది. బొత్తిగా ఓపిక లేదు. ఇలా రా!"

అప్పటికీ ఆమెకు దిగ్భ్రమ వదలలేదు. మాట వినిపిస్తున్నది. మనిషి కనిపించడు. అక్కడ ఎవరూ లేరు...ఆ రాత్రిపక్కన దెబ్బలు తిని పడిఉన్న యూదు తప్ప!

యూదు బోరగిలపడి ఉన్నాడు. క్రిందినుండి లేవాలని విశ్వప్రయత్నం చేస్తున్నాడు.

మార్గరెట్ అతనిదగ్గరకు పరుగెత్తింది. తల రెండుచేతులతో ఎత్తి ఒడిలో పెట్టుకున్నది. అతని కళ్ళలోకి చూసింది. ఆ కళ్ళల్లో బడలిక లేదు. నిరుత్సాహం లేదు. మంచితనం ఉదాత్తస్వభావం తొణికిసలాడుతున్నాయి.

"పెర్సీ! పెర్సీ! నీవేనా? పెర్సీ!" అన్నది మార్గరెట్, అశ్రువులు నిండిన కళ్ళతో, తడి ఆరిన గొంతుకతో.

"ఆహా! చూడు ఆ వెధవలు చేతులు రెండూ కట్టేశారు. కాస్త ఊడదీస్తావేమిటి?"

మార్గరెట్ దగ్గర చాకూ గీకూ ఏమీ లేవు. అలాగే పళ్ళతో, వ్రేళ్ళతో పెనగులాడి ఊడదీసింది. కన్నీళ్ళతో అతనిని అభిషేకం చేసింది.

కట్లు విప్పగానే పెర్సీ కుప్పల్లే కూలిపోయినాడు. మార్గరెట్ భయంతో, ఆందోళనతో అటూ ఇటూ చూసింది. ఈ దరిద్రపుగుట్టమీద కాసిని నీళ్ళయినా దొరకవుకామోసు!" అన్నది.

పెర్సీ చిరునవ్వునవ్వాడు. "నీళ్లెందుకు? ఇటువంటప్పుడు గనుక కాస్త ఫ్రెంచి బ్రాందీ ఉంటే చాలు. ఆఁ! ఈ మురికి అంగరఖా జేబులో చూడు ఒక సీసా ఉంటుంది. అబ్బ! ఏమీ కదిలే ఓపిక లేకుండాపోయింది. వెధవది!"

తాను కాస్త త్రాఁగి, తక్కినది ఆమెచేత త్రాగించాడు.

"అదీ! ఇప్పుడు కాస్త నయం! కాదూ? సర్ పెర్సీబ్లాకనీని ఇటువంటివేషంలో ఎప్పుడయినా చూశావా? భలేవేమంలే! ఈ జుట్టు చూడు..." అంటూ నవ్వుతూ విగ్గుతీసేశాడు.

"పెర్సీ! జరిగినసంగతి నీకు తెలిస్తే..."

"ఓ! అంతా తెలుసు. అంతా!"

"నన్ను క్షమించగలవా పెర్సీ?"

"ఎంతమాట ? క్షమించటమా ? నేను...! నాకోసం ఎంత కష్టపడ్డావు? ఎంత సాహసం చూపిం చావు? ఆనాడు గ్రెన్విల్ విందులో అలా జరిగినప్పటి నుండి...."

"అయితే నీకు మొదటినుంచి తెలుసునన్న మాట"

పెర్సీ మెల్లిగా నవ్వాడు: "ఆఁ! మొదటినుంచి నిజం మార్గరెట్! నీవు ఇంత మంచిదానివని, ఇంత గొప్ప హృదయం గలదానివని నాకు తెలిసి ఉంటేనా నీకు ఇంత ఇబ్బంది కలిగేదే కాదు. అవునా?"

ఇద్దరూ ప్రక్క-ప్రక్కగా ఆరాతి నానుకొ కూర్చున్నారు. పెర్సీ తల ఆమె బుజంమీద ఆని చాడు.

"కుంటివాడు గుడ్డివాడికి దారి చూపించి ట్లయిందికదూ? అబ్బ! నీపాదాలు ఎంత కందిపోయి నాయి? చూడు." అంటూ పెర్సీ ముందుకు వంగి ఆమె చిన్నిపాదాలు రెండూ చేతిలో పెట్టుకొని ముద్దు పెట్ట కున్నాడు.

మార్గరెట్ గుండె ఆనందంతో నిండిపోయింది ఇంతలోకే ఆర్మండ్ మాట గుర్తు వచ్చింది.

"అయ్యో. ఆర్మండ్...!"

"భయంలేదు. కులాసాగా ఉన్నాడు. ఇదుగో మనం వెళ్ళి కలుసుకుందాము. రిచ్‌మండ్‌లో ఉండగా

ఏమి చెప్పాను నేను? అర్మండ్ కేమీ భయంలేదు. సురక్షితంగా తీసుకువస్తానన్నానా? మరి?"

"నాకంతా ఆశ్చర్యంగా ఉన్నది. ఎలా తప్పించుకుపోయినారు వాళ్లు?"

"ఏముంది. చాలా తేలికగా పని అయింది.

ఆ తెలివితక్కువ వెధవ షావలిన్ ఉన్నాడే నాకోసం మహా అవస్థ పడుతున్నాడు. ఎందుకయినా మంచిది. నేనూ వాడినే అంటిపెట్టుకుని ఉండాలి అనుకున్నాను. పైగా ఆ హోటలులో వాడికి టోకరా యిచ్చినతరువాత వాడు ఎటూ నాకోసం ఇక్కడికి వస్తాడని తెలుసు. నేను ఏ రోడ్డువెంట బయలుదేరినా, వాళ్ళ చేతిలో చిక్కిపోవటం తథ్యం. ఎలాగైనా, ఇంగ్లిష్‌బుట్టి ఫ్రెంచిబుట్టకు తీసిపోయేదేమీ కాదు చూడు.

యూదు వేషంవేస్తే వాళ్లు నన్ను పోల్చుకోలేరు. అందుకని రూబెన్ గోల్డ్‌స్టిన్ దగ్గరకు పోయి వాడిబండి, గుఱ్ఱం తీసుకున్నాను. సరమానప్పుడే కంటబడకుండా తెల్లవారేదాకా గడపమని చెప్పాను."

"మీవేషం చాలా అద్భుతంగా ఉన్నది. కాని షావలిన్ కాలాంతకుడుగదా! పోల్చుకొని ఉంటే...!"

"ఆటకట్టేది అంతే. ఆమాత్రం తెగింపు లేక

పోతే ఎలా! మనుష్యులస్వభావాన్ని నేను బాగానే అర్థంచేసుకోగలను. ఫ్రెంచివారికి యూదులంటే మంట, అసహ్యం; దగ్గరికైనా రానివ్వరు. పైగా నే వేసిన వేషం ఎలా ఉన్నది! పరమఅసహ్యంగా ఉన్నదయ్యో!

మొదట నేను ఎలా జరిగితే అలా జరుగుతుంది పోనిమ్మనుకున్నాను. కాని పావలిన్ భటులకు ఇస్తున్న ఆజ్ఞలు విన్నాక చాలా ధైర్యం వేసింది. ఫ్రెంచిభటులు ప్రాణంపోయినా చెప్పినమాట తు. చ. తప్పరు. ఇంగ్లిష్‌వాడు వచ్చేదాకా ఎవ్వడూ కదలడు.

జేక్ గాజ్ వాడి పుణ్యమా అని నన్ను తీసుకుపోయి ఆ గుడిసెప్రక్కనే కూలేశాడు. ఆ తరువాత నామాట ఏ వెధవా పట్టించుకోలేదు. అలాగే చేతులు కట్లు విప్పుకొని, ఒకకాగితంముక్కమీద కొన్ని ముఖ్యమైనవిషయాలు వ్రాసి లోపల పడేశాను.

అర్మండును లోపలివాళ్ళను అది చూసుకోగానే చప్పుడుచెయ్యకుండా జాగు చెయ్యకుండా జారుకొమ్మనిచెప్పి వ్రాశాను. హేడ్రీమ్‌నౌక తాలూకు బోటు ఉన్నచోటు గుర్తు వ్రాసి అది ఎక్కి పొమ్మన్నాను. వాళ్లు అలాగే చేశారు. వాళ్లు జారిపోవటం చూస్తూకూడా సైనికులు ఊరుకున్నారు. వారి నాయకునిమాట వారు జవదాటలేదు. వాళ్లు అలా పోయిన తరువాత అరగంటసేపు మాట్లాడకుండా ఊరుకొని పాటపాడాను. సరే, దానితో అంతా గల్లంతు అయిపోయింది. బస్!"

"కాని ఆ పశువులు నన్ను చాలా గట్టిగా కొట్టారు!"

"వాళ్ల బొంద! అది తప్పలేదు. నిన్ను విడిచిపెట్టి నేను ఎలా పోగలను? అందుకని వాళ్ళ చేతికి చిక్కవలసివచ్చింది. పోనిద్దూ! ఇంతలో మించిపోయిందేమిటి? ఆ పావలిన్ మళ్ళీ ఇంగ్లాండు రావాలి! అప్పుడు—అప్పుడు చక్రవడ్డీకట్టి వాడిబాకీ తీరుస్తాను. ఏమనుకున్నావ్?"

ఇద్దరూ నవ్వుకున్నారు.

ఉన్నట్టుండి మార్గరెట్ ఉలికిపడింది. ఆ సమయంలో ఆమె పడుతున్న సంతోషమంతా మాయమైంది. తాము కూర్చున్న రాతివెనుక అడుగుల చప్పుడైంది. ఒక చిన్నరాయి దొర్లుకుంటూవచ్చి ముందుపడింది.

"అమ్మో! అదెవరు?" అన్నది.

పెర్సీ నవ్వాడు. "మరేమీ లేదు. కంగారు పడకు. నీవు భలేదానివేనే! నీకెంతో సహాయంచేసిన వాడినే మర్చిపోయినావు. అతడు ఆండ్రూ!"

"ఓ! ఆండ్రూ."

"అవును. సాయంత్రం హోటలుముందు నాకతడు కనిపించి చెప్పాడు. నేను అతనికో చుట్టుదారి చెప్పి అదంతా తిరిగి ఇక్కడికి చేరుకొమ్మని చెప్పాను. ఆదారివెంట సాధారణంగా గస్తీ ఉండదు. సరిగా సమయానికి ఇక్కడికి చేరుకోవచ్చు. అదుగో సమయానికి వచ్చాడు. ఆండ్రూ చాలా మంచివాడు కాదూ? సుజేన్‌కు తగినవాడు అవునా?"

ఆండ్రూ మెల్లిగా సమీపించాడు. పెర్సీని చూడలేదు. మరేమీ ప్రమాదం ఉండదని నిబ్బరం చేసుకొని, "బ్లాకనీ! ఎక్కడ" అని మెల్లిగా పిలిచాడు. ఆతరువాత పెర్సీని చూశాడు. యూదువేషంలోఉన్న పెర్సీని గుర్తుపట్టక కంగారుపడ్డాడు.

★ స్కార్లెట్ పింపర్నల్ ★

పెర్సీ మెల్లిగా లేచి నిలబడి నవ్వుతూ "నేనేలే! ఎలా ఉంది వేషం?" అన్నాడు.

"తన్నదియ్యా! భలేమోతగా ఉంది."

"ఉంటుంది. ఉంటుంది. ఇంటికి పద. ముందు నీవీపు మోగిస్తాను. నిన్ను లండన్‌లో ఉండమని నేను చెప్పివచ్చానుగదా! ఇక్కడికి ఎందుకు వచ్చావు? ఫ్రాన్స్‌లో ఏంచేస్తున్నావు. చెప్పినమాట ఎగరేస్తున్నావా? చూడు ఏంచేస్తానో!" అన్నాడు బ్లాకనీ.

ఆండ్రూ హుషారుగా నవ్వాడు. "ఓశ్! అలాగే చేసుకుందురుగాని. నన్ను ఏంచేసినా ఫరవాలేదుకాని అసలు ఏమయినాచెయ్యటానికి మీరు ప్రాణాలతో బయటపడ్డారు. అదే పదివేలు. సరేగాని, ఈవేషం ఎక్కడ సంపాదించారు బాబూ!"

"ఎక్కడో అక్కడ. వెధవది! ఇంత బ్రతుకు బ్రతికి...!"

తెలతెలవారవస్తున్నది.

"ఆండ్రూ! మనం ఇంకా ఇక్కడ ఆలస్యం చెయ్యకూడదు. ఆ షావలిన్ ఎవరినైనా పంపిస్తాడేమో పదండి. పదండి." అని హెచ్చరించాడు పెర్సీ.

"కలే ఎలా వెళ్లగలం? ఎటు చూసినా బందోబస్తుఉన్నది." అని జంకుతూ అడిగింది మార్గరెట్.

"కలే? కలే ఎందుకు? దండగ! ఈ ప్రక్క వెళ్లాలి. ఒక అరమైలుదూరం. అంతే. మన పడవ మనకోసం అక్కడికి వస్తుంది."

"ఇక్కడికా?"

"అవును. అది ఇంకోతమాషా. ఆర్మండ్‌కు ఉత్తరంముక్క వ్రాసి పడేసినప్పుడు రెండోకాగితం కూడా ఒకటి పడేశాను. దాన్నిమాత్రం అక్కడే వదిలిపెట్టి పొమ్మన్నాను. దానిలో మనపడవ కలే దగ్గర మనకోసం ఎదురుచూస్తున్నట్లు వ్రాశాను. షావలిన్ అది నిజమనుకుని, అటు పరుగెత్తుకు పోయినాడు. మనం ఇటు పోతాం."

"నేను బొత్తిగా నడవలేకుండా ఉన్నాను పెర్సీ. అరికాళ్లు బొబ్బలు పొక్కినాయి."

"నేను నిన్ను నడవనిస్తానా మార్గరెట్. ఇలా ఎత్తుకుపోతాను—" అంటూ పెర్సీ ఆమెను అవలీలగా ఎత్తుకున్నాడు.

అరగంటసేపటిలో సూర్యోదయమైంది. పెర్సీ, ఆండ్రూ మార్గరెట్ డ్రీమ్ ఎక్కారు. ఆర్మండ్ మొదలయినవాళ్ళు సంభ్రమంలో స్వాగతమిచ్చారు.

కాందిశీకులు పెర్సీని స్తుతిస్తూ కాళ్లమీద పడ్డారు. పెర్సీ వారినందరిని తప్పించుకొని తన గదిలోకి పోయి విశ్రాంతి తీసుకున్నాడు. ఆర్మండు మార్గరెట్ కన్నీళ్లతో కలుసుకొని హత్తుకున్నారు.

పెర్సీ యూదువేషంలోవచ్చినందుకు నావికులు ఎవ్వరూ ఆశ్చర్యపోలేదు. అటువంటివి వాళ్ళకి పరిపాటి అయిపోయినాయి.

డోవరులో దిగేసరికి పెర్సీ ఉజ్జ్వలమైన వేషం ధరించి ఉన్నాడు.

తరువాత అనతికాలంలోనే సర్ ఆండ్రూ, సుజేన్‌ల వివాహం జరిగింది. వారి గౌరవార్థం వేల్సు యువరాజు గొప్పవిందు చేశాడు. ఆ విందులో మార్గరెట్ అందం పెర్సీచందం గురించే అందరూ మాట్లాడుకున్నారు.

అయితే ఆ విందుకు షావలిన్ హాజరుకాలేదు. దానికే గాదు. గ్రెన్విల్ విందు తరువాత మరే విందుకు షావలిన్ రాలేదు.

(అయిపోయింది)

సుజాత

మద్దులూరి రామకృష్ణ

కృష్ణఒడ్డున ఒకప్పుడు ఒక రైతు ఉండేవాడు. పేరు సోమయ్య. ఎంత కష్టపడి పనిచేసినా పొట్టకు మాత్రం జరిగేదే కాని, కానీ డబ్బు కూడ మిగిలేది కాదు. పండిన పంటలో ఎక్కువ భాగం జమీందారుగారియింట్లోకి చేరవెయ్యాల్సి వచ్చేది. అటువంటప్పుడు తగలటమే గాని మిగలటం ఎక్కడ. పాపం సోమయ్యకు పెళ్లి చేసుకోవాలనే ఉబలాటం దినదినాభివృద్ధి పొందుతూఉన్నది. కాని పిల్లనిచ్చేవాళ్లెవరు?

ఓరోజు సోమయ్య విచారంగా పొలం పోతున్నాడు. ఒక గొప్ప చిత్రకారుడు, ఇతణ్ణి చూడ్డం తటస్థించింది. సోమయ్య విచారానికి కారణం వెంటనే గ్రహించాడు. కాగితం, పెన్సిలు తీసుకొన్నాడు. ఐదారునిమిషాలలో ఒక అందమైన అమ్మాయిని కాగితంపై కూర్చోబెట్టాడు. కాగితాన్ని సోమయ్యకు బహుమతిగా యిచ్చేశాడు.

కాగితంపైవున్న అమ్మాయిపై సోమయ్య మనసంతా లగ్నమైపోయింది. పొద్దున్నే పొలానికి వెళ్లేటప్పుడు కాగితంవంక చూచేవాడు. ఒక పెద్ద నిట్టూర్పువిడుస్తూ "ఓ కాగితములోవున్న అమ్మాయీ! నేను పొలంనుంచి తిరిగి వచ్చేటప్పటికి నాకు నీవు బువ్వ వండిపెట్టితే ఎంత బాగుండేది." అనేవాడు.

ఒక సాయంత్రం సోమయ్య యింటికి వస్తున్నాడు. ఇంటికి యింకా ఒక వంద బారలదూరంలోనే ఉన్నాడు. ఇంటికప్పుమీద నుండి పొగ వస్తూన్నది. పొగ వెంబడి కమ్మనివాసనకూడ వస్తూంది.

తలుపుతీశాడు. లోపలికి వెళ్లాడు. పొయ్యిమీద కమ్మని పప్పుపులుసు కాగుతూవున్నది. ప్రక్కనే నేతి పిడత ఆ ప్రక్కనే అరిసెలు. ఇవన్నీ చూచేసరికి సోమయ్య ఆకలి రెండురెట్లు అయింది.

మరుసటిరోజు పైనవున్న కండువా మంచంమీద వేశాడు. కండువానిండా చినుగులు. "నిన్న ఎవ్వరోగాని ఒక అమ్మాయి బువ్వ వండిపెట్టి పుణ్యం కట్టుకొన్నది. ఇవ్వాళ ఈ పైగుడ్డ కుట్టిపెట్టితే ఎంత బాగుంటుంది," అని అనుకుంటూనే బయటకు వెళ్లిపోయాడు.

మళ్ళీ సాయంత్రంపూట ఉద్దేశ్యపూర్వకంగా రెండుగంటలు ముందుగానే యింటికి వచ్చేశాడు. కిటికీలో గుండా లోపలికి చూచాడు.

సోమయ్య ఇల్లు ధగధగలాడిపోతున్నది. ఓ చక్కని అమ్మాయి సోమయ్యకండువాను కుడుతూవున్నది. చిత్రకారుడు యిచ్చిన కాగితం ఆ ప్రక్కనే వున్నదిగా? అది వుత్తకాగితమైపోయింది. అందులో అమ్మాయి లేదు, గిమ్మాయి లేదు.

తొందరగా తలుపులు తెరుచుకొని లోపలికి పోయాడు ఆఅమ్మాయి కొంగుపట్టుకొని "పిల్లా! పిల్లా!! ఏవూరు? ఎక్కడనుండి వచ్చావు? నామీద ఎందుకు యింత దయ? నిన్న బువ్వవండిపెట్టిన అమ్మాయివి నీవేనా? ఎంత మంచి అమ్మాయివి" అన్నాడు. సోమయ్యను చూడగానే ఆ అమ్మాయికి ఎక్కడలేని సిగ్గూ వచ్చింది. "బువ్వవండిపెట్టింది నేను కాకపోతే ఇంకెవ్వరూ?" "ఎక్కడనుండి వచ్చావు" అని మళ్ళీ అడిగాడు. "ఇన్నాళ్ళనుంచి నేను పటంలో వుండగా ఎన్నిసార్లు చూశావు నీవు? ఎక్కడనుండి వచ్చావంటావేం? నువ్వు చూచిన చోటి నుండే వచ్చాను" అన్నది ఆ అమ్మాయి ముసిముసినవ్వులు నవ్వుకుంటూ. "మళ్ళీ పటంలోకి పోతావా?" అంటూ దీనంగా అడిగాడు సోమయ్య.

"పొమ్మంటావా, వద్దంటావా," అని అడిగింది ఆ అమ్మాయి. సోమయ్య బిక్కమొగం వేశాడు. ఆ అమ్మాయికి ఎంతో జాలి కలిగింది. "పోనీలే, దిగులుపడకు. వెళ్ళిపోనులే" అన్నది ఆ అమ్మాయి.

సోమయ్యకు ఏడుకొండలు ఎక్కినంత సంతోషం వచ్చింది. వెంటనే

నీతి

దూతలూరి జగన్నాథం

అరిచేతిలోని చెండు
క్రిందికి పడవేయుండు
త్వరితగతిని ఆ చెండు
పైకి ఎగురు●ండు.

మట్టిముద్ద పైరీతిగ
మహిని జారవిడువగ
దిక్కు మొక్కు లేకుండ
అక్కడనే పడియుండు.

మతిమంతుని మతిహీనుని
●ర్తనంబు లీరెండు.

సోమయ్య ఉత్తకాగితం మడతపెట్టి పెట్టెలోవేసి భద్రంగా తాళం బిగించాడు. ఇక ఆ అమ్మాయి ఎక్కడికి పోతుంది?

సోమయ్య ఆ అమ్మాయి కాపరం చెయ్యటం మొదలుపెట్టారు. రెండుమూడు●జులైనాక సోమయ్యకు అకస్మాత్తుగా ఒకసందేహం కలిగింది. "పిల్లా! పిల్లా!! నీ పేరేమిటి" అని అడిగాడు. "నా కింతవరకూ ఏపేరూ లేదు" అన్నది. "ఏదో ఒకపేరుతో పిలవాలిగదా ఎట్లా పిలిచేది. కోడలా! అని పిలచేదా" అన్నాడు. "ఎబ్బెబ్బే!!" అన్నది ఆ అమ్మాయి. కొంతసేపు వాదోపవాదములైన తరువాత ఆ అమ్మాయి "సుజాత" గా మారి కూర్చున్నది.

భార్యా భర్త లిద్దరూ ప్రతిరోజు లేవగానే తూర్పుదిక్కుగా తిరిగి దణ్ణం పెట్టటం, సోమయ్య పొలానికి పోవటం, ఆ అమ్మాయి యింటిపనులు చూడటం మామూలైపోయింది. వీరిద్దరి దాంపత్యం చిలకాగోరింకల దాంపత్యంకంటె మించిపోయింది. చుట్టుప్రక్కలవారందరూ సోమయ్య అదృష్టాన్ని వేయినోళ్ళతో పొగడటం మొదలుపెట్టారు. ఆ వూరిలో క్రొత్తగావచ్చిన కోడళ్ళందరికి ఈ సోమయ్యగారి భార్య నాయకురాలైంది.

ఇల్లు ఎల్లప్పుడూ కళకళలాడేటట్లు వుంచడంలో ఆమెకు మించినవారెవరూ లేరు. చినిగిన గుడ్డ కుట్టుకూడా కనబడకుండా కుట్టుతుంది. ఇంటిపనులన్నీ ఎప్పుడు చేస్తుందో ఎవరికీ తెలియదు. ఎల్లపుడూ సీతాకోకచిలుకలాగా అతిఉత్సాహంతో నవ్వుమొగంతో ఆ అమ్మాయి అటూ ఇటూ తిరుగుతూ ఇంటిపనులు చూచుకుంటుంటే ఏదో వంకపెట్టుకొని అమ్మలక్కలు ఎవరో ఒకరు వచ్చేవారు.

ఒకరోజున సుజాత తీరికగా తలుపు ఆనుకొని నిలబడి వీధివంక చూస్తున్నది. ఇద్దరు మనుషులు ఏడుస్తూ గాభరాతిన్న మొఖాలతో ఆ వైపు వస్తున్నారు. వాళ్ళిద్దరూ ఆవూరి రైతులే. అందుచేత సుజాత వాళ్ళను పిలచింది. "కోటయ్యా! మీ రిద్దరు దిగులుగా వున్నారేం? ఇంట్లో ఎవరికైనా బాగా లేదా!" అని అడిగింది

"ఏంచెప్పము తల్లీ! ఆ ర్చేవారా తీర్చేవారా. ఒకరికి వళ్లు అమ్ముకున్నతరువాత వాళ్లేమి చెప్పితే అది చెయ్యాలి. లేకపోతే మాట దక్కదు" అన్నాడు కోటయ్య. "అసలుసంగతేమిటో చెప్పవేం" అన్నది సుజాత. "ఏంవుంది. రాజాగారికి ఏరోజుకారోజు కూర చేసుకోటానికి ఒక జత పావురాళ్లు కావాలి. అవి తేకపోతే మా వీపులు బద్దలుకొడతాడు. అడివంతా వెతికాము. ఇవాళ ఎక్కడా దొరకలేదు. ఏమొగంతో రాజాగారి వద్దకు పోదామా అని ఏడుస్తున్నాము" అన్నాడు సుజాతకు చాల జాలివేసింది. "సరే, ఒక నిమిషంపాటుండండి. మీకు నేను సహాయంచేస్తా" నన్నది సుజాత ఒక కాగితం తీసుకొన్నది. ఒక్క నిమిషంలో రెండు కాగితపు పావురాళ్లను తయారుచేసింది. ఇదంతా చూస్తున్న కోటయ్య "ఏం సుజాతమ్మా! మమ్మల్ని చూస్తే నీకుకూడ ఎగతాళయిందే. సోమయ్య పెళ్లాం ఎంతో మంచిదని అందరు చెప్పుకుంటారే. మమ్మల్ని వెక్కిరిస్తావా!" అన్నాడు. ఆ అమ్మాయి జాలిగా వాళ్లవంక చూస్తూ, "తొందరపడతారేం, ఆగండి. ఒక్కసారి మీరు కళ్ళు మూసుకోండి" అన్నది. రైతులిద్దరు కళ్లు మూసుకున్నారు. ఒక్కనిమిషం పాటు కళ్ళు మూసుకున్నారో లేదో "కువ, కువ" మంటూ "గురు, గరు," మంటూ అదేపని శబ్దం వినిపించింది. ఆశ్చర్యపడుతు వాళ్ళిద్దరు కళ్ళు తెరచారు. సుజాత రెండుచేతుల్లోను రెండు పావురాళ్లు ఎంత మంచి చక్కటి పావురాళ్లు ఒక తెల్ల మబ్బుతునక రెండు తునకలై సుజాత చేతుల్లో పావురాళ్ళగా నిలబడ్డయ్యామో ననిపించింది. "ఇవిగో రెండు పావురాళ్ళు. వీటిని తీసుకొని రాజాగారి కివ్వండి. ఇవి

చైనీస్ కథలు - ఫెంగ్ స్వే ఫెంగ్:

6. పాము - తేనెటీగలు

'చిటారుకొమ్మను మిఠాయి పొట్లం' అన్నట్లుగా, అడవి తేనెటీగలు కొన్ని చెట్టుకొమ్మ మీద తేనెపట్టు నిర్మించుకుంటు న్నాయి. ఆ చెట్టుమీద అంత సందడి, ఉత్సాహం, ఆనందం ఎన్నడూ లేదు. తేనెటీగలు కొమ్మ నుండి కొమ్మకూ, పువ్వునుండి పువ్వుకూ ఎగిరి, ఝుంకారం చేస్తూ, తేనె పోగుచేస్తూ తేనెపట్టు నిర్మిస్తున్నాయి. వాటిరొదతో అడవిలోని నిశ్శబ్ద వాతావరణం పటాపంచలైంది. అడవిలో పర్యటనకు బయలుదేరిన సర్పం ఒకటి తేనెటీగలరొదకు చాలా చిరాకుపడింది:

"ఈ హడావిడి, హంగామా దేనికో తెలియడంలేదు. రాజకీయవేత్త ఒకాయన చెప్పినట్టు, ఎప్పుడూ హడావిడిగా ఉండే దేశాల్లో శాంతి మృగ్యమవుతుంది. అలాంటి దేశాల్లో ఎప్పుడూ యుద్ధాలో, అంతర్యుద్ధాలో సంభవిస్తూనే ఉంటాయి

అదంతా అలాఉంచి, అందరూ సమష్టిగా, కలిసికట్టుగా పని చెయ్యడం ఉందే, చాలా అసభ్యమైనపని. దానివల్ల అరాజకం ప్రబలుతుంది. పౌరులు తిరుగుబాటుదారు లవుతారు; ప్రజలకు ప్రాతినిధ్యంవహించేమనిషి లేకుండాపోతాడు. ఇది నేను సహించలేను."

ఎక్కడ ఏకాన్త గందరగోళం జరిగినా దాన్ని అణచివేసేపని సర్పం తనమీద. తనే పెట్టుకుంది. అందుకని వెంటనే వృక్షశాఖ అధిరోహించి తేనెపట్టు ధ్వంసం చెయ్యాలని సంకల్పించింది.

కాని సర్పం చెట్టు ఎక్కీ ఎక్కగానే తేనెటీగలన్నీ ఒక్కుమ్మడిగా ముట్టడించాయి. ఎంత తొందరగా ఎక్కిందో అంత తొందరగానూ దిగిపోవలసి వచ్చింది. తేనెటీగలు సర్పాన్ని తరిమితరిమి కొట్టడంవల్ల, అది ముళ్ళపొదలలో తల దాచుకోవలసి వచ్చింది.

★

మీకు లభించినవిధంమాత్రం ఆయనతో చెప్పబోకండి. మామూలుగానే అడవిలో దొరికినవని, చాల కష్టపడి పట్టుకున్నా"మని మాత్రం చెప్పండి.

రైతుబిడ్డ లిద్దరూ తమ కళ్ళు తామే నమ్మలేదు. ఇద్దరూ ఒక్కసారి చేతులు జాపి పావురాళ్ళు పుచ్చుకున్నారు. ఒక్కగంతువేసి రాజాగారిముందట పడ్డారు. "మహాప్రభో! ఈరోజు భలేపావురాళ్ళు దొరకినవి." రాజుగారికి వాటిని చూడగానే నోరు వూరింది. వెంటనే కూర తయారుచేయించారు. తన జన్మలో ఎప్పుడుకూడా అంత రుచిగలమాంసం తినలేదు. వెంటనే కోటయ్యకోసం కబురుపంపాడు.

కోటయ్య రాగానే రాజుగారు పక్షుల మంత్రి, జంతువుల మంత్రి, ఇరుప్రక్కల నిలబడిఉండగా కోటయ్యను 'పావురాళ్ళు ఎక్కడ తెచ్చావు, ఎట్లా పట్టుకొచ్చావు' అని అడిగారు. పాపం ఆ రైతు కొంతసేపు ఆలోచించి జరిగినసంగతేమో చెప్పాడు. రాజుకు, మంత్రులకు ఎక్కడ లేని సంతోషం వచ్చింది. వెంటనే కబురంపారు సుజాతకు. ప్రతిరోజు రెండుపావురాళ్ళు రాజుగారికి భోజనానికి పంపాలి - ఈ మాటలు విన్న సుజాత తిరిగి రాజుగారికి కబురు పంపింది. ప్రజలమీద యికముందు ఏ క్రొత్తరకమైన పన్నులు వేయనని హామీయిస్తే అట్లాగే పావురాళ్ళను పంపుతానన్నది.

రాజుగారు వెనకా ముందూ ఆలోచించారు. పక్షులమంత్రి, జంతువుల మంత్రి వెంటనే అందుకున్నారు. "వెధవ వాగ్దానాలు... ఏమ్ చేస్తేనేం? ముందు మనపని కానివ్వండి" అన్నారు. రాజుగారు తలవూపారు. ప్రతిరోజు మబ్బు తునకల్లాంటి రెండు పావురాళ్ళు రాజుగారికి కూరగా మారిపోతున్నవి.

ఒకరోజు రాజుగారికి ఆలోచన పుట్టింది. "ఈ పావురాళ్ళను పంపే అమ్మాయి ఎవరు? ఎట్లావుంటుంది?" వెంటనే మంత్రు లిద్దరు ఆలోచనలను ఆచరణలో పెట్టారు.

హిరణ్మయి

బాలసాహితిలో కొత్తసీరియల్

ఆంధ్రవారపత్రిక 17-8-55 సంచికనుండి 'బాలసాహితి' శీర్షికలో "హిరణ్మయి" అనే కొత్త సీరియల్ కథ ప్రచురిస్తున్నాము. భారత దేశంపై రెండువేలేండ్లకు పూర్వము గ్రీకు చక్రవర్తి అలెగ్జాండరు చేసిన దండయాత్రను వాతావరణంగా తీసుకుని శ్రీ పాలంకి వెంకటరామచంద్రమూర్తిగారు ఈ పెద్దకథ రచించారు. ఈ కథలోని ఇతివృత్తం ఒక ఇంగ్లీషుకథ ఆధారంగా అల్లబడినది. మా పాఠకులు ఈ సీరియల్ చదివి ఆనందిస్తారని విశ్వసిస్తున్నాము.

—సంపాదకుడు

★ సుజాత ★

సాయంత్రం అయ్యేసరికి సుజాత సోమయ్యను ఏదోవిధంగా ఒప్పించి రాజుగారి ఎదుటకు వచ్చింది. సోమయ్యకూడ వెంబడే వచ్చాడు.

రాజుగారు ఆ నవమోహనాంగిని చూడగానే పరవశుడయ్యాడు. ఆమె తనకు భార్యగా అయిపోవాలనుకున్నాడు. సుజాత పల్లెటూరి గబ్బిలాయి భర్తని వదలివెయ్యాలని తేల్చివేశాడు. సుజాత కోపంగా "సోమయ్యకంటె నీవు ఏవిధంగా గొప్ప? జన్మలో నీవంటివాడిముఖం గూడ చూడరా"దన్నది.

రాజుగారికి సుజాత చెప్పిన ప్రతిమాట సూదిపోటుగా తగిలింది. అన్నిటికీ మించి సోమయ్య తనకంటె ఎక్కువట. ఇటువంటిమాట ఎట్లా అనగల్గిందో రాజుగారు ఊహించలేకపోయారు. ఏదో సమాధానం చెప్పబోయేటంతలో సుజాత కళ్ళకు కనబడకుండాపోయింది.

వెంటనే రాజుగారు సోమయ్యకు "నీతో రేపు ప్రొద్దున గుర్రము పందెము వేయ సంకల్పించాను. నీవుపందెమునకు రావాలి. మనిద్దరిలో ఎవరు గొప్పో తేల్చుకోవాలి" అని కబురు పంపారు.

సుజాత దిగులుపడినసోమయ్యను ఓదార్చి, ధైర్యంచెప్పి "పందెంలోకి రావటానికి ఒప్పుకున్నాడు, సోమయ్య" అని రాజుగారికి కబురు పంపింది. రాజుగారు గుఱ్ఱముఎక్కి వచ్చేలోపుగానే సుజాత ఒకకొయ్యగుఱ్ఱాన్ని చేసింది. సోమయ్యను కళ్లు మూసుకోమన్నది. కళ్లు తెరిచేలోగా కొయ్యగుఱ్ఱం కాస్తా పంచకల్యాణిగుఱ్ఱంగా తయారైంది.

పందెం ప్రారంభించారు. రాజుగారిగుఱ్ఱం ముందు పరుగెత్తడం ప్రారంభించింది. రాజుగారు వెనక్కు తిరిగి "అయ్యో! ఇంతేనా గొప్ప - రా - రా -" అంటూ గుఱ్ఱాన్ని దౌడుతీయించటం మొదలుపెట్టాడు. చేరవలసినచోటు కనుచూపుమేరలో నున్నది. ఒక్కక్షణంలో కొయ్యగుఱ్ఱం రాజుగారిగుఱ్ఱం మీదుగా చెంగుమని దూకి గమ్యస్థానాన్ని చేరుకొన్నది. రాజుగారి ముఖం వెలవెలబోయింది.

రెండవరోజు తిరిగి మళ్లా సోమయ్యకు కబురు వచ్చింది. ఈసారి పడవలపందెమట. సోమయ్యకు ఏమీ తోచలేదు. తిరిగి సుజాత పందెం వేయటానికి సోమయ్యను ఒప్పించింది. ఒక్కనిమిషంలో ఒక కాగితపు పడవ తయారుచేసింది. మరునిమిషంలో ఆ పడవ నిజమైన పడవగా తయారైంది. మిగతా పడవలు నీళ్లమీద పోతవి. ఈ కాగితపుపడవ భూమిమీదకూడ నడుస్తుంది.

ఆ మరునాడు ఊరి దరిలోనే వున్న నదిలో పందెం ప్రారంభమైంది. మొదటి మూడునిమిషాలలోనే రాజుగారిపడవ ఎంతో వెనుకబడిపోయింది. పాపం రాజుగారు పడవనడిపే తొందరలో కాలుజారి నీళ్ళలో పడ్డాడు. ఇది చూచిన సోమయ్య పడవను వెనక్కుమళ్ళించి అతికష్టంమీద రాజుగారిని ఒడ్డుకు చేర్పించాడు. రాజభటులు సోమయ్యను పట్టుకున్నారు. రాజుగారు గద్దించి అడి

(49 వ పేజీ చూడండి)

తెలివిగల కర్షకుడు

(ఇటలీదేశపు పురాతన జానపద గాథ-అనువాదం: "చదలవాడ")

అనగా అనగా ఒక రాజు. ఆ రాజు ఒకనాడు షికారు పోతూ పొలంలో పనిచేసుకొంటూవుండే ఒక కర్షకుని చూచి, "ఏమయ్యా! నీవు రోజు కెంత సంపాదిస్తావు?" అని అడిగినాడు అందుకు కర్షకుడు అతి వినయంగా "నాలుగు "లైర్లు" అన్నాడు. లైర్ అంటే ఇటలీదేశం నాణెం. రాజు మళ్ళీ "ఆ నాలుగు లైర్లూ ఏం చేస్తావు?" అని అడిగినాడు. కర్షకుడు "ఒక నాణెం తిండి ఖర్చుకు సరిపోతుంది. రెండోదాన్ని అప్పుగా ఇస్తాను. మూడోదానితో అప్పు తీరుస్తాను. నాలుగోది బావిలో పారేస్తాను" అన్నాడు. అందులోని అర్థం రాజుకు తెలియలేదు. విపులంగా విప్పి చెప్పమని ఆ కర్షకుణ్ణి అడిగాడు. అందుకు కర్షకుడు "ఒకనాణెం నాకూ, నా భార్యకూ ఆహారపదార్థాలకు వెచ్చిస్తాను. రెండోదానితో నా కుమారులకు ఆహారం కొంటాను. వారిని పోషించి పెద్దవారిని చేస్తే వృద్ధాప్యంలో వారు నన్ను కాపాడుతారు కాబట్టి ఆ నాణెం అప్పు క్రింద లెక్క. అదేరీతిగా మూడో నాణెంతో నా తండ్రికి ఆహారం వగైరాలు కొని పోషిస్తాను కాబట్టి నేను నా తండ్రిబుణం తీర్చుకొంటూన్నట్టు జమ. నాలుగో నాణెం ప్రతిఫలాపేక్ష లేకండా పేదలకు ఉచితంగా ఇస్తాను కాబట్టి దాన్ని నూతిలో వేసినట్లే" అని తన సమాధానంలోని భావాన్ని సవిస్తరంగా చెప్పినాడు. కర్షకుని తెలివికి రాజు ఆశ్చర్యపడినాడు. ఆమాత్రం తెలివి తన మంత్రుల కుందేమో అని పరీక్షించడానికి నిశ్చయించుకొన్నాడు. కర్షకునితో "ఈ రహస్యం మళ్లీ నీవు నాతలను నూరుసార్లు చూచేదాకా ఎవరికీ చెప్పవద్దు" అని చెప్పి వాగ్దానం చేయించుకొని తనదారిని పోయి, తర్వాత కోటలోకి చేరుకొన్నాడు.

మర్నాడు సభలో మంత్రులను చూచి తా నొకరితో సంభాషించినప్పుడు ఒక సమాధానం వచ్చిందనీ, దానిభావమేమో తెలుపమని కర్షకుని మొదటి ప్రత్యుత్తరాన్ని తు, చ తప్పకుండా ఏకరువు పెట్టినాడు రాజు. అందరూ ఒకరి ముఖాలు ఒకరు చూచుకొన్నారు. ఆ చిక్కు ప్రశ్నకు సమాధానం చిక్కలేదు. చివరకు రాజు సభ ఆనాటికి చాలించినాడు.

రాజుగారిమంత్రుల్లో ఒకడు ఇంటికి పోయి "అటువంటి సమాధానాలు ఎవరిచ్చివుంటారా?" అని ఆలోచించాడు. ఆ తెలివిగల కర్షకుడు తప్ప మరెవరూ అంత చతురంగా మాట్లాడివుండరని తోచింది. వెంటనే వెళ్ళి ఆ కర్షకుని కలుసుకొన్నాడు. అతని ప్రత్యుత్తరంలో దాగివున్న వింత విషయం ఏమని ప్రశ్నించాడు. కర్షకుడు రాజుగారికి తానుచేసిన వాగ్దానం సంగతి చెప్పి తన అసమ్మతిని అతివినయంగా తెలుపుకున్నాడు. ఎంత ప్రాధేయపడినా ససేమిరాలన్నాడు.

మంత్రి ఒకయుక్తి పన్నినాడు. కర్షకునికి నూరు బంగారునాణెములు బహుమానంగా ఇచ్చినాడు. అందులో ప్రతినాణెంమీద రాజుగారి తల ముద్రించివుండింది. నూరు నాణెములున్నూ తీసుకోమన్నాడు. ప్రతినాణెంమీద రాజుగారితలను చూడమన్నాడు. కర్షకుడు నూరు ఎంచేసరికి రాజుగారి తల నూరుసార్లు చూడడం జరిగింది. చివరకు తన వాగ్దానానికి కట్టుపడవలసిన అవసరం కర్షకునికి కనిపించలేదు. రహస్యం చెప్పేశాడు.

మర్నాడు మంత్రి రాజుకు రహస్యం వెల్లడిచేశాడు. రాజుకు కోపం వచ్చింది. కర్షకుని రప్పించి అన్నమాటను ఎందుకు నిలుపుకోలేదని ఆగ్రహించాడు. కర్షకుడు కడు వినయంతో మంత్రి ఇచ్చిన నూరు సువర్ణాలసంగతి ప్రతిదాని మీద రాజుగారి తల వుండడం, తాను జాగ్రత్తగా ఒక్కొక్క నాణెంగా పైకితీసి సరిగా నూరుసార్లు రాజుగారి తలను చూచిన తర్వాతనే రహస్యం వెల్లడిచేసిన సంగతిచెప్పి అన్నమాటను అక్షరాలా పాటించినందువల్ల దండనకు అనర్హుడననీ విన్నవించుకొన్నాడు. కర్షకుని తెలివికి రాజుమెచ్చి మరొక సంచినిండా నూరు సువర్ణాలు బహూకరించాడు. కథ కంచికి. మన మింటికి. ★

సోమరి సీతయ్య

డి. మంజులత

రామాపురమనే ఊళ్లో సీతయ్య అనే వ్యక్తి ఉన్నాడు. పాతికేళ్లు వచ్చినా పనీ పాటా చేయకుండా గాలిగా తిరుగుతూ వాళ్ళ దగ్గరా, వీళ్ళదగ్గరా అప్పులు జేసుకుని కాలంగడుపుతున్నాడు! అతని నోటినుంచి ఒక్క మంచిమాట వెలువడదు; తన చేతులతో ఒక్క కానీ మరొకడికి ఇచ్చేదిలేదు; అప్పుగా తీసుకోవడంమాత్రం బాగా తెలుసు; అయితే తీసుకున్న అప్పు తిరిగి తీర్చడం అతనికి అలవాటు లేదు! పైగా బాకీవిషయం అడిగితే కొట్టవచ్చేవాడు! కాస్త శ్రమపడడం అతనికిష్టంలేదు! మైలు దూరంలో వున్న ప్రక్క వూరుకూడా నడిచి వెళ్లలేనంతటి బద్ధకస్తుడు! అల్లరిచిల్లరిగా తిరగటం, అప్పులు చేయటం సరదాగా కాలం గడపటం—అతని నిత్యకృత్యాలు. పైగా మనుషుల్ని బెదిరించడం మహా బాగా తెలుసు!

ఒక రోజున సీతయ్య ఆ వూళ్లో వున్న రామయ్య అనే షావుకారు దగ్గరికెళ్లి పాతికరూపాయలు అప్పు అడిగాడు! ఆ రామయ్య అప్పటికే అతనికి వంద రూపాయలకు పైగా బాకీ ఇచ్చాడు! అది తీర్చలేదు! పైగా మళ్ళీ అప్పుకొచ్చాడు! అతని సంగతి రామయ్యకు బాగా తెలుసు! ఏదో ఒకరకంగా వీడికి బుద్ధి చెప్పకపోతే లాభంలేదని వూహించి ఏదో సంభాషణకుపక్రమించాడు: 'ఏమోయ్! ఒక వందరూపాయలకు నీ నాలుక ఎవరయినా ఇమ్మంటే ఇవ్వగలవా?' అన్నాడు!

'నాలుక వంద రూపాయిలకా? నాలుకపోతే ఏముంది? అబ్బే అలా ఎప్పటికీ చేయను!' అని అన్నాడు!

'పోని నీ చేతులు రెంటిని ఎవరయినా వంద రూపాయలకు తీసుకుంటామంటే ఒప్పుకోగలవా?' అని మళ్ళీ అడిగాడు.

'అబ్బే, అదెలా సాధ్యమవుతుంది? చేతులు పోతే ఇక నా బతుకేముంది?' అని సీతయ్య సమాధానం చెప్పాడు.

'అయితే చూడు: ఎవరయినా నీకు మూడువందలిచ్చి మోకాళ్ళవరకు నరికి ఇవ్వమంటే నీవు ఒప్పుకుంటావా?'

దీనికి కూడా 'అబ్బే! అలా ఎందుకు ఒప్పుకుంటాను?' అని సమాధానం చెప్పాడు!

★ సుజాత ★

(46-వ పేజీ తరువాయి)

వచ్చి సోమయ్యాను పక్షులుగా కత్తిరించ మన్నది. ఒక్క నిమిషంలో కాగితపు పక్షులు పక్షులుగా మారిపోయినవి. సుజాత ఒక పక్షిని తీసుకొని ముద్దుపెట్టుకొని "మీరందరూ ఆకాశానికి ఎగిరి, మాకు కావలసిన యీకలు రాల్చండి," అన్నది. పక్షులన్నీ పైకి ఎగిరిపోయినవి. ఒక్క క్షణంలో సోమయ్యా యింటి చుట్టూ రకరకాల పక్షుల ఈకలు కుప్పలుకుప్పలుగా రాలి వున్నాయి. ఆ యీకలతో సుజాత చక్కని దుస్తులు తయారుచేసి సోమయ్యాకు యిచ్చింది. సోమయ్యా వెంటనే రాజుగారిదగ్గరకు పరుగెత్తుకు పోయాడు. ఆ దుస్తులు చూడగానే రాజుగారు ఆశ్చర్యపడి "ఈ దుస్తులను ఎట్లా తయారుచేస్తారో చూస్తేగాని నమ్మ"నన్నాడు. సుజాతకి కబురు వెళ్ళింది. రాజుగారి సభలోకి వచ్చీ రాగానే రాజుగారిని చూచి 'ఎందుకు పిలిపించా'వన్నది. ప్రక్కకు చూచింది. పాపం సోమయ్యాను రాజభటులు అరదండాలు వేసి స్తంభానికి కట్టివుంచారు. సుజాత కోపంపట్టలేక "ఓ రాజా! ఇతరులు కష్టపడి సంపాదిస్తే భోగభాగ్యాలు అనుభవించావు. నీవుకూడ కష్టపడి పనిచేసి నీ తిండి నీవు సంపాదించుకొంటే బీదవాళ్ళ కష్టాలు తెలుసుకోగలుగుతావు" రాజుగారు హుంకరించారు. సుజాత వెనుకవైపు చూచి తల వూపింది. ఒక సన్నటి నీటి ప్రవాహం లోపలికి వచ్చింది. ఆ ప్రవాహం ఇంతై, అంతై, రాజుగారి సభను, వస్తువులను, భవనాన్ని మొత్తాన్ని ముంచివేసింది. ఒక పెద్ద మహా సముద్రం అక్కడ పుట్టుకొచ్చింది. ఆ సముద్రంలో రెండు పడవలు తేలియాడుతూ ఉన్నవి. ముందున్న పూల పడవలో ఇద్దరుమాత్రమే ఉన్నారు! ఎవరు వాళ్ళు! సుజాత, సోమయ్యా! రెండో పడవలో కష్టపడి పనిచేసే ప్రజలందరూ సంతోషంతో తేలిపోతున్నారు.

—(చైనా జానపద కథ ఆధారం)

గాడు - "ఎంతో ఖరీదైన నా గుడ్డలు పాడైపోయినవి. వీటిని సాయంత్రానికల్లా క్రొత్తవిగా చేసి యివ్వాలి - లేకపోతే నీతల మెడ మీద వుండదు," అన్నా డ్రాజుగారు.

వెంటనే సోమయ్యా సుజాత దగ్గరకు పరుగెత్తాడు. సంగతంతా విన్నతరువాత ఆమె రాజుగారి దుస్తుల్ని పరిశీలించింది. వాటిమీద రకరకాల పక్షుల బొమ్మ లున్నవి. వెంటనే కాసినికాగితాలు తీసుకొని

'అయితే నీకు ఐదువందలిచ్చినా ఇలాంటిదానికి ఒప్పుకోవన్నమాట! దీన్నిబట్టి నీ ఖరీదు ఐదు వందలకంటే కూడా ఎక్కువన్నమాట అలాంటప్పుడు ఐదు వందలు నీదగ్గరుండగా నాదగ్గరికొచ్చి పాతిక రూపాయిలు అప్పు అడుగుతున్నావంటే నాకు నవ్వుగావుంది," అన్నాడు. దీంతో సీతయ్యాకు చాలా సిగ్గేసింది!

నోట్లో నాలుక వుంది గనుక-మంచి మాటలు చెప్పడం నేర్చుకోమనీ, బలమైన రెండు చేతులున్నాయి గనుక-వాటితో పనీపాటలు చేసిపొట్టపోసుకోమనీ, ఈవూరు గాకపోతే మరో వూరు వెళ్లడానికి కాళ్లు వున్నాయి గనుక ఎలాంటి ఇబ్బంది లేకుండానే శ్రమించవచ్చుననీ రామయ్యా సీతయ్యాకు చెప్పాడు!

ఆతరువాత సీతయ్యా ఆ ఊళ్లోనే కన్పించలేదు! ఏదో పొరుగూరు వెళ్ళి పనీపాటలు చేసుకుంటూ పొట్ట బోసుకుంటూ కాలం వెళ్లబుచ్చుకుంటున్నాడని తెలిసింది. ★




[illegible]
[illegible]



నేషనల్ పిక్చర్స్‌వారి
"పరాశక్తి"లో సురభి కమల,
శ్రీరంజని, దొరస్వామి

"ఎప్పుడైతే నాతో లేచివచ్చావో
అప్పుడే పునిస్త్రీవైపోయావు.
ఇంకా అలా కూచున్నావేం?
అలంకరించుకో!" అంటున్నాడు
గిరీశం—బుచ్చమ్మతో.
"కన్యాశుల్కం"లో ఎన్. టి.
రామారావు, జానకి.





"నిన్ను నే నొదిల్నా, నన్ను నువ్వు వదలటంలేదు" అని పూటకూళ్లమ్మతో అంటూన్న గిరీశం. "కన్యాశుల్కం"లో యన్. టి. రామారావు, ఛాయా దేవి.

హాలీవుడ్ లో డిస్నీలాండ్

సుప్రసిద్ధుడైన కార్టూన్ చిత్రనిర్మాత వాల్ట్ డిస్నీ హాలీవుడ్‌లో గత మాసం "డిస్నీలాండ్" ప్రదర్శనం ప్రారంభించాడు. ఒక కోటి డబ్భయి లక్షల డాలర్ల ఖర్చుతో ఈ డిస్నీ రాజ్యం నిర్మింపబడింది. పిల్లలకు వినోదం, విజ్ఞానం కలిగించే శాశ్వత యాత్రా స్థలంగా ఇది ఉద్దేశింపబడింది. ఇందులో నాలుగు ముఖ్య భాగాలున్నాయి.

1. మాయారాజ్యం: ఇది వాల్ట్ డిస్నీ ఊహాలోకం. ఇందులో ఆలిస్ తాలూకు అల్లిబిల్లిలోకం, ఏడుగురు మరుగుజ్జుల వజ్రపుగనులు ఇంకా ఎన్నో అద్భుత ఇంద్రజాలాలు చూడవచ్చునట.

2. ప్రకృతి రాజ్యం: ఇది పెద్ద మ్యూజియం లాంటిది. ప్రపంచంలోని ప్రకృతి విశేషాలు, వింతలు, నదులు, ద్వీపాలు, జలపాతాలతో సహా చిన్న చిన్న పరిమాణాలలో కనిపిస్తాయి.

3. పరిహద్దు రాజ్యం: అమెరికన్ చరిత్రలోని ప్రధాన ఘట్టాలన్నిటినీ ఇది చూపిస్తుంది.

4. భవిష్యద్రాజ్యం: విజ్ఞాన శాస్త్రం చేయగల అద్భుతకార్యాలను ఇది చూపిస్తుంది.

రోజుకు నలభై వేల మంది ప్రేక్షకులను ఆకర్షించగల ఈ డిస్నీ రాజ్యంలో 10 వేల కార్లు ఆగడానికి స్థలం ఉన్నదట. మొత్తం విస్తీర్ణం 160 ఎకరాలట.

ఈ క్రొత్త నిర్మాణంతో కార్టూన్ చిత్ర నిర్మాత వాల్ట్ డిస్నీ ప్రఖ్యాతి ఇనుమడించనున్నది. ఈయన ఇప్పటికి మొత్తం 657 చిత్రాలు నిర్మించాడు. గడచిన 25 సంవత్సరాలలో వీటిని 100 కోట్ల మంది ప్రజలు చూశారట. ఈ చిత్రాలు 14 భాషలలోకి డబ్ చేయబడినవి. ఆధునిక యుగంలో ప్రపంచపు బాలబాలికలను ఇంతగా ఆకర్షించిన వ్యక్తి మరొకడు లేడని అభిజ్ఞుల అభిప్రాయం. మొదట్లో మిక్కీమౌస్‌ను ప్రధాన పాత్రగా పెట్టుకుని ఈయన అనేక హ్రస్వ చిత్రాలు నిర్మించాడు. ఇవి ఆయనకు పేరు ప్రఖ్యాతులు ఆర్జించిపెట్టాయి. 1937 లో మొదటి సారిగా పెద్దచిత్రం "స్నో వైట్" విడుదల చేశాడు. 15 లక్షల డాలర్లు దీనికి ఖర్చయినది. మొదటి విడుదలలోనే ఈ చిత్రం 90 లక్షల డాలర్లు ఆర్జించింది. ఆ తర్వాత మరొక 50 లక్షలు ఆర్జించింది. మేధావులు, పామరులుకూడా ఈ చిత్రాన్ని అమితంగా ప్రశంసించారు. ఆ తరువాత "ఫాంటాషియా" అనే చిత్రం నిర్మించాడు. సంగీతాన్ని బొమ్మలలో చిత్రించాలని డిస్నీ ఇందులో ప్రయత్నించాడు. బీతోవెన్, చైకోవ్‌స్కీ మొదలైన యూరపియన్

ప్రసిద్ధ సంగీతకారుల సంగీతాన్ని ఆయన ఈ చిత్రంలో ప్రవేశపెట్టి వాటికి రూప కల్పన చేశాడు. అయితే అటు మేధావులను గాని, ఇటు పామర జనాన్ని గాని ఇది ఆకర్షించలేదు. డిస్నీ చాల నష్టపడాడు. ఇటువంటి ఇతివృత్తాలను ఎప్పుడూ తలపెట్టరాదని ఆయన గుణపాఠం నేర్చుకున్నాడు. పినాషియో, డంబో, బాంబీ మొదలైన చిత్రాలు వెలువడ్డాయి. కాని సిండరెలా చిత్రంతో మళ్ళీ వాల్ట్ డిస్నీ స్నోవైట్ చిత్రంతో పొందిన కీర్తి, ధనలాభం ఆర్జించగలిగాడు. 'ఆలిస్ ఇన్ దివండర్ లాండ్' అపజయం పొందింది. కాని కొత్తగా నిర్మించిన 'పీటర్ పాన్' గొప్ప ఆర్థిక విజయం పొందింది.

కార్టూన్ చిత్రాలు కాక వాల్ట్ డిస్నీ కొన్ని వైజ్ఞానిక చిత్రాలు, మామూలు నటీనటులతో కొన్ని చిత్రాలుకూడా నిర్మించాడు. జంతు జీవితానికి సంబంధించిన చిత్రాలు డిస్నీ తీసినవి చాలా అద్భుతంగా ఉన్నాయి. వీటిలో బాగా విజయం పొందినది ఇటీవల వచ్చిన 'లివింగ్ డిజర్ట్'.

డిస్నీ స్టూడియోలో మొదట్లో 20 మంది కార్టూన్ చిత్రకారులు ఉండేవారు. క్రమంగా సిబ్బంది సంఖ్య 50, ఆ తరవాత 150 వరకూ పెరిగింది. ఇప్పుడు దాదాపు వెయ్యి మంది అక్కడ పనిచేస్తున్నారట.

★

మద్రాసులో నెహ్రూ యాత్రా చిత్రం

రష్యాలో నెహ్రూ పర్యటన చూపించే సోవియెట్ వర్ణ చిత్రం మద్రాసు, న్యూ గ్లోబ్‌లో విడుదల అయింది. ప్రధాని నెహ్రూ పర్యటన కార్యక్రమాని, ఈచిత్రం వివరంగా చూపిస్తుంది. అదీగాక ఈ చిత్రం వర్ణాలలో ఉన్నది. సోవియెట్ వర్ణచిత్రాలు సాధించిన టెక్నికల్ అభివృద్ధి ఈ చిత్రంలో బాగా కనిపిస్తుంది. టెక్నికలర్ వర్ణాలు అతి ప్రకాశవంతంగా, కొట్టవచ్చినట్లు కనిపిస్తే ఈ చిత్రంలోని వర్ణాలు అతి నిరాడంబరంగా, సాధ్యమైనంత సహజంగా కనిపించడం ఒక విశేషం. దృశ్యం నిజంగా ప్రకాశవంతంగా ఉంటే చిత్రంలో కూడా అలాగే ఉండడం, సాదాగా ఉంటే చిత్రంలో కూడా సాదాగానే ఉండడం కనిపిస్తుంది. బహుశా డాక్యుమెంటరీ చిత్రాలకు, వార్తా చిత్రాలకు ఈ సహజవర్ణాలే తగినవి కావచ్చును.

ఈ యాత్రా చిత్రాన్ని దక్షిణ భారత ప్రాంతంలో పీపుల్స్ ఆర్ట్ ప్రొడక్షన్స్ వారు ("పల్లెటూరు" నిర్మాతలు) విడుదల చేశారు. తెలుగు వ్యాఖ్యానం అక్కడక్కడ చేర్చి దీన్ని ఆంధ్రలో కూడా విడుదల చేస్తారట.

రష్యన్ చిత్రాలన్నిటికీ దక్షిణ భారత ప్రాంతపు విడుదల హక్కులు పీపుల్స్ ఆర్ట్ ప్రొడక్షన్స్ వారు తీసుకున్నారు. ప్రసిద్ధి పొందిన రష్యన్ చిత్రాలనేకం చూసే అవకాశం మన ప్రాంతంలో ఇంతవరకూ కలగలేదు. ఈ సంస్థవారు పాత చిత్రాలనుకూడా తెప్పించి విడుదలచేస్తే బాగుంటుంది.

★



నేషనల్ ఆర్ట్ థియేటర్ వారి "జయసింహ" లో ఎన్. టి. రామారావు, స్టంట్ మాస్టర్ సోము.

సినిమా వార్తలు

జూపిటర్ పిక్చర్స్‌వారి తెలుగు చిత్రం "ఇదేదారి" పూర్తికావచ్చినదని తెలుస్తోంది. సి. ఎన్. అన్నాదురై రచించిన కథతో ఇదివరలో తమిళంలో బాగా నడిచిన "వేలైక్కారి" ఈ చిత్రానికి ఆధారం. అంజలీదేవి, ఎన్. టి. రామారావు, జమున, జగ్గయ్య, రాజసులోచన, రేలంగి, ఆర్. నాగేంద్రరావు ఈ చిత్రంలో నటిస్తున్నారు. దర్శకుడు సి. పి. దీక్షిత్. సముద్రాలవారు మాటలు, పాటలు వ్రాశారు.

* * *

ఈనెల ౯వ తేదీన నేషనల్ పిక్చర్స్ వారి "పరాశక్తి" తెలుగు చిత్రం ఆంధ్రలో విడుదల అయినది. శివాజీగణేశన్, శ్రీరంజని ప్రధాన భూమికలు నిర్వహించారు. పాలగుమ్మి పద్మరాజు, సముద్రాల రాఘవాచార్యులుగార్లు మాటలు, పాటలు వ్రాశారు.

* * *


కన్యాశుల్కం చిత్రాన్ని వినోదావారు కీ. శే. గురజాడ అప్పారావుగారికి అంకితం న్నారు. శ్రీశ్రీ రచించిన "ఆనందం అర్ణవమైతే", గురజాడ "పూర్ణమ్మ" బసవరాజు అప్పారావుగారి "నాగులచవితి", కృష్ణశాస్త్రిగారి "బొమ్మలపెళ్లి" మల్లాదివారి "చిటారుకొమ్మను" అనేపాటలు ఈ చిత్రంలో చేర్చబడినవి. సంగీతం ఘంటసాల, నృత్యాలు పసుమర్తి కృష్ణమూర్తిగార్లు సమకూర్చారు. ఈ చిత్రాన్ని ఆగస్టు 26వ తేదీన విడుదల చేయాలని, ఆంధ్రలో విడుదల చేసినప్పుడే మద్రాసులోకూడా విడుదలచేయాలని నిర్మాతలు ప్రయత్నిస్తున్నారు.

బొంబాయి సినిమాలేఖ

బొంబాయిలో ఇటీవల మూడుచిత్రాలు విడుదల అయినవి. నవకేతన్‌వారి "హౌస్ నం. 44"లో దేవ్ ఆనంద్, కల్పనా నటించారు. మధురమైన సంగీతం, డిటెక్టివ్ కథ ఈచిత్రంలో ఆకర్షణలు. "కార్నివాల్ క్వీన్"లో పాత తార నాడియా నటించింది. ఇది స్టంటు చిత్రం. మూడవది సొహ్రాబ్ మోడీ నిర్మించిన "కుందన్". ఇది మంచి బాక్సాఫీస్ చిత్రం కాగలదని అంచనా.

* * *

ఫిల్మిస్థాన్‌వారి సినిమాస్కోప్ చిత్రం "బొంబే ఫ్లయిట్ 417"లో నటిస్తున్న వినితాబట్, ఆ చిత్రంలో మేకప్‌మాన్‌గా ఉన్న జిమ్మీ వినింగ్‌ను వివాహం చేసుకోబోతున్నది. ఈ చిత్రంలో వినితా, సూర్యకుమారి, హాలీవుడ్ నటులు అలెక్సిస్ అర్నీ, జాన్‌లోడర్ నటిస్తున్నారు. అంతర్జాతీయ ప్రదర్శనకు తయారుచేయబడుతున్న చిత్రం గనుక, ఇందులో కామోద్రేకపూరిత సన్నివేశాలు, ఆలింగన చుంబన దృశ్యాలు విరివిగా ఉన్నాయి ఈ సన్నివేశాలలో హాలీవుడ్ నటులు అత్యుత్సాహంతో నటిస్తున్నారట. ఈ కారణంచేతనే నర్గీస్, వైజయంతీమాల, బీనారాయ్, నళినీ ఈ చిత్రంలో నటించడానికి నిరాకరించారు.



జూపిటర్ పిక్చర్స్‌వారి "ఇదేదారి" చిత్రంలో ఎన్. టి. రామారావు, జమున.

ప్రేక్షకుల అభిప్రాయాలు

"చెరపకురా చెడేవు"

చిత్రం బాగానే వుంది. నటీనటుల్లో ఎన్. టి. రామారావు చిన్న పోర్షనయినా బాగా పోషించాడు. అమర్‌నాథ్, జానకీలుకూడా ఫరవాలేదు. హాస్యం రేలంగి బాగా ప్రదర్శించాడు. "ఏడుజన్మలు" నాటకంలో "లైలామజ్నూ" "దేవదాసు" "అనార్కలి"ల, లోని ఘట్టాలు చూపించడము బాగున్నది. పాటలలో "ఏడు జన్మలా ప్రేయసివి నీవే", "ఆపకురా మురళీ" బాగున్నవి. భాస్కరరావుగారు మొదటసారి దర్శకత్వం వహించినా చిత్రాన్ని బాగా తీశాడు. ఈ చిత్రం తప్పకుండా విజయవంతమౌతుంది.

తాటి - పరంధామ్,

—గుంటూరు.

* * *

ఈ చిత్రము అనేకమంది ప్రజలను ఆకర్షిస్తున్నది. ముఖ్యంగా రాజసులోచన, జానకి, అమర్‌నాథ్, ఆర్. నాగేశ్వరరావు గారలు అత్యద్భుతంగా నటించారు. ఎన్. టి. రామారావు, చంద్రకుమారి, పుష్పలత, లక్ష్మీరాజ్యం మామూలుగా నటించారు. ముఖ్యంగా రాజసులోచన నృత్యము కన్నుల పండువుగా వుంది. రేలంగి తన హాస్యముతో ప్రజలను ఉబ్బి తబ్బిబ్బు చేశాడు.

"గులాబీల తోట, బుల్‌బుల్ పాట" అనే పాట నృత్యము చాలా మనోహరముగా వున్నవి. కనీసము ఈ పాటకైనా మరోసారి చిత్రాన్ని చూడాలనిపిస్తుంది.

ఆర్. వెంకటేశ్వర్లు,

—కర్నూలు.

* * *

బిమల్‌రాయ్ నిర్మిస్తున్న "అమానత్" చిత్రంలో నటిస్తున్న చాంద్ ఉస్మానీ ఆ చిత్రం ప్రొడక్షన్ మేనేజరు మణిఛటర్జీని వివాహం చేసుకొంటుందని బొంబాయి సినిమారంగంలో వినవస్తున్నది. ★

పెకింగ్‌లో భారతీయ చలనచిత్రోత్సవం

సెప్టెంబరునెలలో భారతీయ చిత్రాలు దోబిఘాజమీన్, ఆవారా, ఆంధియాన్ చైనారాజధాని పెకింగ్‌లో ప్రదర్శింపబడతాయట. సెప్టెంబరు 22 నుండి 29 వరకూ పెకింగ్‌లోనూ, తర్వాత ఇతర నగరాలలోనూ భారతీయ చలనచిత్రోత్సవం జరుగుతుంది.

కథావస్తువు చాలా సంతృప్తికరంగా ఉన్నది. చిత్రానికి పేరు అతికినట్లుగా ఉండి సరిపోయింది. మాటలు చాలా బాగున్నాయి. ఘంటసాలవారి సంగీతం వీనుల విందుగానున్నది. రేలంగి హాస్యము కొంత వరకు చిత్రవిజయానికి కారణం. మంచి సెంటు వుండి ముఖ్యంగా పిల్లలను ఆకర్షించింది. రాజసులోచన నృత్యాలు ఇంపుగా వున్నాయి. "ఏడు జన్మలు" అనే అంతర్నాటకం ప్రేక్షకుల ప్రశంసలందుకొంది.

కె. రాజశేఖరరెడ్డి,

—గుంటూరు.

'తుమ్మెదా ఒకసారి...'

(10-వ పేజీ తరువాయి)

సించవచ్చు. అదేవిధంగా ఇష్టం వచ్చినన్ని సార్లు తుమ్మవచ్చునుకూడా! కాని ఈ తుమ్ముల్ని 'ఇతరులకు నష్టం కలగాలనే ఉద్దేశ్యంతో; తన తుమ్ములవలన ఇతరులకు నష్టం కలగవచ్చునని తెలిసికూడా ఉదాసీన భావంతో ఉపయోగించడం రాజ్యాంగం సహించదు; అంగీకరించదు. ఎవరైనా ఉన్నత న్యాయస్థానానికి పోతే తప్పక నెగ్గుతారు.

నేను కర్తను ప్రార్థిస్తున్నాను. (ఆయన ఎవరో నాకు తెలియదు) నేను కర్తను ప్రార్థిస్తున్నాను: ఈ విధంగా - దురుద్దేశ్యంతో - 'ఒకసారి' తుమ్మడం తగదు! అసలు సాధ్యమయినంతవరకు తుమ్మనే తుమ్మవద్దు - కాని తప్పనిసరి అయితే అధమం రెండుసార్లైనా తుమ్మాలి! కర్తగారు నామాటలలోని సహృదయత్వాన్ని అంగీకరిస్తున్నారని ఆశిస్తున్నాను. అతిత్వరలోనే "తుమ్మెదా రెండుసార్లు..." అంటూ పాటను వినే అవకాశం కలుగుతుందని విశ్వసిస్తున్నాను. ★

రాజ్యం పిక్చర్స్‌వారి "హరిశ్చంద్ర" ప్రారంభోత్సవంలో క్లాప్‌బోయ్ రేలంగి, చంద్రమతిగా నటిస్తున్న లక్ష్మీరాజ్యం. ఈ చిత్రంలో హరిశ్చంద్రుడుగా ఎస్. వి. రంగారావు నటిస్తాడట. దర్శకుడు: జంపన.





"జయసింహ" లో నర్తకి కుచలకుమారి.

Printed and Published for Nageswara Rao Estates Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor : S. Sambhu Prasad.

★ సుజాత ★

(46-వ పేజీ తరువాయి)

గాడు - "ఎంతో ఖరీదైన నా గుడ్డలు పాడైపోయినవి. వీటిని సాయంత్రానికల్లా క్రొత్తవిగా చేసి యివ్వాలి - లేకపోతే నీతల మెడ మీద వుండదు," అన్నాడ్రాజు గారు.

వెంటనే సోమయ్య సుజాత దగ్గరకు పరుగెత్తాడు. సంగతంతా విన్నతరువాత ఆమె రాజుగారి దుస్తుల్ని పరిశీలించింది. వాటిమీద రకరకాల పక్షుల బొమ్మ లున్నవి. వెంటనే కాసినికాగితాలు తీసుకొని వచ్చి సోమయ్యను పక్షులుగా కత్తిరించ మన్నది. ఒక్కనిమిషంలో కాగితపు పక్షులు పక్షులుగా మారి పోయినవి. సుజాత ఒక పక్షిని తీసుకొని ముద్దుపెట్టుకొని "మీరందరూ ఆకాశానికి ఎగిరి, మాకు కావలసిన యీకలు రాల్చండి," అన్నది. పక్షులన్నీ పైకి ఎగిరిపోయినవి. ఒక్కక్షణంలో సోమయ్య యింటి చుట్టూ రకరకాల పక్షుల ఈకలు కుప్పలుకుప్పలుగా రాలి వున్నాయి. ఆ యీకలతో సుజాత చక్కని దుస్తులు తయారుచేసి సోమయ్యకు యిచ్చింది. సోమయ్య వెంటనే రాజుగారిదగ్గరకు పరుగెత్తుకు పోయాడు. ఆ దుస్తులు చూడగానే రాజుగారు ఆశ్చర్యపడి "ఈ దుస్తులను ఎట్లా తయారుచేస్తారో చూస్తేగాని నమ్మ"నన్నాడు. సుజాతకి కబురు వెళ్ళింది. రాజుగారి సభలోకి వచ్చీ రాగానే రాజుగారిని చూచి 'ఎందుకు పిలిపించా'వన్నది. ప్రక్కకు చూచింది. పాపం సోమయ్యను రాజభటులు అరదండాలు వేసి స్తంభానికి కట్టివుంచారు. సుజాత కోపంపట్టలేక "ఓ రాజా! ఇతరులు కష్టపడి సంపాదిస్తే భోగభాగ్యాలు అనుభవించావు. నీవుకూడ కష్టపడి పనిచేసి నీ తిండి నీవు సంపాదించుకొంటే బీదవాళ్ళ కష్టాలు తెలుసుకోగలుగుతావు" రాజుగారు హుంకరించారు. సుజాత వెనుకవైపు చూచి తల వూపింది. ఒక సన్నటి నీటి ప్రవాహం లోపలికి వచ్చింది. ఆ ప్రవాహం ఇంతై, అంతై, రాజుగారి సభను, వస్తువులను, భవనాన్ని మొత్తాన్ని ముంచివేసింది. ఒక పెద్ద మహా సముద్రం అక్కడ పుట్టుకొచ్చింది. ఆ సముద్రంలో రెండు పడవలు తేలియాడుతూ ఉన్నవి. ముందున్న పూల పడవలో ఇద్దరుమాత్రమే ఉన్నారు! ఎవరు వాళ్ళు! సుజాత, సోమయ్య! రెండో పడవలో కష్టపడి పనిచేసే ప్రజలందరూ సంతోషంతో తేలిపోతున్నారు.

—(చైనా జానపద కథ ఆధారం)



'అయితే నీకు ఐదువందలిచ్చినా ఇలాంటిదానికి ఒప్పుకోవన్నమాట! దీన్నిబట్టి నీ ఖరీదు ఐదు వందలకంటే కూడా ఎక్కువన్నమాట అలాంటప్పుడు ఐదు వందలు నీదగ్గరుండగా నాదగ్గరికొచ్చి పాతిక రూపాయిలు అప్పు అడుగుతున్నావంటే నాకు నవ్వుగావుంది," అన్నాడు. దీంతో సీతయ్యకు చాలా సిగ్గేసింది!

నోట్లో నాలుక వుంది గనుక-మంచి మాటలు చెప్పడం నేర్చుకోమనీ, బలమైన రెండు చేతులున్నాయి గనుక-వాటితో పనిపాటలు చేసిపొట్టపోసుకోమనీ, ఈవూరు గాకపోతే మరో వూరు వెళ్ళడానికి కాళ్లు వున్నాయి గనుక ఎలాంటి ఇబ్బంది లేకుండానే శ్రమించవచ్చుననీ రామయ్య సీతయ్యకు చెప్పాడు!

ఆతరువాత సీతయ్య ఆ ఊళ్లోనే కన్పించలేదు! ఏదో పొరుగూరు వెళ్ళి పనిపాటలుచేసుకుంటూ పొట్టబోసుకుంటూ కాలం వెళ్లబుచ్చుకుంటున్నాడని తెలిసింది. ★




వినోదావారి "కన్యాశుల్కం" లో "ఆనందం అర్ణవమైతే, అనురాగం అంబరమైతే..." అని పాడుతున్న మధురవాణిగా సావిత్రి.



నేషనల్ పిక్చర్స్‌వారి
"పరాశక్తి"లో సురభి కమల,
శ్రీరంజని. దొరస్వామి

★

"ఎప్పుడైతే నాతో లేచివచ్చావో
అప్పుడే పునిస్త్రీవైపోయావు.
ఇంకా అలా కూచున్నావేం?
అలంకరించుకో!" అంటున్నాడు
గిరీశం—బుచ్చమ్మతో.
"కన్యాశుల్కం"లో ఎన్. టి.
రామారావు, జానకి.





"నిన్ను నే నొదిల్నా, నన్ను నువ్వు వదలటంలేదు" అని పూటకూళ్లమ్మతో అంటూన్న గిరీశం.
"కన్యాశుల్కం" లో యన్. టి. రామారావు, ఛాయా దేవి.

హాలీవుడ్ లో డిస్నీలాండ్

సుప్రసిద్ధుడైన కార్టూన్ చిత్రనిర్మాత వాల్ట్ డిస్నీ హాలీవుడ్‌లో గత మాసం "డిస్నీలాండ్" ప్రదర్శనం ప్రారంభించాడు. ఒక కోటీ డబ్భయి లక్షల డాలర్ల ఖర్చుతో ఈ డిస్నీ రాజ్యం నిర్మింపబడింది. పిల్లలకు వినోదం, విజ్ఞానం కలిగించే శాశ్వత యాత్రా స్థలంగా ఇది ఉద్దేశింపబడింది. ఇందులో నాలుగు ముఖ్య భాగాలున్నాయి.

1. మాయారాజ్యం: ఇది వాల్ట్ డిస్నీ ఊహాలోకం. ఇందులో ఆలిస్ తాలూకు అల్లిబిల్లిలోకం, ఏడుగురు మరుగుజ్జుల వజ్రపు గనులు ఇంకా ఎన్నో అద్భుత ఇంద్రజాలాలు చూడ వచ్చునట.

2. ప్రకృతి రాజ్యం: ఇది పెద్ద మ్యూజియం లాంటిది. ప్రపంచంలోని ప్రకృతి విశేషాలు, వింతలు, నదులు, ద్వీపాలు, జలపాతాలతో సహా చిన్న చిన్న పరిమాణాలలో కనిపిస్తాయి.

3. సరిహద్దు రాజ్యం: అమెరికన్ చరిత్రలోని ప్రధాన ఘట్టాలన్నిటినీ ఇది చూపిస్తుంది.

4. భవిష్యద్రాజ్యం: విజ్ఞాన శాస్త్రం చేయగల అద్భుతకార్యాలను ఇది చూపిస్తుంది.

రోజుకు నలభై వేల మంది ప్రేక్షకులను ఆకర్షించగల ఈ డిస్నీ రాజ్యంలో 10 వేల కార్లు ఆగడానికి స్థలం ఉన్నదట. మొత్తం విస్తీర్ణం 160 ఎకరాలట.

ఈ క్రొత్త నిర్మాణంతో కార్టూన్ చిత్ర నిర్మాత వాల్ట్ డిస్నీ ప్రఖ్యాతి ఇనుమడించనున్నది. ఈయన ఇప్పటికి మొత్తం 657 చిత్రాలు నిర్మించాడు. గడచిన 25 సంవత్సరాలలో వీటిని 100 కోట్ల మంది ప్రజలు చూశారట. ఈ చిత్రాలు 14 భాషలలోకి డబ్ చేయబడినవి. ఆధునిక యుగంలో ప్రపంచపు బాలబాలికలను ఇంతగా ఆకర్షించిన వ్యక్తి మరొకడు లేడని అభిజ్ఞుల అభిప్రాయం. మొదట్లో మికీమాస్‌ను ప్రధాన పాత్రగా పెట్టుకుని ఈయన అనేక హ్రస్వ చిత్రాలు నిర్మించాడు. ఇవి ఆయనకు పేరు ప్రఖ్యాతులు ఆర్జించిపెట్టాయి. 1937 లో మొదటి సారిగా పెద్దచిత్రం "స్నో వైట్" విడుదల చేశాడు. 15 లక్షల డాలర్లు దీనికి ఖర్చయినది. మొదటి విడుదలలోనే ఈ చిత్రం 90 లక్షల డాలర్లు ఆర్జించింది. ఆ తర్వాత మరొక 50 లక్షలు ఆర్జించింది. మేధావులు, పామరులుకూడా ఈ చిత్రాన్ని అమితంగా ప్రశంసించారు. ఆ తరువాత "ఫాంటాషియా" అనే చిత్రం నిర్మించాడు. సంగీతాన్ని బొమ్మలలో చిత్రించాలని డిస్నీ ఇందులో ప్రయత్నించాడు. బీతోవన్, చైకోవ్‌స్కీ మొదలైన యూరపియన్

ప్రసిద్ధ సంగీతకారుల సంగీతాన్ని ఆయన ఈ చిత్రంలో ప్రవేశపెట్టి వాటికి రూపకల్పన చేశాడు. అయితే అటు మేధావులను గాని, ఇటు పామర జనాన్ని గాని ఇది ఆకర్షించలేదు. డిస్నీ చాల నష్టపడాడు. ఇటువంటి ఇతివృత్తాలను ఎప్పుడూ తలపెట్టరాదని ఆయన గుణపాఠం నేర్చుకున్నాడు. పినాకియో, డంబో, బాంబీ మొదలైన చిత్రాలు వెలువడ్డాయి. కాని సిండరెలా చిత్రంతో మళ్ళీ వాల్ట్ డిస్నీ స్నో వైట్ చిత్రంతో పొందిన కీర్తి, ధనలాభం ఆర్జించగలిగాడు. 'ఆలిస్ ఇన్ ది వండర్ లాండ్' అపజయం పొందింది. కాని కొత్తగా నిర్మించిన 'పీటర్ పాన్' గొప్ప ఆర్థిక విజయం పొందింది.

కార్టూన్ చిత్రాలు కాక వాల్ట్ డిస్నీ కొన్ని వైజ్ఞానిక చిత్రాలు, మామూలు నటీనటులతో కొన్ని చిత్రాలు కూడా నిర్మించాడు. జంతు జీవితానికి సంబంధించిన చిత్రాలు డిస్నీ తీసినవి చాలా అద్భుతంగా ఉన్నాయి. వీటిలో బాగా విజయం పొందినది ఇటీవల వచ్చిన 'లివింగ్ డిజర్ట్'.

డిస్నీ స్టూడియోలో మొదట్లో 20 మంది కార్టూన్ చిత్రకారులు ఉండేవారు. క్రమంగా సిబ్బంది సంఖ్య 50, ఆ తరవాత 150 వరకూ పెరిగింది. ఇప్పుడు దాదాపు వెయ్యి మంది అక్కడ పనిచేస్తున్నారట.

★

మద్రాసులో నెహ్రూ యాత్రా చిత్రం

రష్యాలో నెహ్రూ పర్యటన చూపించే సోవియెట్ వర్ణ చిత్రం మద్రాసు, న్యూ గ్లోబ్ లో విడుదల అయింది. ప్రధాని నెహ్రూ పర్యటన కార్యక్రమాని, ఈ చిత్రం వివరంగా చూపిస్తుంది. అదిగాక ఈ చిత్రం వర్ణాలలో ఉన్నది. సోవియెట్ వర్ణచిత్రాలు సాధించిన టెక్నికల్ అభివృద్ధి ఈ చిత్రంలో బాగా కనిపిస్తుంది. టెక్నికలర్ వర్ణాలు అతి ప్రకాశవంతంగా, కొట్టవచ్చినట్లు కనిపిస్తే ఈ చిత్రంలోని వర్ణాలు అతి నిరాడంబరంగా, సాధ్యమైనంత సహజంగా కనిపించడం ఒక విశేషం. దృశ్యం నిజంగా ప్రకాశవంతంగా ఉంటే చిత్రంలో కూడా అలాగే ఉండడం, సాదాగా ఉంటే చిత్రంలో కూడా సాదాగానే ఉండడం కనిపిస్తుంది. బహుశా డాక్యుమెంటరీ చిత్రాలకు, వార్తా చిత్రాలకు ఈ సహజవర్ణాలే తగినవి కావచ్చును.

ఈ యాత్రా చిత్రాన్ని దక్షిణ భారత ప్రాంతంలో పీపుల్స్ ఆర్ట్ ప్రొడక్షన్స్ వారు ("పల్లెటూరు" నిర్మాతలు) విడుదల చేశారు. తెలుగు వ్యాఖ్యానం అక్కడక్కడ చేర్చి దీన్ని ఆంధ్రలో కూడా విడుదల చేస్తారట.

రష్యన్ చిత్రాలన్నిటికీ దక్షిణ భారత ప్రాంతపు విడుదల హక్కులు పీపుల్స్ ఆర్ట్ ప్రొడక్షన్స్ వారు తీసుకున్నారు. ప్రసిద్ధి పొందిన రష్యన్ చిత్రాలనేకం చూసే అవకాశం మన ప్రాంతంలో ఇంతవరకూ కలగలేదు. ఈ సంస్థవారు పాత చిత్రాలను కూడా తెప్పించి విడుదల చేస్తే బాగుంటుంది.

★



నేషనల్ ఆర్ట్ థియేటర్ వారి "జయసింహ" లో ఎన్. టి. రామారావు, స్టంట్ మాస్టర్ సోము.

సినిమా వార్తలు

జూపిటర్ పిక్చర్స్‌వారి తెలుగు చిత్రం "ఇదేదారి" పూర్తికావచ్చినదని తెలుస్తోంది. సి. ఎన్. అన్నాదురై రచించిన కథతో ఇదివరలో తమిళంలో బాగా నడిచిన "వేలైక్కారి" ఈ చిత్రానికి ఆధారం. అంజలీదేవి, ఎన్. టి. రామారావు, జమున, జగ్గయ్య, రాజసులోచన, రేలంగి, ఆర్. నాగేంద్రరావు ఈ చిత్రంలో నటిస్తున్నారు. దర్శకుడు సి. పి. దీక్షిత్. సముద్రాలవారు మాటలు, పాటలు వ్రాశారు.

* * *

ఈనెల 6వ తేదీన నేషనల్ పిక్చర్స్‌వారి "పరాశక్తి" తెలుగు చిత్రం ఆంధ్రలో విడుదల అయినది. శివాజీగణేశన్, శ్రీరంజని ప్రధాన భూమికలు నిర్వహించారు. పాలగుమ్మి పద్మరాజు, సముద్రాల రాఘవాచార్యులుగార్లు మాటలు, పాటలు వ్రాశారు.

* * *


కన్యాశుల్కం చిత్రాన్ని వినోదావారు కీ. శే. గురజాడ అప్పారావుగారికి అంకితం న్నారు. శ్రీశ్రీ రచించిన "ఆనందం అర్ణవమైతే", గురజాడ "పూర్ణమ్మ" బసవరాజు అప్పారావుగారి "నాగుల చవితి", కృష్ణశాస్త్రిగారి "బొమ్మల పెళ్లి" మల్లాదివారి "చిటారుకొమ్మను" అనేపాటలు ఈ చిత్రంలో చేర్చబడినవి. సంగీతం ఘంటసాల, నృత్యాలు పసుమర్తి కృష్ణమూర్తిగార్లు సమకూర్చారు. ఈ చిత్రాన్ని ఆగస్టు 26వ తేదీన విడుదల చేయాలని, ఆంధ్రలో విడుదల చేసినప్పుడే మద్రాసులోకూడా విడుదలచేయాలని నిర్మాతలు ప్రయత్నిస్తున్నారు.

బొంబాయి సినిమాలేఖ

బొంబాయిలో ఇటీవల మూడుచిత్రాలు విడుదల అయినవి. నవకేతన్‌వారి "హౌస్ నం. 44"లో దేవ్ఆనంద్, కల్పనా నటించారు. మధురమైన సంగీతం, డిటెక్టివ్ కథ ఈచిత్రంలో ఆకర్షణలు. "కార్నివాల్ క్వీన్"లో పాత తార నాడియా నటించింది. ఇది స్టంటు చిత్రం. మూడవది సోహ్రాబ్ మోడీ నిర్మించిన "కుందన్". ఇది మంచి బాక్సాఫీస్ చిత్రం కాగలదని అంచనా.

* * *

ఫిల్మిస్థాన్‌వారి సినిమాస్కోప్ చిత్రం "బొంబే ఫ్లయిట్ 417"లో నటిస్తున్న వినితాబట్, ఆ చిత్రంలో మేకప్‌మాన్‌గా ఉన్న జిమ్మీ వినింగ్‌ను వివాహం చేసుకోబోతున్నది. ఈ చిత్రంలో వినితా, సూర్యకుమారి, హాలీవుడ్ నటులు అలెక్స్ డి అర్సి, జాన్‌లోడర్ నటిస్తున్నారు. అంతర్జాతీయ ప్రదర్శనకు తయారుచేయబడుతున్న చిత్రం గనుక, ఇందులో కామోద్రేకపూరిత సన్నివేశాలు, ఆలింగన చుంబన దృశ్యాలు విరివిగా ఉన్నాయి ఈ సన్నివేశాలలో హాలీవుడ్ నటులు అత్యుత్సాహంతో నటిస్తున్నారట. ఈ కారణంచేతనే నర్గీస్, వైజయంతీమాల, బీనారాయ్, నళినీ ఈ చిత్రంలో నటించడానికి నిరాకరించారు.



జూపిటర్ పిక్చర్స్‌వారి "ఇదేదారి" చిత్రంలో ఎన్. టి. రామారావు, జమున.

ప్రేక్షకుల అభిప్రాయాలు

"చెరపకురా చెడేవు"

చిత్రం బాగానే వుంది. నటీనటుల్లో ఎన్. టి. రామారావు చిన్న పోర్షనయినా బాగా పోషించాడు. అమర్‌నాథ్, జానకీలుకూడా ఫరవాలేదు. హాస్యం రేలంగి బాగా ప్రదర్శించాడు. "ఏడుజన్మలు" నాటకంలో "లైలామజ్ను" "దేవదాసు" "అనార్కలి"ల, లోని ఘట్టాలు చూపించడము బాగున్నది. పాటలలో "ఏడు జన్మలా ప్రేయసివి నీవే", "ఆపకురా మురళీ" బాగున్నవి. భాస్కరరావుగారు మొదటసారి దర్శకత్వం వహించినా చిత్రాన్ని బాగా తీశాడు. ఈ చిత్రం తప్పకుండా విజయవంతమౌతుంది.

తాటి - పరంధామ్,

—గుంటూరు.

* * *

ఈ చిత్రము అనేకమంది ప్రజలను ఆకర్షిస్తున్నది. ముఖ్యంగా రాజసులోచన, జానకి, అమర్‌నాథ్, ఆర్. నాగేశ్వరరావు గారలు అత్యద్భుతంగా నటించారు. ఎన్. టి. రామారావు, చంద్రకుమారి, పుష్పలత, లక్ష్మీరాజ్యం మామూలుగా నటించారు. ముఖ్యంగా రాజసులోచన నృత్యము కన్నుల పండువుగా వుంది. రేలంగి తన హాస్యముతో ప్రజలను ఉబ్బి తబ్బిబ్బు చేశాడు.

"గులాబీల తోట, బుల్ బుల్ పాట" అనే పాట నృత్యము చాలా మనోహరముగా వున్నవి. కనీసము ఈ పాటకైనా మరోసారి చిత్రాన్ని చూడాలనిపిస్తుంది.

ఆర్. వెంకటేశ్వర్లు,

—కర్నూలు.

* * *

బిమల్ రాయ్ నిర్మిస్తున్న "అమానత్" చిత్రంలో నటిస్తున్న చాంద్ ఉస్మానీ ఆ చిత్రం ప్రొడక్షన్ మేనేజరు మణిభట్టర్జీని వివాహం చేసుకొంటుందని బొంబాయి సినిమారంగంలో వినవస్తున్నది. ★

పెకింగ్‌లో భారతీయ చలనచిత్రోత్సవం

సెప్టెంబరు నెలలో భారతీయ చిత్రాలు దోబిఘాజమీన్, అవారా, ఆంధియాన్ చైనారాజధాని పెకింగ్‌లో ప్రదర్శింపబడతాయట. సెప్టెంబరు 22 నుండి 29 వరకూ పెకింగ్‌లోనూ, తర్వాత ఇతర నగరాలలోనూ భారతీయ చలనచిత్రోత్సవం జరుగుతుంది.

కథావస్తువు చాలా సంతృప్తికరంగా ఉన్నది. చిత్రానికి పేరు అతికినట్లుగా ఉండి సరిపోయింది. మాటలు చాలా బాగున్నాయి. ఘంటసాలవారి సంగీతం వీనుల విందుగా నున్నది. రేలంగి హాస్యము కొంతవరకు చిత్రవిజయానికి కారణం. మంచి స్టంటు వుండి ముఖ్యంగా పిల్లలను ఆకర్షించింది. రాజసులోచన నృత్యాలు ఇంపుగా వున్నాయి. "ఏడు జన్మలు" అనే అంతర్నాటకం ప్రేక్షకుల ప్రశంసలందుకొంది.

కె. రాజశేఖర రెడ్డి,

—గుంటూరు.

'తుమ్మెదా ఒకసారి...'

(10-వ పేజీ తరువాయి)

సించవచ్చు. అదేవిధంగా ఇష్టం వచ్చినన్నిసార్లు తుమ్మవచ్చునుకూడా! కాని ఈ తుమ్ముల్ని 'ఇతరులకు నష్టం కలగాలనే ఉద్దేశ్యంతో'; తన తుమ్ములవలన ఇతరులకు నష్టం కలగవచ్చునని తెలిసికూడా ఉదాసీనభావంతో ఉపయోగించడం రాజ్యాంగం సహించదు; అంగీకరించదు. ఎవరైనా ఉన్నత న్యాయస్థానానికి పోతే తప్పక నెగ్గుతారు.

నేను కర్తను ప్రార్థిస్తున్నాను. (ఆయన ఎవరో నాకు తెలియదు) నేను కర్తను ప్రార్థిస్తున్నాను: ఈ విధంగా - దురుద్దేశ్యంతో - 'ఒకసారి' తుమ్మడం తగదు! అసలు సాధ్యమయినంతవరకు తుమ్మనే తుమ్మవద్దు - కాని తప్పనిసరి అయితే అధమం రెండుసార్లేనా తుమ్మాలి! కర్తగారు నామాటలలోని సహృదయత్వాన్ని అంగీకరిస్తున్నారని ఆశిస్తున్నాను. అతిత్వరలోనే "తుమ్మెదా రెండుసార్లు..." అంటూ పాటను వినే అవకాశం కలుగుతుందని విశ్వసిస్తున్నాను. ★

రాజ్యం పిక్చర్స్‌వారి "హరిశ్చంద్ర" ప్రారంభోత్సవంలో క్లాప్ బోయ్, రేలంగి, చంద్రమతిగా నటిస్తున్న లక్ష్మీరాజ్యం. ఈ చిత్రంలో హరిశ్చంద్రుడుగా ఎస్. వి. రంగారావు నటిస్తాడట. దర్శకుడు: జంపన.





“జయసింహ” లో నర్తకి కుచలకుమారి.

Printed and Published for Nageswara Rao Estates Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor : S. Sambhu Prasad.